# డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

(1888-1975)



బయోగ్రఫీ సిరీస్

మనజాతి నిర్మాతలు - 3

# డా. సర్వేపల్లి రాధాకృష్ణన్

(1888 - 1975)

రచన

ఎ. రమాదేవి, యం.ఎ. బి.యిడి.

విక్టరీ పబ్లిషర్స్

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,

విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

©Ln. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ :2014

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - ఆంధ్రప్రదేశ్**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
30-17-3A, వారణాశివారి వీధి,
సీతారాంపురం, విజయవాడ - 2.
ఫోన్ : **0866 - 2444156**

❖ ❖ ❖

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ-520 003.
ఫోన్ : **(0866) 2570192, 2570309**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - తెలంగాణ**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మి నికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు-500027.
ఫోన్ : **(040) 65528228, 24653879**
(ఫాక్స్) **24745257,** సెల్ : **9346771314**

❖ ❖ ❖

**దుర్గా బుక్ డిస్ట్రిబ్యూటర్స్**
# 4-5-172, మొదటి అంతస్తు,
గోఖుల్ టవర్స్, గోఖుల్ చాట్ వెనుక,
హస్మత్‌గంజ్, కోటి,
హైదరాబాద్ - 500 095
ఫోన్ : **(040) 24752801, 64542801**

*Also available at*
**www.newshunt.com, www.kinige.com, www. rockstand.in**

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపు లలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచి లలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరిముద్రణలో సరిచేయగలం. ఏవిషయమైన **ramakumarimmadisetty@yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 32987503888 విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :* విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# జననం - బాల్యం - విద్యాభ్యాసం

తిరుత్తణి దాక్షిణాత్యులందరికీ పుణ్యక్షేత్రం. అది ఆంధ్ర తమిళదేశాల సరిహద్దుల మీద ఉన్న గ్రామం కాబట్టి రెండు భాషా సంస్కృతుల సంగమంగా దర్శనమిస్తుంది. పవిత్రమైన పుణ్యక్షేత్రం కాబట్టి ఆ పరిసరాలన్నింటా ఒక విధమైన పవిత్ర ప్రశాంత వాతావరణం ప్రతిఫలిస్తూ ఉంటుంది. తిరుత్తణి సుమారైన గ్రామం. చెన్నపట్టణానికి వాయవ్యంగా ఉంటుంది. తిరుత్తణి మహాపుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి క్షేత్రానికి సమీపంలో ఉన్నది. దాక్షిణాత్య భాషలకు, సంస్కృతులకు అది కూడలి. అందుకే ఆ పరిసర ప్రజలందరిలోనూ సమభావన, సామరస్యం పుష్కలంగా కనిపిస్తుంటాయి. తిరుత్తణి ప్రస్తుతం తమిళనాడుగా పిలువబడే రాష్ట్రంలోని ఉత్తర ఆర్కాటు జిల్లాలో ఉన్న ఒక గ్రామం.

తిరుత్తణిలో స్థానికంగా ఉండే జమిందారు సహృదయుడు. ఆయన దగ్గర కొలువుచేసే ఉద్యోగులు ఎందరో. అందులో సర్వేపల్లి వీరాస్వామి ఒకడు. వారిది అసలు స్వగ్రామం నెల్లూరి మండలంలోని సర్వేపల్లి గ్రామం. ఆ ప్రాంతంలో జీవనానికి కొంతకష్టం అయినందువలన మహాక్షేత్రమైన తిరుత్తణికి వీరాస్వామి పూర్వీకులు వలస వచ్చారు. అప్పటి నుంచి వారికి సాధారణమైన జీవనానికి లోటు లేదు. ఆ కుటుంబానికి విద్యాబుద్ధుల కొరత లేదు.

సర్వేపల్లి వీరాస్వామి అర్ధాంగి సీతమ్మ. దొడ్డ యిల్లాలు. భర్త చిన్న ఉద్యోగం చేసి తెచ్చే నాలుగు రాళ్ళతో ఆమె కుటుంబాన్ని గుట్టుగా పోషిస్తూ కాలాన్ని నెట్టుకొని వస్తున్నది. బ్రాహ్మణ కుటుంబం కాబట్టి, అందులోనూ మహాక్షేత్రంలో కాపురం కాబట్టి అతిథి అభ్యాగతులకు కొదువ లేదు. ఇంటికి వచ్చిపోయే చుట్టుపక్కాలకు లోటు లేదు. అయినా

సంసారం చాలీచాలని ఆదాయంతో మర్యాదకు లోటు లేకుండా నెట్టుకొని రావటానికి సీతమ్మ తల్లి ఓర్పు నేర్పు కారణం. సీతమ్మ, వీరాస్వామికి ఒక కుమారుడు కలిగాడు. ఇలా కాపురం సాగిపోతున్నది.

సరిగా ఇలాంటి సమయంలో 1888వ సంవత్సరం సెప్టెంబర్ నెల అయిదవ తేదీన వారికి ఇంకొక కుమారుడు జన్మించాడు. ఇంటిలో ఎందరు బిడ్డలుంటే అంత గొప్పతనంగా భావించిన రోజులవి. అందుకే రెండవ కుమారుడు పుట్టాక సీతమ్మ, వీరాస్వామి దంపతులు యెంతో సంతోషించారు.

అయితే ఆ బిడ్డ అంత బలంగా లేదు. పుట్టినప్పటి నుంచీ పీలగా, బలహీనంగా, అనారోగ్యంతో బాధ పడుతుండేవాడు. అందువల్ల తల్లి సీతమ్మ, తండ్రి వీరాస్వామి ఆ బిడ్డను కళ్ళలో వత్తులువేసుకొని కాపాడారు. అయితే కుటుంబం గడవటమే అంతంత మాత్రంగానే ఉండేది. అయినా ఏదో అదృశ్యశక్తి ఆ బిడ్డను కాపాడింది. భవిష్యత్తులో ఆయన మహాప్రస్థానానికి మార్గాలు వేసింది. సీతమ్మకు కృష్ణునిపై భక్తి మెండు. అందుకే బిడ్డకు రాధాకృష్ణయ్య అని పేరు పెడదామన్నది భర్తతో. ఆనందంతో వీరాస్వామి అలాగే అన్నాడు. ఆ బిడ్డే పెరిగి పెద్దవాడై విశ్వవిఖ్యాత తత్త్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గా ప్రఖ్యాతి చెందాడు. భావి తరాలకు ఒక 'ఆదర్శతత్త్వ ఆచార్యుడు', 'విశ్వగురువు', 'ప్రపంచ మహాపథికు'నిగా ఎదుగగలిగాడు.

చిన్న వయస్సు నుంచే, ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉన్నా, విషయ గ్రహణము, వివిధ విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి రాధాకృష్ణునికి ఎక్కువగానే ఉండేది. కొడుకులిద్దరికీ తల్లి గోరుముద్దలు తినిపిస్తూ చిట్టిపొట్టి మాటలు, కథలు చెప్తూ లాలిస్తుంటే, తండ్రి వీరాస్వామి బాల రామాయణం శ్లోకాలు, భగవత్ప్రార్థనా శ్లోకాలు, అమరకోశంలోని మొదటి శ్లోకాలు నెమ్మదిగా కొడుకులచేత పలికిస్తుండేవారు. అలా ప్రారంభం అయింది. ఆయన ప్రాథమిక విద్య. క్రమంగా రాధాకృష్ణకు నాలుగు సంవత్సరాలు నిండాయి. ఐదవ సంవత్సరం ప్రవేశించి ఐదు నెలల ఐదవ రోజున అక్షరాభ్యాసం చేశారు. ఆయనను ఊళ్లోనే ఉన్న బోర్డు ప్రైమరీ స్కూలులో వేశారు. ఆయన ఇంకా శైశవదశలోనే ఉన్నాడు. అయినా అద్భుతమైన మేధాశక్తి. ఒకసారి వింటేచాలు, ఇట్టే గ్రహించివేస్తాడు. ఆయన ఏకసంథాగ్రాహి. ఆయన మేధాశక్తి ఉపాధ్యాయులకు కూడా ఆశ్చర్యం కలిగించేది.

బోర్డు ప్రాథమిక పాఠశాలలో బాల రాధాకృష్ణ నాలుగు సంవత్సరాలు చదువు కొన్నాడు. ప్రాథమిక స్థాయిలో వాచక పుస్తకం త్వరగానే పూర్తి చేశాడు. క్రమంగా ఆయనకు ఉపాధ్యాయులు గణితము, చరిత్ర, భూగోళం, కొద్దిగా ఇంగ్లీషులను నేర్పించారు. కాబోయే

విజ్ఞానఖని ఆ నాలుగు సంవత్సరాల విద్యలోనే ఎన్నో విషయాలను ఆకళింపు చేసుకొని భావి వ్యక్తిత్వపు పునాదిగా మలచుకొన్నాడు. ఆయన నేర్చుకొన్న ప్రాథమిక విద్య ప్రాథమిక వికాసానికి పునాదే అయింది.

క్రమంగా ఆయనకు ఎనిమిది సంవత్సరాలు నిండాయి. వయసుకు మించిన విజ్ఞానాన్ని ఆకళింపుకు తెచ్చుకొంటున్నాడు. ఒకనాడు వీరాస్వామిని పిలిపించి ఉపాధ్యాయులు ఇక ఇక్కడ రాధాకృష్ణ చదువుకోగలిగినది ఏమీ లేదు. పిల్లవాడు బాగా చురుకైనవాడు. మరింత విద్యా సౌకర్యం కలిగించగలిగితే అతనికి మంచి భవిష్యత్తు ఉంటుందని సలహాయిచ్చారు. అంతేగాకుండా ఆ ఉపాధ్యాయులు అతనిలోని విద్యా పిపాసను కనిపెట్టి భావి కాలంలో గొప్ప విద్యావేత్తో, మహాపండితుడో కాగలిగిన లక్షణాలున్నాయని ఆయన తండ్రితో చెప్పారు.

వీరాస్వామికి ఏమి చేయాలో పాలుపోలేదు. చాలాసేపు భార్యతో ఆలోచించాడు. బాలుడి వయసు, నిండా ఎనిమిది సంవత్సరాలు లేవు. ఊరు మార్పించి విద్యకోసం వేరే ఊరికి పంపించాలి. తిరుత్తణికి దగ్గరలో ఉన్న ఊరు తిరుపతి. అక్కడ హెర్మన్స్‌బర్గ్ ఎవాంజిలికల్ లూథరన్ మిషన్ స్కూలు ఉన్నది. అక్కడ విద్యాబోధన బాగా ఉన్నది అని తెలిసింది. తమ గ్రామం నుంచి తిరుపతి ఎక్కువ దూరంకాదు కాబట్టి, బిడ్డ చిన్నవాడైనందున తరచుగా వెళ్లి చూసిరావచ్చని భావించాడు వీరాస్వామి. కానీ ఉన్నది ఒకటే సమస్య. అది డబ్బు. 'ధనమూల మిదంజగత్త'ని గదా. అసలే అది జర్మన్ మిషన్ స్కూలు. డబ్బులేనిదే ప్రవేశం కష్టం. కానీ బాలుడి భవిష్యత్తు ఆలోచిస్తే, అంతకంటే గత్యంతరం లేదు. అందుకే వీరాస్వామి ఏదైతే అదవుతుంది అక్కడే చేర్పించే ప్రయత్నం చేయాలని నిర్ణయించుకొన్నాడు. ఆ ప్రకారం రాధాకృష్ణన్ ఆ పాఠశాలలో ప్రవేశించగలిగాడు.

ఎవాంజిలికల్ పాఠశాలలో అంతా క్రొత్తగా ఉన్నది. అసలే రాధాకృష్ణ చాలా ముక్తసరిగా ఉండేవాడు. తోటి విద్యార్థులతో కూడా ఎక్కువ మాట్లాడేవాడు కాదు. మిగిలిన విద్యార్థులు ఆటపాటలతో కాలం గడుపుతూంటే ఆయన దూరంగా కనబడే ఎత్తైన దేవాలయ శిఖరాలు, కొండల లోయలు దర్శిస్తు ఏదో వింత అనుభూతిని పొందుతుండేవాడు. వాటిని దర్శించేటప్పుడు ఆయన తెలిసీ తెలియని ఊహల్లో ఎన్నో భావాలు మెదిలేవి. ప్రాచీన మహర్షులు ఏ భావధారలు కురిపించి ఈ మహాదేవాలయాల నిర్మాణం చేయించారో, ఆ మహర్షుల అమృతమయమైన వాగ్ధారలు తాను ఎలా అర్థం చేసుకోగలడో అని ఆలోచనలు కలిగేవి. ఏదో లీలగా అర్థమైనట్లుగా ఉండేది. అలా ఆలోచించేటప్పుడు

ఆయనకు ఆకలిదప్పులు తెలిసేవే కాదు. శెలవులలో ఇంటికి వచ్చినప్పుడు కూడా అంతే. ఏదో పరధ్యానం ఆలోచనలు. తల్లివచ్చి సమయమైందని "భోజనం చేయి నాయనా!" అంటేగానీ ఈ లోకంలోకి వచ్చేవాడు కాదు. తల్లి వచ్చిపోయే బంధుమిత్రులతో సతమతమవుతూ, తండ్రి ఉద్యోగధర్మ నిర్వహణలో ఎప్పుడూ విసుగూ విరామం లేని కార్యక్రమములలో నిమగ్నమై ఉంటే ఎప్పుడూ ఒంటరితనాన్నే ప్రేమించడం ఆ బిడ్డవంతైంది.

తిరుపతిలోని ఎవాంజిలికల్ పాఠశాలలో ప్రవేశించిన తరువాత ముందుగా రాధా కృష్ణన్‌కు బైబిల్‌తో పరిచయం అయింది. అందులో చెప్పబడిన విషయాలు తాను అంతకు ముందు తల్లి, తండ్రి ద్వారా తెలుసుకొన్న హైందవమత విధానాలు, సూత్రాల అంతరార్థం ఒకటిగా ఉన్నట్లనిపించేది ఆయనకు. తిరుపతిలో అడుగడుగున ఉన్న వివిధ దేవాల యాలకు ప్రతిరోజు పాఠశాల వదలిన తరువాత వెళ్లి దర్శించుకొని రావడం ఆయనకు ఎంతో సరదాగా ఉండేది. చాలా చిన్నతనంలోనే బైబిల్ పఠనము, హైందవ భక్తి శ్లోకాల మననము, భవిష్యత్తులో ప్రాక్పశ్చిమ తత్త్వాలను జీర్ణించుకొని వాటిని సమన్వయించుకొని ప్రపంచానికి సందేశం అందించగల మేధావిగా తీర్చిదిద్దటానికి ఎంతో ఉపయోగపడింది.

తిరుపతి మిషన్ పాఠశాలలో ఉపాధ్యాయులు రాధాకృష్ణ మేధాశక్తికి, విషయ గ్రహణకు ఆశ్చర్యపోయారు. ఆయన వారినెంతో ఆకర్షించేవాడు. విద్యలో అతని చురుకుదనం వారికి చాలా సంతోషం కలిగించింది. ప్రధానోపాధ్యాయుడు ఆయనను ప్రత్యేకంగా గమనిస్తున్నాడు. అలాంటి విద్యార్థి ఒకడు తమ పాఠశాలలో ఉండటం ఆయనకు చాలా సంతోషంగా ఉన్నది. అతని కుటుంబ పరిస్థితిని తెలుసుకొన్న ఆయన జాలిపడ్డాడు. ఆయనకు ఉపకార వేతనం యిప్పించటానికి తన శాయశక్తులా కృషి చేసి ఉపకారవేతనం వచ్చేటట్లు చేశాడు. ఇప్పుడు రాధాకృష్ణకు కొంత సంతోషంగా ఉన్నది. తన తండ్రి తనకోసం ఎక్కువ కష్టపడనవసరం లేదు. ఇంటినుంచి తండ్రి పంపేడబ్బును భోజనానికి వినియోగించుకొనేవాడు. ఉపకారవేతనంగా వచ్చిన డబ్బును పుస్తకాలు మొదలైనవి కొనుక్కొనటానికి ఉపయోగించుకొనేవాడు.

తిరుపతి వచ్చిన తరువాత కూడా అతను తోటి విద్యార్థులతో ఎక్కువ మాట్లాడకుండా ముభావంగా ఉండేవాడు. ఉబుసుపోక కబుర్లు చెప్పటం ఆయనకు ఏ మాత్రం యిష్టం లేనిపని. తిరగడంలోనూ అంతగా ఆసక్తి లేదు. చాలా దూరాలు ఒంటరిగా నడచి అక్కడ ఉన్న దేవాలయాలు చూస్తూ, వాటి నిర్మాణంలోని సొగసులు ఆకళింపు చేసుకొంటూ, ఏ ఉద్దేశ్యాన్ని ఆశించి అలాంటి నిర్మాణాలు చేశారో ఆ నిర్మాతలు అని ఆలోచిస్తూ

సమయం గడుపుతుండేవాడు. విద్యార్థిగా ఎలాంటి తుంటరి పనులు, అల్లరి, ఆకతాయి కృత్యాల జోలికి ఆయన ఎప్పుడూ పోయేవాడు కాదు. తనకు ఉపకారవేతనంగా లభించే డబ్బులో కొంత గ్రామాలు తిరిగి, దేవాలయాలు దర్శించటానికి అట్టేపెట్టుకొనేవాడు. ఆయనకు ఒంటరితనం అనుభవించాలంటేనే ఆనందంగా ఉండేది.

ఒకరోజు శలవుదినం. ఉదయంపూట అధ్యయన కార్యక్రమము ముగిసిన తరువాత ఆయన దూరంగా ఉన్న దేవాలయ దర్శనంకోసం బయలుదేరాడు. దారంతా నిర్మానుష్యంగా ఉన్నది. తోడు ఎవ్వరూ లేరు. అతను ఒంటరిగా వెళ్తున్న విషయం గమనించిన ఒక దొంగ అతని వెంటపడ్డాడు. చెవులకు బంగారు పోగులు, వ్రేలికి ఒక ఉంగరం ఉంటుందని ఆ దొంగకు తెలుసు. కొంతదూరం వెళ్లిన తరువాత దారికాచి రాధాకృష్ణను అటకాయించాడు. అతనిని దగ్గరలోనే ఉన్న ఒక పాడుబడిన బావిదగ్గరకు లాక్కొని వెళ్ళాడు. అసలే పీలగా, అర్భకంగా ఉండే రాధాకృష్ణ, దృఢకాయుడు, వయస్సులో బాగా పెద్దవాడైన ఆ దొంగకు తేలికగా లొంగిపోయాడు. అతని దుస్తులు శోధించాడు దొంగ. మూటకట్టి ఉన్న ఛాయ పెసరపప్పు ఒక గుప్పెడు తప్ప వేరేమీ దొరకలేదు, ఆ దొంగకు అతని దగ్గర. అందుకే ఇవ్వాళ ఎవరి మొహం చూశానో అనుకొంటూ అతనికి ఏకీడూ చేయకుండా అక్కడే వదలివేసి వెళ్లిపోయాడు. ఆ సంఘటన జరిగిన తరువాత కూడా ఆయన మనసులో భయంకలగలేదు. తరుచుగా దేవాలయాలను దర్శిస్తూనే ఉన్నాడు.

పాఠశాలకు క్రమం తప్పక వెళ్తున్నాడు రాధాకృష్ణ. పరీక్షలు దగ్గర పడుతున్నాయి. పై తరగతిలో ప్రవేశం సంపాదించాలంటే మంచిగుణాల (మార్కుల)తో పరీక్షలో నెగ్గాలి. ఆ రోజు అనారోగ్యం వలన పాఠశాలకు రాధాకృష్ణ వెళ్లలేకపోయాడు. ఆ రోజే పరీక్షాశుల్కం చెల్లించాలి. చిట్టచివరి అవకాశం అది. విద్యార్థులు అందరూ వచ్చి పరీక్షాశుల్కం చెల్లిస్తున్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎవరెవరు పరీక్షాశుల్కం చెల్లిస్తున్నారో గమనిస్తున్నాడు. రాధాకృష్ణ రాలేదు. అతడెందుకు రాలేదా అని ప్రధానోపాధ్యాయుడు ఆందోళన పడ్డాడు. విచారించాడు. అయితే కారణం తెలియలేదు. వివరాలు అందలేదు. సమయం మించిపోతున్నది. పాఠశాలలో ఉన్న పద్ధతులను అతిక్రమించి రాధాకృష్ణకు కబురు చేశాడు. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పైగా తండ్రి నుంచి పరీక్షా శుల్కం చెల్లించటానికి కావలసిన ధనం ఇంకా ఆయనకు అందలేదు. ప్రధానోపాధ్యాయుడు ఆయన పరిస్థితిని గమనించి తానే రాధాకృష్ణ చెల్లింపవలసిన శుల్కాన్ని చెల్లించాడు.

ఆ మరునాడు పాఠశాలకు వచ్చిన రాధాకృష్ణను పిలిపించి ప్రధానోపాధ్యాయుడు విషయాలను తెలుసుకొన్నాడు. ప్రధానోపాధ్యాయుడే శుల్కం చెల్లించినట్లుగా తెలిసిన

రాధాకృష్ణ ఆనందానికి హద్దే లేదు. ఎందుకంటే ఒక సంవత్సరం కాలం చదువు వృధా కాకుండా తన ప్రధానోపాధ్యాయుడు పరీక్షాశుల్కం చెల్లించి తనను ఆదుకొన్నాడు. ఆనాడే రాధాకృష్ణకు గురువుల మీద అపారమైన గౌరవం కలిగింది. భావికాలంలో తాను ఉత్తమ గురువు కావాలనే కోరిక మనసులో తటిల్లతలా మెరిసింది. విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య ప్రేమ, గౌరవం, భక్తి, వినయం సంపూర్తిగా పరిఢవిల్లిన కాలం అది. ఉపాధ్యా యులంటే తమ తల్లిదండ్రులవంటి వారని విద్యార్థులు భావించేవారు. విద్యార్థులంటే తమ కుమారులని ఉపాధ్యాయులు వారిని ప్రేమించి, ఆదరించి, ఆదుకొనే వారు. విద్యార్థులు తమ బిడ్డలు లాంటివారే అయినందున వారి భవిష్యత్తును గురించిన శ్రద్ధ ఉపాధ్యాయులకు ఉండేది.

ఇలా తిరుపతిలో నాలుగు సంవత్సరాలపాటు విద్య సాగింది. ఆయనకు పన్నెండు సంవత్సరాలు చెరిసగ పడ్డాయి. అది 1900వ సంవత్సరం. క్రొత్త శతాబ్దం ప్రవేశించింది. తిరుపతికి సమీపంలోనే వెల్లూరు ఉన్నది. అక్కడ కూడా క్రైస్తవ మిషనరీలు నడిపే ఒక పాఠశాల ఉన్నది. ఆ పాఠశాలలో తమ దగ్గర బంధువు ఒకాయన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. తమ దగ్గర ఉన్నదాని కంటే ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న తమ బంధువు దగ్గరకు పంపితేనే అన్ని విధాలా ఉత్తమంగా ఉంటుందని రాధాకృష్ణని వెల్లూరు పాఠశాలలో చేర్పించాలని భావించారు. త్వరలోనే ఆయన తిరుపతి నుంచి వెల్లూరుకు వెళ్ళి అక్కడ మిషన్ పాఠశాలలో ఉపాధ్యాయుడైన బంధువు పర్యవేక్షణలో ప్రవేశించాడు.

తమ ఉపాధ్యాయుడుగా ఉన్న బంధువు అతని విషయంలో ఆయనకు ఎంతో సహాయం చేశాడు. తమ ఉపాధ్యాయ బంధువు పర్యవేక్షణలో ఆయన విద్యాభ్యాసం ఇంకా చురుకుగా సాగింది. విద్యార్థికి మేధ ఎంత ఉన్నా దానిని సక్రమంగా వినియోగించి ఒక క్రమపద్ధతిలో వినియోగించి విద్యను అభ్యసించినప్పుడే ప్రయోజనం ఉంటుంది. ప్రయోజనకరమైన జ్ఞానం విద్యార్థికి సిద్ధిస్తుంది. ఉపాధ్యాయ బంధువు ఆయన విద్యా భ్యాసాన్ని క్రమబద్ధీకరించాడు. అందువలన రెండు సంవత్సరాల అనంతరం ఆయనకు పదిహేను సంవత్సరాల వయస్సులో, మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడు కాగలిగాడు. మొత్తం మద్రాసు విశ్వవిద్యాలయంలోనే ఆయన సర్వప్రథముడుగా ఈ పరీక్షలో ఉత్తీర్ణత పొందాడు. విశిష్ట గౌరవం లభించింది. ఆ సమయంలో వారి కళాశాల వారు ఉపకార వేతనం మంజూరు చేయటానికి ఆయనను పరీక్షిస్తూ బైబిల్ మీద అనేక ప్రశ్నలు అడిగారు. అన్నింటికీ తడుముకోకుండా చక్కని జవాబులిచ్చాడాయన. ఆ ఉపకారవేతనం ఆయనకు సునాయాసంగా లభించింది.

క్రమంగా ఆయనకు వయస్సు పెరుగుతున్నది. మనస్సులోని అంతర్నేత్రాలు తెరుచుకుంటున్నాయి. జ్ఞానకమలం వికసిస్తున్నది. రాధాకృష్ణలో విజ్ఞానపిపాస పెరుగుతున్నది. అందుబాటులో ఉన్న అనేక గ్రంథాలు చదవటం మొదలు పెట్టాడు. అదే సమయంలో ఆయన వివేకానందుని రచనలు చదవటం తటస్థించింది. ఆ రచనలు ఆయనలో నిద్రాణమై ఉన్న ఆలోచనలను రెచ్చగొట్టాయి. వాటిపట్ల చాలా ఆకర్షితుడైనాడు. ఆయన అమెరికా నుంచి వ్రాసిన లేఖలు ఉన్న పుస్తకం చదివాడాయన. ఆ లేఖలు ఆయనలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం అనే రెండు అంశాలను గ్రహించేటట్లుగా చేశాయి. అందువలననే యువతరాన్ని అమితంగా ఆకర్షించే ఆయన రచనలు రాధాకృష్ణను ఎంతో ఉత్తేజితుని చేశాయి. వివేకానందుని లేఖలు భారతీయయువకులలో అమిత ఆకర్షణ శక్తిని కలిగించటమే కాదు తరువాత కాలంలో వారిలో స్వాతంత్ర్య పిపాస కలిగించి, స్వాతంత్ర్య సమరంలో పాల్గొనే శక్తిగా పరిణమించాయి. ఇంకా స్వేచ్ఛకోసం పోరాడే స్వభావాన్ని అందించాయి. వినాయక దామోదర్ సావర్కార్ వ్రాసిన "1857 – ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం" అనే గ్రంథం రాధాకృష్ణన్‌ను అమితంగా ఆకర్షించింది. ఆయన యువరక్తాన్ని ఉఱ్ఱూత లూగించింది. ఉత్తేజితుడిని చేసింది. ఆ పుస్తకాల భిన్నత్వాన్ని గురించి, ఆ రెండూ తన మనసును ఎలా లోబరుచుకొన్నాయో ఆలోచించినప్పుడు ఆయనకు విజ్ఞానం బహుముఖీనమని, అది ఒక మహాసముద్రం అనే విషయం అర్థం అయింది. ఇంకా అనంతంగా ఉన్న విజ్ఞాన రోచిస్సులు తరువాత కళ్ళు తెరచి తనను ఆహ్వానించినట్లుగా భావన కలిగింది. ఇంకా ఇంకా చదవాలని ఈ అనంత విజ్ఞానాన్ని ఆపోశన పట్టాలని అనిపించింది. గ్రంథాలను చదవటమేకాదు అధ్యయనం చేయటం, తనకున్న పరిమిత ధనవనరులనుంచి గ్రంథాలను కొని తనవిగా చేసుకోవటం మొదలు పెట్టాడు. కాబట్టి విస్తారంగా గ్రంథాలు చదివే అవకాశం కలిగింది. అదే ఆయనకు వ్యాపకంగా కూడా మారింది.

క్రమంగా గ్రంథాధ్యయనం చేసే కొద్దీ ఆయనలో అంతర్నేత్రాలు విప్పారుతున్నాయి. జ్ఞాన కుసుమాలు వికసిస్తున్నాయి. ఒక విజ్ఞాన పిపాసువు ఆయనలో రూపుదిద్దుకొన్నాడు. మనిషి జీవనం కేవలం తన కోసం కాదని అతని చుట్టూ ఒక సమాజం ఉన్నదని, ఆ సమాజంపట్ల అతనికి కొన్ని బాధ్యతలున్నాయని గ్రహించగలిగాడు. అందువలననే ఆయన అన్ని విధాలుగా సత్ప్రవర్తనను అలవరచుకొన్నాడు. చక్కగా మాట్లాడగలగడమే కాదు. తనలో వికసిస్తున్న భావాలను వ్యక్తీకరించటానికి ఖచ్చితమైన, శక్తివంతమైన పదాలను కూడా ఉపయోగించగలిగిన నేర్పువచ్చింది. ఎన్నో పుస్తకాలను అధ్యయనం చేసిన ఫలితంగా

ఆయన మాట్లాడేటప్పుడు ఆకర్షణీయమైన వాక్య విన్యాస శైలి బలమైన అర్థవ్యక్తీకరణ అలవాటైంది. ఉన్నత ఆదర్శాలు అలవాటైనందున ఎటువంటి దురభ్యాసాలు అలవాటు కాలేదు. ఆనాడు అనేకులు విద్యావంతులు 'ఫ్యాషన్' కోసమో, డాంబికం కోసమో పొగత్రాగటం, ఆల్కహాలు సేవించడం మొదలైన దురలవాట్లు చేసుకొన్నా, అవి ఎలాంటివో కూడా ఆయన జీవితమంతా ఎరుగడు. ఎంత వయసొచ్చినా, ఎన్ని దేశాలు పర్యటించినా శుద్ధశాకాహారిగానే మిగిలిపోయాడాయన.

అది 1903వ సంవత్సరం. ఆ సమయంలో ఆయనకు 16వ సంవత్సరం ప్రవేశించింది. అరవై నుంచి వంద రూపాయల ఉపకారవేతనం లభిస్తున్నది. తన పుస్తకాలు, ఇతర ఖర్చులు గడుపుకోవటం కోసమే కాక, తనకన్నా నిర్ధనులై, తనలాగా విద్యాభ్యాసం చేస్తున్న పేద విద్యార్థులకు తన ఉపకారవేతనంలో నుంచి కొంత సహాయం చేస్తుండేవాడు. క్రమంగా కళలపై ఆసక్తి పెరిగింది. వీధి నాటకాలు చూడటం అలవాటు చేసుకొన్నాడు. అయినా ఇవి ఏవీ ఆయన విద్యాభ్యాసానికి ఆటంకాలుగా ఉండేవి కావు. చాలా పొదుపుగా ఖర్చు చేసేవాడు. విలాసాలకు ఆయనకు ఆమడదూరం.

క్రమంగా బుద్ధేకాదు శరీరం కూడా వికసించింది. షోడశవర్షప్రాయుడైనాడు. బాల్యంలో నుంచి యౌవనంలోకి ప్రవేశించాడు. మనస్సు చిత్రవిచిత్రాలైన ఆలోచనలకు అగ్గలమైంది. స్త్రీల పట్ల ఏవో తెలియని విచిత్ర భావాలు కలుగుతున్నాయి. అలా అని అవి వ్యామోహపుటాలోచనలు మాత్రం కావు. తన ప్రవర్తనలోనే కొన్ని మార్పులు కలుగుతున్నట్లు ఆయన గమనించాడు. తన గురించిన ఆలోచనలు తరచుగా వస్తున్నాయి. అలా అని హద్దులు మీరిన పాపాలు చేయాలనే ఆలోచనలైతే ఎప్పుడు ఆయనదరిచేరలేదు. ఆ సమయంలో ఇంకా ఆయన వెల్లూరు పాఠశాలలోనే విద్యాభ్యాసం చేస్తున్నాడు. సరిగా ఇదే సమయంలో ఆయనకు వివాహమైంది.

★ ★ ★

# ఉన్నత విద్య

వెల్లూరులో పాఠశాల చదువు అయిపోయిన రాధాకృష్ణన్ అక్కడే ఆ రోజులలో ఎఫ్.ఏ. (ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్)గా చెప్పబడే ఇంటర్మీడియట్ తరగతిని చాలామంచి మార్కులతో 1904లో ఉత్తీర్ణుడైనాడు. ప్రథమశ్రేణి లభించింది. అందులో పాఠ్య విషయాలుగా ఉన్న గణితం, మనస్తత్వశాస్త్రం, చరిత్రలలో అత్యధిక మార్కులు సంపాదించుకొన్నాడు. వెల్లూరులో విద్య పరిసమాప్తి అయినట్లే. తరువాత చేయవలసినది మద్రాసు నగరంలో విద్యాభ్యాసం. క్రింది తరగతిలో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడైనందువలన మద్రాసు క్రైస్తవ కళాశాలలో ఆయనకు ఉపకారవేతనం కూడా లభించింది. తరువాత ఆయన బి.ఏ. (పట్టపరీక్ష)కు చదవాలి. పట్టతరగతులలో ఒక అంశాన్ని ప్రధాన అంశంగాను, మరి రెండు అంశాలు ఉప అంశాలుగాను స్వీకరించాలి. ఆయనకు అన్ని విషయాలలోనూ సమాన ప్రతిభే ఉన్నది. కానీ ఏ విషయం ప్రధాన పాఠ్యాంశంగా స్వీకరించాలి? ఆయన శరీర విజ్ఞాన ప్రధాన పాఠ్యాంశంగా స్వీకరించాలనుకొన్నాడు. ఇలాంటి సమయంలోనే ఆయన ఊహించని విషయం ఒకటి జరిగింది.

బి.ఏ. చదవాలంటే ఎన్నో పుస్తకాలు కావాలి. వాటి ఖరీదు వందల రూపాయలు గానే ఉండవచ్చు. ఆ సమయంలో ఆయనవద్ద అంతధనం లేదు. పైగా అంతధనం సేకరించడం కూడా కష్టమే. ఏం చేయాలా? అని ఆలోచిస్తున్నాడు రాధాకృష్ణ. మానవ జీవితాన్ని నడిపించే ఏదో ఒక అదృశ్యశక్తి ఆయన కోరుకొన్నట్లుగా శరీర విజ్ఞానశాస్త్రాన్ని చదివే అవకాశం కలుగనీయలేదు. ఆ సమయంలో ఆయన బంధువుల అబ్బాయి ఒకడు తత్త్వశాస్త్రంలో బి.ఏ. పూర్తిచేశాడు. ఆ తత్త్వశాస్త్రాన్నే ప్రధాన విషయంగా తీసుకొంటే అతనినుంచి పుస్తకాలు తీసుకొని తాను వినియోగించుకోవచ్చు. అప్పుడు తాను ధనసేకరణ

కోసం పెద్దగా కష్టపడే పని తప్పిపోతుంది. ఈ చిన్నకారణంతోనే ఆయన శరీర విజ్ఞానశాస్త్రం చదవాలన్న ఆలోచనను విరమించుకొని తత్త్వశాస్త్రాన్ని ఐచ్ఛిక విషయంగా తీసుకొన్నాడు.

పరిస్థితుల ప్రాబల్యం ఆయన విధిని నిర్దేశించి తత్త్వశాస్త్రాన్ని అధ్యయనం చేసేటట్లు చేసిందేగానీ పూర్తి అభిమానంతో దానిని స్వీకరించలేదు. మనిషి జీవితాలకు విధే దిక్సూచి అయి జీవితగతులనూ, గమ్యాలను మార్చడమంటే ఇదే. తత్త్వశాస్త్రనిష్ణాతుడై మహాదార్శ నికుడుగా వెలుగొంద గలిగిన అవకాశం ఆయనకు ఆ విధంగా లభ్యంఅయింది. తరువాత ఒక సమయంలో మనం విధి అన్నా, ప్రకృతి అన్నా, తలరాత అన్నా, రాసిపెట్టిన బ్రహ్మగీత అన్నా ఎలా వర్ణించినా ఏదో మనకు తెలియని అదృశ్యశక్తి, దీనినే భగవంతుడు అనీ అదృష్టం అనీ ఎలా అన్నా, మనసు నడిపించే మహాశక్తి సంకల్పమే యిది అని వివరించారాయన.

ఆయన కళాశాల విద్యకు పట్టపరీక్ష కోసం (బి.ఏ.) మద్రాసు క్రైస్తవ కళాశాలలో ప్రవేశించాడు. మద్రాసు క్రైస్తవ కళాశాలకు నాడు గొప్ప విద్యాకేంద్రంగా చక్కని పేరు ఉండేది. అందులో విద్యనభ్యసించి బయటకు వచ్చిన వారికి విశేష గౌరవం లభ్యం అయ్యేది.

పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థంలో, ఇరవయ్యవ శతాబ్దం పూర్వార్ధంలో బాగా పేరు పొందిన సాహిత్య ఆచార్యుడు విలియం మిల్లర్. ఆయన మిషనరీగా ఉంటూ సాహిత్య విద్యాబోధన నెరిపేవాడు. ఆయనే క్రైస్తవ కళాశాలలో షేక్స్పియర్ మహాకవి సాహిత్యాన్ని రాధాకృష్ణన్ తరగతివారికి బోధిస్తుండేవాడు. ఆ కళాశాలలో ఎ.జి. హగ్గ అనే ఆంగ్లపండితుడు తత్త్వశాస్త్రాచార్యుడు. ఆయన తత్త్వశాస్త్ర నిర్వచనాలు బోధించడంలో చాలా దిట్ట. తత్త్వశాస్త్ర సిద్ధాంతాలు, వివరణలు, రాధాకృష్ణన్‌కు బోధించి, ఆ శాస్త్రంపై ఆయనకు ఆసక్తి కలిగేటట్లు చేసి, ఆయన మస్తిష్కానికి తత్త్వశాస్త్రదార్శనిక సూత్రాల వాకిళ్ళు తెరచినవాడు ఈ హగ్గ మహాశయుడు. ఈ సకల చరాచర మహాసృష్టిలో సత్యంయేది? నిలిచి ఉండేది అంటే శాశ్వతమైనదేది? ఈ అనంత మహావిశ్వంలో మానవుని స్థితి ఎట్టిది? ఈ గవేషణకు తత్త్వదర్శనాలు ఏయే విధాలుగా ఉపయోగపడగలవు? మొదలైన అంశాలను ఆయన రాధాకృష్ణకు ప్రబోధం కలిగించి, తత్త్వశాస్త్ర విజ్ఞాన అవగాహనకు సోపానాలు ఆయన మస్తిష్కంలో ప్రవేశింపచేయగలిగాడు. హగ్గ ప్రముఖ తత్త్వాచార్యుడు. ఆధునిక దృక్పథంలో తత్త్వనిర్వచనాలు ఇవ్వగల దార్శనిక భావాలను రాధాకృష్ణన్‌లో పాదుకొలిపి, ఒక సమగ్ర తత్త్వవీక్షణం చేయగలిగేటట్లు చేసిన మహనీయుడు హగ్గ పండితుడు. ఇలాంటి ప్రథమశ్రేణి అధ్యాపకుల వద్ద అధ్యయనం చేసి 1906వ

సంవత్సరంలో, ఆయన తత్త్వశాస్త్రంలో బి.ఏ. పట్టాను ప్రథమశ్రేణిలో మద్రాసు విశ్వ విద్యాలయం నుంచి స్వీకరించాడు. తత్త్వశాస్త్రంలో ఆ సంవత్సరం ఆయన విశ్వ విద్యాలయంలో సర్వప్రథమునిగా నిలబడ్డాడు.

ఎలాంటి బాధలుపడినా తత్త్వశాస్త్రంలో ఎం.ఏ. చేసి స్నాతకోత్తర పట్టా పొందాలనే కృతనిశ్చయానికి వచ్చాడాయన. ఎం.ఏ. తరగతిలో ప్రవేశించాడు. అక్కడ కూడా హగ్గ పండితుడు ఉపన్యాసకుడు. ఆయన భగవద్గీత కాకుండా మిగిలిన ప్రపంచ ప్రముఖ తత్త్వవేత్తల తత్త్వ గ్రంథాలను బోధించడం మొదలు పెట్టాడు. క్రమంగా రాధా కృష్ణుని దృక్పథం విశాలంగా మారటం మొదలైంది. హిందువుల నమ్మకాలు, ఆచార వ్యవహారాల లోని ఉచితానుచితాలను వితర్కించి వాటిలో సరియైనవి ఏవి? తద్విరుద్ధమైన వేవి అని వివేచించుకొనే ధోరణి రాధాకృష్ణన్‌కు ఈ సమయంలో ఏర్పడింది. ఎం.ఏ.కు బోధించే వారిలో చాలామంది రాధాకృష్ణన్‌ను చాలా అభిమానించేవారు. ప్రత్యేకంగా గౌరవించేవారు. “స్పష్టత కలిగి ఆలోచించటం, స్వేచ్ఛగా నిర్ణయించి విషయాలను అర్థం చేసుకోవటం, చదివిన దానిని తనకుగల విజ్ఞానంతో సమన్వయించుకొని జీర్ణించుకోవటం రాధాకృష్ణన్ ప్రత్యేకత! అస్పష్టమయిన ఆలోచనలకు అతని మనస్సులో తావులేదు” అని ఆ సమయంలో రాధాకృష్ణన్‌కు బోధించిన ఉపాధ్యాయుడు విలియం మెస్టన్ వ్రాశాడు.

పద్ధతి ప్రకారం ఎం.ఏ. వారు సమర్పించవలసిన, ఆయన వ్రాసిన పరిశోధనా వ్యాసం అంగీకరించబడింది. అది అచిరకాలంలోనే ప్రచురణను కూడా పొందింది. భవిష్యత్తులో రాధాకృష్ణన్ గొప్ప రచనలు చేయగలరనే అంశాన్ని ఈ వ్యాసం నిశ్చయ పరచింది. ప్రపంచ మానవులందరూ సోదరప్రాయులేనని, మతాలు వారిని విడదీస్తున్న అడ్డుగోడలుగా ఉన్నాయి. కాబట్టి మానవులంతా మతపరిధి నుంచి అధిగమించి ఆలోచించాలి. ప్రేమ, సహజీవనం, స్వేచ్ఛ, ఉన్నతమైన మానవ జీవితపు విలువలు, ధర్మము, మోక్షము మానవ జీవితపు మూలసిద్ధాంతాలనీ, స్వేచ్ఛ, ప్రేమ ప్రపంచ మానవులను సంఘటితపరచే మూలసూత్రాలనీ ఆయన ఈ పరిశోధనా వ్యాసంలో వివరించాడు. 1909లో ఆయన ఏం.ఏ. పూర్తిచేశాడు.

విద్యాభ్యాసం పూర్తై ఎం.ఏ. పట్టభద్రుడైనందుచేత ఇక ఉద్యోగాన్వేషణ ప్రారంభించాడు.

★ ★ ★

# అధ్యాపకునిగా ఉద్యోగ జీవితం

రాధాకృష్ణన్ 1909లో ఎం.ఏ. తత్త్వశాస్త్రంలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. ఇక ఆయనకు ఉద్యోగ ప్రయత్నం చేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ సమయంలోనే స్నాతకోత్తర తరగతిలో (ఏం.ఏ.) ఆయనకు ఉపాధ్యాయుడుగా ఉన్న స్కిన్నర్ మహాశయుడు ఆపద్బాంధవునివలె సహాయం చేయటానికి ముందుకు వచ్చాడు.

స్కిన్నర్ అప్పటి విద్యాధికారికి 'ఈ మధ్యకాలంలో అత్యుత్తమ విద్యార్థి' అని పరిచయం చేస్తూ ఒక సిఫారసు పత్రాన్ని వ్రాసి యిచ్చాడు. ఆ సిఫారసు లేఖ బలంతో పాఠశాలల ఉపసహాయ విద్యావిచారణాధికారి (సబ్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్) ఉద్యోగంలో ఆయనను నియమించారు. కానీ ఆయన నిర్వర్తించవలసిన విధులు చెన్ననగర రాజధానీ కళాశాల (మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజి)లో మళయాళం పాఠాలు బోధించటం. నిజానికి ఆయనకు మళయాళం రాదు. అలాంటి ఉద్యోగాన్ని స్వీకరించడం ఆయనకు సుతరాము ఇష్టం లేదు. కానీ ఈ ఉద్యోగం వలన లభ్యమయ్యే అరవై, డెబ్బై రూపాయల వేతనం తన కుటుంబానికీ అత్యవసరం. అందువలన ఆ ఉద్యోగంలో ప్రవేశించడం ఆయనకు తప్పనిసరి అయింది. ఈ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వేరే ఉద్యోగం కోసం ప్రయత్నం చేయవచ్చుననుకొన్నాడాయన. త్వరలోనే ఆ మోజుతీరే అవకాశం వచ్చింది ఆయనకు.

సైదాపేటలో విద్యాబోధనలో డిప్లొమోకు అర్హత కలిగించే శిక్షణయిచ్చే శిక్షణ పాఠశాలకు కూడా వెళ్లి శిక్షణ పొందవలసి ఉన్నందున వెళ్ళి వచ్చేటందుకు సగం జీతం మీద ఆయనకు అనుమతి లభించింది. దీనితో వచ్చే జీతం సగం అయింది. కేవలం ముప్పైఏడున్నర రూపాయలుగా తగ్గింది. దీంతో కుటుంబం నిర్వహించటం చాలా కష్టమే అయింది. అవసరాలకు సరిపోయే ధనం సంపాదించటానికి ఆ రోజులో ఒక క్షణం

కూడా విశ్రాంతిగా కూర్చొనే అవకాశం లేకుండా పోయింది. రోజంతా ఆయన ప్రైవేటు ట్యూషన్లు చెప్పేవాడు. న్యాయశాఖ పరీక్షా పత్రాలు దిద్ది అర్ధరాత్రి దాటింతర్వాత నిద్రపోవలసి వచ్చేది.

సైదాపేట కళాశాలలో ఉన్నప్పుడు ఆయన 'మనస్తత్వశాస్త్ర ముఖ్యాంశాలు' 'ఎస్సన్షియల్స్ ఆఫ్ సైకాలజీ' అనే గ్రంథం వ్రాశాడు. ఈ గ్రంథ రచనతో ఆయనకుకీర్తి బాగా వచ్చింది. కళాశాల సిబ్బంది, స్థానికులు ఆయనలో నివురుగప్పి ఉన్న ప్రతిభను గుర్తించారు. తత్త్వశాస్త్రం మీద రాధాకృష్ణన్ ఉపన్యాసాలను వారు ఏర్పాటు చేశారు. ఈ ఉపన్యాసాలలో తన ప్రతిభను అంతటినీ నిరూపించుకున్నాడాయన. ఆయన ఉపన్యాసాలు వినటానికి కళాశాల ప్రధానాచార్యులు, ఆచార్యులు కూడా విచ్చేసేవారు. కళాశాల ప్రధానాచార్యుడు ఒకసారి 'నీవు చెప్పిన ఉపన్యాసం చాలా అద్భుతంగా ఉన్నది. నేను స్వయంగా ఉపన్యసిస్తే ఎలా ఉంటుందో అలాగే ఉన్నది" అన్నాడు.

అటుతరువాత 1911వ సంవత్సరంలో ఆయన సైదాపేట కళాశాలలో మానుకొని వచ్చి (ప్రెసిడెన్సీ కాలేజీ) రాజధాని కళాశాలలో అడిషనల్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఈ ఉద్యోగం ఆయనకు వృత్తిలో తృప్తిని, సంతోషాన్ని కలిగించటమే కాదు, ప్రవృత్తిలో కూడా చాలా సంతృప్తికరంగా ఉన్నది. అయిదు సంవత్సరాల తరువాత ఆయన సహాయ ప్రొఫెసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాడు. ఈ ఉద్యోగంలో త్రికరణశుద్ధిగా ఆయనకు తన ప్రతిభా పాటవాలు చూపించే అవకాశం కలిగింది. కళాశాలలో బోధన చేసేటప్పుడు విద్యార్థులందరూ ఆయన బోధించే విషయం వినటానికి చాలా ఆకర్షితులయ్యే వారు. త్వరలోనే ఆయన బోధనా పటిమ యితర కళాశాలల విద్యార్థులకు కూడా తెలిసింది. వారు కూడా ఆయన తరగతులకు ఆసక్తితో వచ్చి కూర్చొని పాఠాలను వినేవారు. ఆయనది చక్కని వాగ్దాటి. అదే ఆయన ప్రత్యేకత. ఏనాడూ తాను వ్రాసుకొన్న నోట్సును చదవటం, లేకపోతే పాఠ్యపుస్తకాన్ని తెరిచి చూడటం చేయలేదాయన. అందుచేతనే అల్లరి చేయాలని వచ్చిన తుంటరి విద్యార్థులు కూడా ఆయన తరగతి గదిలో బోధిస్తున్నప్పుడు, ఆ విషయమే మరచిపోయి, అల్లరిమాని ఎంతో ఆసక్తితో ఆయన పాఠాన్ని వినేవారు. తరగతి గది ఎప్పుడూ చీమచిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దంగా ఉండేది.

రాధాకృష్ణన్ ఆకారం ఆదర్శ ఉపాధ్యాయుని వేషభాషలవలెనే ఉండేది. తెల్లని ధోవతి కట్టుకొని దానిమీద పొడుగు సిల్కు కోటు ధరించేవాడాయన. మెడనుంచి మోకాళ్ల వరకు కోటు గుండీలు బిగించుకొనేవాడు. చక్కని తెల్లని తలపాగా ధరించి తన ఆకృతికి తగినట్లుగా హుందాగా ఉండేవాడాయన. చూడగానే ఆయనపై ఎంతో గౌరవభావం

కలిగేది. సామాన్యంగా నల్లంచు తెల్లధోవతి క్రింద పాదాలకు నల్లటి పాదరక్షలు ధరించేవాడాయన. మడత పెట్టినట్లు ఉత్తరీయం వల్లెవాటుగా మెడలో వేసుకొనేవాడు. ఆయన రూపం, ఆకారం ఆయన చేసే పదవికే హుందాతనాన్ని తెచ్చేటట్లుగా ఉండేది. విదేశాలకు వెళ్లినప్పుడు కూడా ఆయన ధరించే దుస్తుల విధానం కొద్దిగా మాత్రమే మారేది. గట్టిగా పాతికేళ్లు కూడా నిండని ఆయనను విద్యార్థులు "కుర్ర ప్రొఫెసర్‌గారు" ని ముద్దుగా పిలుచుకొనేవారు. ఎంతో అభిమానం చూపేవారు. క్రమంగా ఆయన కీర్తి దేశంలో వ్యాపించటం మొదలైంది.

ఉపాధ్యాయుడుగా రాజధాని కళాశాలలో పనిచేస్తున్నప్పుడు ఆయనకు మహ్మద్ ఉస్మాన్ అనే ఆయనతో పరిచయం అయింది. ఆయన ఆర్థికంగా కూడా రాధాకృష్ణన్‌కు అప్పుడప్పుడు సహాయం చేస్తుండేవాడు. మహమ్మద్ ఉస్మాన్ ఒక రోజున రాధాకృష్ణన్ దగ్గరకు వచ్చి "అయ్యా నాకు బి.ఏ. చదవాలని ఉన్నది. మీరు పాఠం చెప్తానంటే బి.ఏ. చదువుతాను. బి.ఏ. చదువుకంటే నా జీవితంలో చేయగలిగిన గొప్పపని మరేమీ ఉండదు" అని అన్నాడు. ఆయన అందుకు అంగీకరించి ఉస్మాన్‌కు మనస్తత్వశాస్త్రంలో పాఠాలు చెప్పి ప్రోత్సహించాడు. తరువాత మహమ్మద్ ఉస్మాన్ బి.ఏ.లో ఉత్తీర్ణుడైనాడు. 'బి.ఏ.లో ఉత్తీర్ణుడు కావటం కంటే అంతకన్నా మరేమీ చేయలేనని చెప్పిన ఉస్మాన్ తరువాత కాలంలో ప్రెసిడెన్సీ కాలేజ్ వైస్‌ఛాన్సలర్ పదవిని అలంకరించాడు. మద్రాసు రాష్ట్ర గవర్నరుగా పనిచేశాడు. వైస్రాయి కౌన్సిల్ సభ్యుడు కూడా కాగలిగాడు.

కొంత ఆర్థిక పరిస్థితి చక్కబడినందువలన రాధాకృష్ణకు అధ్యయన అధ్యాపనాలకు తగినంత వెసులుబాటు లభ్యం అయింది. సాంఘిక జీవనం కూడా సాఫీగా నడుస్తున్నది. ఆయన ఈ సమయంలోనే బైబిల్‌ను శ్రద్ధగా అధ్యయనం చేయటం ప్రారంభించాడు. దానితో పాటే ఐరోపీయుల ఆలోచనలను ఆచరణలను అవగాహన చేసుకొనే అధ్యయనం ప్రారంభించాడు. ఈ సమయంలో ఆయనకు అవసరమైనవి, అభిమానపాత్రమైన ఎన్నో విలువైన గ్రంథాలను తనజీతంలో కూడబెట్టుకొన్న ప్రతిపైసా పైసా వెచ్చించి సేకరించుకోగలిగాడు. వీటిల్లో మహాతత్త్వవేత్తలైన ప్లేటో, అరిస్టాటిల్, ఆగస్టెయిన్, కాంట్, లోకే మిల్ లాంటి మహామహుల గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. ఆయన కొన్న పుస్తకాలలో చదవనిది లేదు. చదివి మరచిపోయిన విషయం లేదు. కేవలం తత్త్వశాస్త్రమే గాకుండా ఆయనకు సాహిత్యమంటే చాలా ప్రీతి. అందుకే ఆంగ్లసాహిత్యకారులలో ప్రముఖులైన ఛాసర్, బ్లేక్, లాంగ్‌ఫెలోల కవితలను ఆసక్తితో పఠించాడు. ప్లూటార్క్, ఫ్రాయిడ్, కార్లైల్ మొదలైన పండితుల గ్రంథాలను వంటబట్టించుకొన్నాడు. డార్విన్, థామస్ హక్స్లీ,

హెగెల్ మొదలైన వారి ఉద్గ్రంథాలు పఠించి క్షుణ్ణంగా ఆకళింపు చేసుకొన్నాడు. ఆయన విజ్ఞాన తృష్ణను తీర్చటానికి అనేక గ్రంథాలయాలను కూడా ఆశ్రయించవలసి వచ్చింది. ఇలా పశ్చిమీయుల భావజాలాన్ని అంతరంగంలో బంధించుకొనటంతో ఆయన సంతృప్తిపడలేకపోయాడు.

ప్రాచ్యతత్త్వశాస్త్ర మూలగ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు, నారద భక్తి సూత్రాలు, స్మృతులు మొదలైన ఉద్గ్రంథాలను ఆయన అధ్యయనం చేయటం మొదలు పెట్టాడు. వీటితోపాటు బౌద్ధ జైన మత గ్రంథాలైన త్రిపిటకాలు, దమ్మపదం మొదలైన గ్రంథాలను శ్రద్ధగా పఠించాడు. ఆ గ్రంథాలలో చెప్పబడిన విషయాలు ఆయనకు త్వరలోనే కరతలామలకాలైనాయి. ఏ మాత్రం అవకాశం వచ్చినా ఈ విషయాల మీద ఆయన ఉపన్యాసాలు ఇవ్వటం మొదలు పెట్టాడు. అందువలన ఆయా విషయాలపై ఆయన ఇంకా నిష్ణాతుడు కాగలిగాడు.

మనదేశంలో జాతీయోద్యమానికి ఊపు 1908వ సంవత్సరంలో వచ్చిందనే విషయం అందరూ అంగీకరించేదే. ఆ సమయంలో రాధాకృష్ణన్ విద్యార్థిగా ఉన్నాడు. క్రమంగా ఈ ఉద్యమం ఊపందుకుంది. ఈ ఉద్యమ నీడలో సాగిన భారత రాజకీయాలు, స్వాతంత్ర్య సముపార్జనోద్యమాల ప్రభావం రాధాకృష్ణన్ అధ్యాపక బాధ్యతల మీద కూడా కొంత ప్రభావాన్ని చూపింది. పంజాబ్‌లో లాలాలజపతిరాయ్ లేవదీసిన బృహత్తర ఉద్యమ ప్రకంపనలు యావద్దేశంలోనూ విద్యాధికులను చలింపచేశాయి. మద్రాసు ప్రాంతంలోనూ ఈ ప్రకంపనలు కనిపించాయి. మద్రాసు విద్యార్థులు కూడా ఈ ప్రకంపనలకు చలించారు. అనేక ఉద్యమాలు నిర్వహించారు. వారు రాధాకృష్ణ మీద కూడా వత్తిడిని తీసుకొచ్చారు. దాని ఫలితంగా ఆయన మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభకు హాజరైనాడు. అప్పుడే ఆయనకు మదనమోహన మాలవ్య, బాలగంగాధర తిలక్, రాస్ బిహారీ బోస్ వంటి వారితో పరిచయం జరిగింది. ఈ ఉద్యమం భారతీయ వేదాంతానికి, తాత్త్విక మార్గానికి అనుకూలంగానే ఉన్నట్లు ఆయనకు అనిపించింది. ఇంకా సురేంద్రనాథ బెనర్జీ, అనిబిసెంట్ లాంటి వారిపై ఆయనకు ప్రత్యేక ఆకర్షణ కలిగింది. కానీ ఆ రోజుల్లో స్వాతంత్ర్య ఉద్యమకారులతో ఎలాంటి సంబంధాలైన ఆంగ్ల ప్రభుత్వం వారి దృష్టిలో అపరాధాలే. అందుమూలంగా వారి జీవితాలు అనేక చిక్కులుపడి, అల్లకల్లోలపడిపోయేవి. అందుకే ఆయన తన ప్రతిస్పందనలను ఏషియాటిక్ రెవ్యూలో రెండు వ్యాసాలుగా 1915లో ప్రకటించాడు. అందులో ఒకటి సామ్రాజ్యవాదులైన ఐరోపీయుల ఆకాంక్షల్ని ఖండిస్తున్నందువలన ప్రచురణే కాలేదు. ఈ సమయంలోనే ఆయనకు మహాత్మాగాంధీతో

పరిచయం అయింది. వారి ప్రథమ సమావేశం అంత సామరస్య పూర్వకంగా ముగియలేదు. ఆ సమయంలో ఆయన ప్రచురించిన భగవద్గీతపై వ్యాసాలు బాలగంగాధర తిలక్ ప్రశంసలకు పాత్రం కాగలిగాయి. ఇలా ఆయన మేధోపరిధి విశాలం కావటానికి ఈ సమయం ఎంతో దోహదకారి అయింది.

సమాజంలో ఎందరో యెన్నోవిధాలుగా బాధలను అనుభవిస్తున్నారని రాధాకృష్ణ గ్రహించాడు. ఈ బాధితుల పట్ల ఆయన ఆలోచనలు కేంద్రీకృతం అయినాయి. వారిపై ఆయనకు అంతులేని సానుభూతి కలిగింది. అయితే వారు తమ లక్ష్యాలను చేరుకొనటానికి, జీవితానందాన్ని సాధించుకొనటానికి తత్త్వవేదాంతాలు తగిన ఆత్మస్థైర్యాన్ని, మార్గదర్శకత్వాన్ని యిస్తాయని ఆయన భావించాడు. ఎంత తర్కబద్ధంగా ఆలోచించినా అవి మినహా ఆయనకు అన్య మార్గాలన్నీ నిరర్ధకాలే అనిపించాయి.

1916వ సంవత్సరంలో ఆయనను అనంతపురం కళాశాలకు మార్చారు. ఇప్పటివరకు సహాయ ప్రొఫెసర్‌గా ఉన్న ఆయన అక్కడ ప్రొఫెసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలి. ఇంకా ఆయనకు ముప్పై సంవత్సరాల పదవీకాలం ఉన్నది. తన జీవితంపట్ల, ఉద్యోగంపట్ల పూర్తిగా సంతృప్తిగా ఉన్న రాధాకృష్ణ తన పదవీకాలమంతా అధ్యాపకవృత్తిలోనే గడిపివేయాలని కోరుకొన్నారు. అందులోనే తరించిపోవాలని ఆయన ఆకాంక్ష. ఇంతలో ఏ రాజకీయాలు, విపరిణామాలు పనిచేశాయో, 1917వ సంవత్సరంలో ఒక సంవత్సరం తిరగకుండానే ఆయనను అనంతపురం నుంచి రాజమండ్రికి బదలీ చేశారు. అంతవరకైతే ఫరవాలేదు కానీ తన తరువాత ఉద్యోగంలో చేరినవారి క్రింద ఆయన రాజమహేంద్రవరంలో పనిచేయవలసి వచ్చిన స్థితి అది. ఆయన మానసికంగా చాలా బాధపడ్డాడు.

ప్రెసిడెన్సీ కళాశాల విడిచిపెట్టి వచ్చిన తరువాత ఆయన విద్యాప్రపంచం చిన్నదయిపోయినట్టు అనిపిస్తున్నది. ఆయన విద్యా సంబంధాలు తెగిపోయినట్లు అనిపిస్తున్నది. విద్యా సంబంధ కార్యక్రమాలకు, ఆయనకు అసలు పరిచయమే లేకుండా పోయింది. రాజమహేంద్రవరం ఆంగ్ల విద్యా సంబంధమయిన వ్యాసంగాలకు ఏమాత్రం అనుకూలంగా ఉన్నట్లుగా భావించలేక పోయాడాయన. ఇక వేరే ఉద్యోగ ప్రయత్నం చేసుకోవటం మంచిదేమోనని మనస్సులో తరచుగా మెదులుతున్నది.

అప్పుడే మైసూరులో క్రొత్తగా విశ్వవిద్యాలయ స్థాపన జరగబోతున్నదని ఆయనకు తెలియవచ్చింది. మద్రాసు నుంచి రాజమహేంద్రవరానికి రాకముందే ఆయనను మైసూరుకు రావలసిందిగా ఆహ్వానాలు అందాయి. ఆయనను మైసూరు వారు మద్రాసులో రాజీనామా చేయమని కోరారు. జీతభత్యాలు యితోధికంగా యిస్తామని వాగ్దానం కూడా చేశారు. ఈ ఆహ్వానం నేరుగా విశ్వవిద్యాలయ మహాకులపతి నుంచే వచ్చింది.

అందుకు రాధాకృష్ణ పునరాలోచించి తన షరతులను ఉపసంహరించుకొంటూ తన దరఖాస్తుమీద పునరాలోచించవలసినదిగా విశ్వవిద్యాలయ పాలకవర్గాన్ని అభ్యర్థించాడు. పాలకవర్గం అభీష్టం ప్రకారం వారు కోరినవిధంగానే మైసూరు విశ్వ విద్యాలయ కులపతిగా నియమించమని ఆయన అభ్యర్ధన. అప్పటి మైసూరు సంస్థానానికి దివానుగా ఉన్న ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పరిస్థితిలో జోక్యం కల్పించుకొనగా చివరకు, 1918లో ఆయనను కులపతిగా గాక రాజీమార్గంగా అదనపు కులపతిగా మైసూరు విశ్వవిద్యాలయంలో ఉద్యోగ నియామకం చేయటం జరిగింది. నెల జీతం అయిదువందల రూపాయలు. ప్రాక్పశ్చిమతత్త్వశాస్త్రాల బోధన ముఖ్య వ్యావృత్తి.

తరగతి గదులలో అధ్యాపకుడుగా బోధించడం, ఇంటి గదిలో కిరోసిన్ లాంతరు వెలుగులో అర్ధరాత్రి దాటిందాకా విద్యార్థిగా అంతర్జాతీయ ప్రసిద్ధ తాత్త్వికులు రచించిన గ్రంథాలను అధ్యయనం చేయటం, ఆయనకు దినకృత్యం అయింది. ఆ సమయంలో ఆయన భారతీయ విద్యను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఈ గహన అధ్యయనం వలన ఎంత కష్టమైన అంశమైనా ఆయన సులువుగా అర్థంచేసుకొనేవాడు. విద్యార్థులకు వివరించవలసివచ్చినప్పుడు అంతకంటే సులువుగా అర్థమయ్యేటట్లు బోధించేవాడు. కఠిన అంశాలను అంత లోతుగా అర్ధం చేసుకోగలవారు అతికొద్దిమంది. వారిలో రాధాకృష్ణన్ ఒకడు. కఠినమైన అంశాలను సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించగల అధ్యాపకులు ఎందరో ఉన్నా చక్కని సమన్వయంతో భాషా పటిమతో మనోహర వాక్య నిర్మాణంతో బోధించగల కొద్దిమందిలో ఆయన ఒకడుగా ప్రఖ్యాతి పొందాడు.

మైసూరు విశ్వవిద్యాలయంలో చేరేనాటికి ఆయన వయస్సు ముప్ఫై సంవత్సరాలు మాత్రమే. మైసూరులో ఆయనకు ప్రజా సంబంధాలు మరింత పెరిగాయి. ముఖ్య సమయాలలో విద్యావంతుల మధ్య ఆయన ఉపన్యాసాలు ఏర్పాటు కావటం, మామూలుగా జరిగే విషయమే అయింది. ఆయన మాట్లాడినా, వ్రాసినా భావాన్ని గాఢంగా ఎదుటివారి హృదయంలో హత్తుకొనిపోయేటట్లు చేయగలిగేవాడు. అందుకోసం సూటియైన పదాలు ఉపయోగించి తేట అయిన వాక్యాలను ఉపయోగించేవాడు. ఆ వాక్యాల్లో యెంతో సృజనాత్మకత ఉండేది. చాలా సున్నితమైన హాస్యంతో కూడి ఉండేటట్లు ఆయన ఉపన్యాసాలుండేవి. ఆయన హాస్య చాతుర్యం పెదవులు విచ్చీవిచ్చని హాస్యం సృష్టించేది. ఉపన్యాసకుడిగా ఆయనది ప్రత్యేక తరహా. ఆయనకు మైసూరు విశ్వవిద్యాలయంలో ప్రధాన వ్యాసంగం విద్యార్థులకు బోధన చేయటమే. ఒక అంశాన్ని బోధించేటప్పుడు అది బాగా అర్థంకావటానికి, ఎక్కువకాలం జ్ఞాపకంఉండటానికి ఎలాంటి పదాలు వాడాలో ఆయనకు తెలిసినట్లుగా చాలా మంది ప్రఖ్యాత ఉపన్యాసకులకు కూడా తెలియదు.

ఆయనకు అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండేది. అందుకే తరగతి గదిలోని విద్యార్థుల నందరిని గుర్తుంచుకోగలిగేవాడు. ప్రతి విద్యార్థి తీరుతెన్నెలు, మాటామంతీ, ప్రవర్తనా, గుణగణాలు ఆయనకు తెలుసు. వారి కష్టసుఖాలు తెలుసుకొనేవాడు. భయసందేశాలు తీర్చి ఆత్మీయునిలాగా వ్యవహరించేవాడు. సమస్యలు విద్యార్థులకు ఏర్పడినప్పుడు, వారితో కలసి తానూ శ్రమించేవాడు. డబ్బు విషయంలో ఎప్పుడూ పిసినారితనం చూపించేవాడు కాదు. ఉదారంగా ఉండేవాడు. కానీ డబ్బు విలువ మరచిపోయిదుబారాలను సహించేవాడు కాదు. ఎల్లప్పుడు విద్యార్థుల కోసం ఆయన గృహం తలుపులు తెరిచే ఉండేవి. విద్యార్థులకు ఆ యింట్లో సర్వస్వతంత్రం ఉండేది. ఎప్పుడైనా రావచ్చు, వెళ్ళవచ్చు. ఇబ్బంది కలిగితే, తమవారితోనే భోజనం చేయవచ్చు. విద్యార్థుల అంతరంగాల్లో ఎప్పుడూ సంతృప్తిగా, నిండుతనంతో ఉండేటట్లుగా ఉండేవాడాయన. తాను విద్యార్థులకు ఇంతచేసినా, తన ఆర్థికస్థితిగతులను విద్యార్థులకు చెప్పటం కాదు, కనీసం తెలియనీయచేసేవాడు కాదు. వారితో ఆ విషయాలు చర్చించేవాడు కూడా కాదు.

తరగతిగదిలో బోధన చేసేటప్పుడు సందర్భం కల్పించుకొని భారతీయుల నైతిక వారసత్వం, మేధా సంపన్నతలను గురించి బోధించేవాడు. అలాగే దేశ తక్షణావసరాలైన జాతీయోద్యమ ప్రాముఖ్యత, అందులో విద్యార్థుల పాత్రను గురించి ఉద్బోధించి, ఆయా అంశాల మీద వారిలో ఏకాగ్రత నిలిచి ఉండేటట్లు చేసేవాడు. దేశం అనుభవిస్తున్న దురన్యాయాలను విద్యార్థులకు వివరించి ఆంగ్లేయపాలకుల దమననీతి మీద తిరుగు బాటును రేకెత్తేటట్లు చేసేవాడు.

విద్యార్థులలో ఆయనంటే అభిమానమూ, ప్రేమేకాదు భయమూ భక్తీ కూడా విశేషంగా ఉండేవి. అందుకే వారు “ఆయన ప్రతిభా పాటవాలు కొలతలకు అందవు. ఆయనను పూర్తిగా అర్థం చేసుకోవటం ఎవరికీ సాధ్యపడదు” అని ఎంతో గర్వంగా అభిమానంగా చెప్పుకొనేటట్లు చేసింది.

అందువలననే ఆ మరుసటి సంవత్సరం ఆయనను విద్యార్థి సంఘానికి గౌరవ అధ్యక్షునిగా ఎన్నుకొనేటట్లు చేసింది. ఇంకా ఎన్నో నాయక పదవులు ఆయనను వరించి వచ్చాయి.

మైసూరు ప్రభుత్వం ఆయనమీద శీతకన్ను వేసింది. ఆయన తన ఉద్యోగాన్ని ఖరారు చేయమని ప్రార్థన పత్రం పెట్టుకొన్నారు. దానిని వారు పట్టించుకొనకుండా వదలివేశారు. అందుకు ఆయన చాలా నొచ్చుకొన్నాడు. సరిగా అదే సమయంలో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రొఫెసర్ నియామకం జరుగుతున్నది. ఆ ఉద్యోగం తనకు

ఇవ్వవలసిందిగా మద్రాసు ప్రభుత్వానికి ఆయన అభ్యర్థనపత్రం పంపాడు. ఈసారి ఆయన అభ్యర్థనకు చాలా బలం వచ్చింది. అందుకు కారణం ఏమంటే 1917 నుంచి 1920 వరకు చాలా పరిణామాలు ఏర్పడ్డాయి. ఆయన 'మైండు' వంటి అంతర్జాతీయ పత్రికలలో వ్రాసిన అద్భుతమైన వ్యాసాలు ప్రపంచమంతటా ప్రాచుర్యం పొంది ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని తెచ్చిపెట్టాయి. అప్పటికే చాలా ప్రామాణికమైన పుస్తకాలను రచించాడు. అంతర్జాతీయంగా గొప్ప ఘనతగల గ్రంథ రచయితగా గుర్తింపు పొందాడు. కానీ ఈ వాస్తవాలు ఏవీ మద్రాసు ప్రభుత్వం వారిని కదిలించలేదు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రక్కన పెట్టేశారు. తిరిగి ఆయనను రాజమహేంద్రవరంలోనే నియమించాలనే ఉద్దేశ్యంతో ఉన్నారు.

1920లో అప్పటి కలకత్తా విశ్వవిద్యాలయంలో అయిదవ జార్జి చక్రవర్తి ప్రొఫెసర్ పదవిలో నియమితులను చేయాలని నిర్వాహకులు ప్రయత్నం చేస్తున్నారు. అది కొంత కాలానికి ఫలితానికి వచ్చి, ఆయన 1921 ఫిబ్రవరి నెలలో మైసూరు విశ్వ విద్యాలయం నుంచి, బాధ్యతల నుంచి విముక్తి పొందారు.

రాధాకృష్ణన్ మైసూరు విశ్వవిద్యాలయ బాధ్యతలనుంచి విడుదల పొందారని తెలియగానే విద్యార్థులకు ఆ వార్త పిడుగుపాటే అయింది. తమ ఆదర్శ ఉపాధ్యాయుడు దూరంగా వెళ్లిపోతున్నాడనే విషయం విన్న కొంతమంది విద్యార్థులు కలత చెందటమే కాదు కన్నీళ్ళు కూడా పెట్టుకొన్నారు.

అప్పుడు ఆ విద్యార్థులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్నివేశం మొత్తం మైసూరు చరిత్రలోనే ఒక మధుర అధ్యాయమై నిలిచిపోతుంది. అంతేకాదు విద్యార్థిలోకమంతా కూడా గుర్తించుకోదగిన చిరస్మరణీయ సంఘటనగా చరిత్రలో నిలిచిపోయింది.

ఆనాడు మైసూరులోని విద్యార్థిలోకం ఒకటై కదలింది. మైసూరు పురవీధులు హోరెత్తాయి. వీధుల నిండా పూలరేకులు విరజల్లబడ్డాయి. మైసూరు నగరవాసులంతా ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు, మంచి విద్యార్థుల మధ్య ఎటువంటి ప్రగాఢ అభిమానం ఏర్పడగలదో కళ్ళారా చూచి వర్ణించుకొనదగిన సంఘటన. ఆ విద్యార్థులు రాధాకృష్ణన్‌ను గుర్రపు బగ్గీలోకూర్చొనబెట్టారు. బగ్గీకి కట్టిన గుర్రాలను విద్యార్థులు వచ్చి, విప్పి వదలి పెట్టారు. తమ ఆదర్శ గురుదేవుడు వచ్చి కూర్చొన్న బగ్గీని ఆ విద్యార్థులు తామే భుజాలు కలిపిలాగారు. భారతీయ సమాజంలో ప్రతివాడూ నిత్యము తీర్చవలసినవి ఋణాలు. దేవఋణం, ఋషిరుణం, పితృఋణం, గురుఋణం అనేవి. అందుకే వారు ఈ విధంగా తమ గురుఋణాన్ని తీర్చుకొనే ప్రయత్నం చేశారు. ఆయనకు బ్రహ్మరథం పట్టారు.

బ్రహ్మరథం అంటే మనుష్యులు మోసే రథమని అర్థం. నిజంగా తామేమోసి యథార్థ బ్రహ్మరథం చేశారు ఆ విద్యార్థులు.

గురుదేవుడు! అతడు ఆదర్శ అధ్యాపకుడే అయితే అతడే బ్రహ్మ. గురుబ్రహ్మ.

గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

అని వారందరూ దిక్కులు పిక్కటిల్లేటట్లు ఈ ఆధునిక గురుబ్రహ్మను స్తుతించారు, నుతించారు, సత్కరించారు, ఆనాటి మైసూరు నగర విశ్వవిద్యాలయ విద్యార్థులు.

ఒక గురువుకు, శిష్యులకు మధ్య ఉండవలసిన అనుబంధం ఎంత దృఢమైనదో ఎలాంటిదో, ఎంత పవిత్రమైనదో, ఎంత ప్రేమాభిమాన పురస్సరమైనదో తెలిపే మహత్తర చరిత్రగా ఆనాటి సంఘటన నిలిచిపోయింది. అలా వారు ఆ గుర్రపు బగ్గీని మైసూరు నగర రైల్వే స్టేషన్ వరకు తామే లాక్కొని తీసుకొని వెళ్ళారు.

బగ్గీలోంచి దిగిన తరువాత పూలు పరచిన ప్లాట్‌ఫాం మీద ఆయనను అపురూపంగా నడిపించారు. దిక్కులు పిక్కటిల్లేటట్లు తమ ఆదర్శ గురువు పేరును నినదించారు. విజ్ఞానం చిమ్మేకళ్ళు, అయినా పేదరికం ప్రదర్శించే వస్త్రాలు ఆయనవి. ఆ ఊరేగింపు జరిగినంత సేపూ నగర వీధులలో వాహనాలూ, మనుష్యుల రాకపోకలు స్థంభించాయి. ప్లాట్‌ఫాం మీది ఇతర యాత్రికులు దీనినొక అపూర్వ ఘట్టంగా అద్భుతంగా భావించి తిలకించారు. ఆ ప్రాంతాలన్నీ క్రిక్కిరిసిపోయాయి.

"ఆ విధమైన సంఘటన అధ్యాపక విద్యార్థులలో 'నభూతో న భవిష్యతి' అందుకే ఆ దృశ్యాన్ని రాధాకృష్ణన్ నిజంగానే తన గుండెలలో ఒక అద్భుతమైన జ్ఞాపకంగా తీయని గుర్తుగా దాచుకొన్నాడు. ఆయనకు ఆ తరువాత ఎన్నో విశిష్ట పురస్కారాలు జరిగాయి. కాని ఆనాటి రాత్రి ఆ విద్యార్థుల కన్నీటి వీడ్కోలు వారు చూపిన ఆ అభిమానం నాకు ఎన్నటికీ మరపునకు రావు. విద్యార్థుల పట్ల నా బాధ్యతలేమిటో వారు నాకు బాగా గుర్తు చేశారు" అని చాలాకాలం వరకు చెప్తుండేవారాయన.

ఒక్క రాధాకృష్ణన్‌కే కాదు. వారు ప్రపంచ ఉపాధ్యాయులందరకీ ఇచ్చిన సందేశం అది. అంతగా శిష్యుల అభిమానం పొందాలంటే అధ్యాపకులు ఏం చేయాలో ఇక చెప్పనవసరం లేదు.

★ ★ ★

# కలకత్తా విశ్వవిద్యాలయంలో

1920లో బ్రిజేంద్రనాథ్ అనే ఆయన కలకత్తా విశ్వవిద్యాలయంలో, పంచమజార్జి చక్రవర్తి పండిత పీఠంలో కలకత్తాలో పనిచేస్తున్నాడు. ఆయనను మైసూరు విశ్వ విద్యాలయానికి కులపతి (వైస్ ఛాన్సలర్) గా నియమించారు. ఆ సమయంలో మహా విద్వాంసుడు సర్ అశుతోష్ ముఖర్జీ, కలకత్తా విశ్వవిద్యాలయానికి కులపతిగా ఉన్నాడు. ఒకసారి ఆయన మద్రాసు రావటం జరిగింది. మద్రాసులో ప్రముఖుడు, రాధాకృష్ణ అభిమాని అయిన శివస్వామి అయ్యర్ అనే ఆయన అశుతోష్ ముఖర్జీకి కావలసినవాడు. ఆయన ముఖర్జీని కలసి "రాధాకృష్ణ మైసూరు నుంచి తరలివచ్చే మార్గం చూపండి" అని అభ్యర్థించాడు. అప్పటికే రాధాకృష్ణ ప్రతిభను సంపూర్తిగా తెలుసుకొని ఉన్న ముఖర్జీ, రాధాకృష్ణన్‌ను కలకత్తా విశ్వవిద్యాలయం తీసుకొని పోవాలని సంకల్పించాడు.

ముఖర్జీ, ఇద్దరు ఆంగ్లేయ మిషనరీ అధికారులు జార్జి హోవెల్, ఉక్‌హార్ట్‌లనే వారికి ఈ విషయాన్ని తెలిపి, తనకు సహాయం చేయవలసినదిగా వారిని అభ్యర్థించాడు. ఇందులో ఉక్‌హార్ట్ అనే ఆయన అంతకు కొద్ది రోజుల ముందే 'కలకత్తా రివ్యూ' అనే ప్రముఖ పత్రికలో రాధాకృష్ణన్ గ్రంథంపై గొప్ప సమీక్షను చదివి ఉన్నాడు. ఛాందసాలను ఖండించే అధునాతన తత్త్వవేత్తల ధోరణిని ఉక్‌హార్ట్ పూర్తిగా సమర్థించలేకపోయినా, రాధాకృష్ణన్ పాండిత్యం, ప్రతిభాపాటవాలు, భాషాగాంభీర్యం, మేధాసంపత్తుల మీద ఆయనకు గురి కుదిరింది. అంతేగాకుండా అప్పటికే 'ది క్రైం ఆఫ్ లీలా' అనే, ఆయన వ్రాసిన నవలలోని వంగదేశపు తరహా పాత్రలు అక్కడి మేధావులను ఆకర్షించి ఉన్నాయి.

కలకత్తాలో నియామకం అందింది. 1921వ సంవత్సరం ఫిబ్రవరిలో అక్కడ ఉద్యోగంలో ఆయన చేరవలసి ఉన్నది. అయితే పంచమ జార్జి చక్రవర్తి పండిత పీఠపదవికి

తనతో పోటీపడిన మిగిలిన అభ్యర్థుల నుండి ఆయనకు బెదిరింపు లేఖలు వస్తున్నాయి. "ప్రతిష్ఠాత్మకమైన ఈ పదవిలో చేరటానికి నాకు వయస్సు చాలదనుకొంటాను. మీరు కల్పించిన ఈ అవకాశం వినియోగించుకొనే వయసు నాకు రాలేదని భావిస్తున్నా" నని అశుతోష్ ముఖర్జీకి లేఖ వ్రాశాడాయన. అశుతోష్ ముఖర్జీ తక్కువ తిన్నవాడుకాదు గదా! "మీరు ఫిబ్రవరిలో చేరవలసి ఉన్నది. వయసు పెరగాలంటున్నారు. కాబట్టి మీ కోరికను అంగీకరిస్తూ మార్చి వరకు పొడిగించాను" అని ఆయనకు జవాబిచ్చాడు. "నీవు చేరక తప్పద"నేది ఆ లేఖలోని అంతరార్థం. ఆయనకు మిత్రుడు, మొదటి నుంచి ఆయన విషయం పూర్తిగా తెలిసినవాడైన కట్టమంచి రామలింగారెడ్డి "నువ్వు వెంటనే బయలుదేరి రాకపోతే నేనే మైసూరువచ్చి మూటముల్లె సర్ది రైలు ఎక్కించవలసి ఉంటుంది. ఇంత గొప్ప అవకాశాన్ని వదలుకొంటావా?" అంటూ సతాయిస్తూ లేఖలు వ్రాస్తున్నాడు. ఇవి అన్నీ ఆయన తటపటాయించటంపై ఒత్తిడి తెచ్చాయి. ఆయన మహా మేధావే. సందేహం లేదు. ప్రపంచ ప్రసిద్ధుడు, గొప్ప తత్త్వవేత్త. అధిష్టించాల్సింది పంచమ జార్జి చక్రవర్తి పండిత పీఠపదవిని. అయినా ఆయన వయస్సు ముప్పై మూడు సంవత్సరాలే.

అప్పటికే వంగదేశీయులైన విద్యావంతులు రాధాకృష్ణన్ గురించి విన్నారు. ఆయన పాండిత్యం గురించి తెలుసుకున్నారు. కానీ వారికెవరికీ ఆయనతో ముఖాముఖీ పరిచయం లేదు. ఆయనను ప్రత్యక్షంగా చూసిన వారూ లేరు. ఆ ప్రత్యక్ష పరిచయం కలిగించటానికి తత్త్వశాస్త్రం మీద కలకత్తా నగరం సెనేట్ భవనంలో రాధాకృష్ణన్ ఉపన్యాసాన్ని అశుతోష్ ముఖర్జీ ఏర్పాటు చేశాడు. ఆయన తీరు, పాండిత్యం ఎలాంటివో స్థానిక మేధావులకు పరిచయం చేయటమే, ఉపన్యాసాన్ని ఏర్పాటు చేయటంలోని ఆంతర్యం.

సెనేట్ భవన ఉపన్యాస మందిరం మేధావులతో క్రిక్కిరిసి ఉన్నది. రాధాకృష్ణన్ వేదిక మీదకు వచ్చాడు. ఆయన అధిష్టించిన పండిత పీఠపదవిని ఆశించి భంగపాటు చెందినవారు కూడా ఆ సభలో ఉన్నారు. ఆయనకన్నా వయోవృద్ధులు, పండిత వృద్ధులూ తత్త్వశాస్త్ర శాఖలో పనిచేస్తున్నవారున్నారు. రాధాకృష్ణన్ లేచి నిలబడి ధీర గంభీర స్వరంతో తన ఉపన్యాసం మొదలుపెట్టగానే సభఅంతా నిశ్శబ్దం అయింది. ఆయన ఆశువుగా, అమితవేగంగా, ఎక్కడా తడుముకోవటం లేకుండా యెంతో గంభీర విషయాలను ఒక్కొక్క దానిని వివరిస్తుంటే సభ విస్తుపోయింది. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.ఎంత క్లిష్టమైన అంశమైనా, అలవోకగా వివరించి అలరింపచేస్తుంటే ఆ సభలోని వారికి ఆయనంటే ఎంతో గౌరవం ఏర్పడింది. పైగా వ్రాసుకొని చదవటం ఆయనకు ఏనాడూ అవసరం రాలేదు. పంచమ జార్జి చక్రవర్తి పండితపీఠపదవికి ఆయనకే అర్హత ఉన్నదనే అభిప్రాయానికి అందరూ వచ్చారు.

కలకత్తాలో కిరణ్ ముఖర్జి, వసంతకుమార్, మల్లిక్, సి.వి.రామన్‌లు ఆయనకు మిత్రులు. అధ్యాపక కార్యక్రమాలు ముగిసిన తరువాత వీరందరూ తరచుగా కలుసుకొని అనేక విషయాలను గురించి చర్చిస్తుండేవారు. లేకపోతే ఆయన ఇంటిపట్టున ఉండేవాడు. ఒకరిద్దరు పేద విద్యార్థులు ఆయన ఇంటిలోనే ఉండి చదువుకొంటుండేవారు. ఇంతేగాక దక్షిణాది నుంచి అదనంగా అతిథులెవరు వచ్చినా వారింటిలోనే బస. విద్యాసదస్సులు, రాజకీయ సదస్సులకు వచ్చే వారికోసం, ఆ యింటి తలుపులు తెరవబడే ఉండేవి. సోదరుడు, సోదరి, భర్తృవిహీన అయిన తల్లి ఆయనతో కలిసే ఉన్నారు. ఎప్పుడో ఆయనకు యాభై సంవత్సరాలు దాటిన తరువాతగానీ అన్నగారితో నామమాత్రమైన భాగ పరిష్కారాలు జరిగి విడిపోవటం జరగలేదు.

ఆయన మైసూరులో ప్రారంభించిన భారతీయ తత్త్వశాస్త్రగహన అధ్యయనం యిక్కడ కలకత్తాలో కూడా కొనసాగించాడు. దేనిలోనైనా ఆయన చూపే ఏకాగ్రత అనన్య సామాన్యంగా ఉండేది. "ఏకాగ్రత నిజమైన మానసిక ఆనందం" అని బుద్ధ భగవానుడు ఎప్పుడో బోధించాడు. ఈ సూక్తి రాధాకృష్ణకు చాలా నచ్చింది. ఈ సూక్తి ఆయన వ్రాసిన పుస్తకాలలో తరచుగా పునరుక్తి చేస్తుండేవాడు. దేనిగురించైనా వ్రాతపూర్వకంగా వివరించాలనుకొంటేనే ఆయన కాగితం మీద కలాన్ని ఉంచేవాడు. ఆయన వ్రాతలో స్పష్టత, సున్నితత్త్వం, ధారాళంగా విషయాన్ని వివరించగల నేర్పు కనిపిస్తాయి. వ్రాయటం మొదలుపెడితే గంటల కొలది అలా వ్రాస్తూనే ఉండేవాడు. ఆయనకు అలసటే ఉండేదే కాదు. ఒక భావాన్ని ప్రకటించడంతో సరిగా సరిపోయే ఖచ్చితమైన పదాన్ని ఉపయోగించ డంలో ఆయన గొప్ప నేర్పరి. ఆయన వ్రాయటానికి ఎక్కువగా ఏకాంతాన్ని, తద్వారా ఏకాగ్రతను కోరుకొనేవారు. చదివే సమయంలో ఆయన మేజాబల్లలు, కుర్చీలు వాడుకొనే వాడు కాదు. ప్రక్కమీద పడుకొని చదువుకొనటమంటేనే ఆయనకు చాలా యిష్టం. కుటుంబ సమస్యలు కూడా ఈ సమయంలో కొంత వెనుకబట్టాయి. భార్యాభర్తల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. పేదరికం భయాలు వెనుకపడ్డాయి. కొంత వెసులుబాటు కలిగింది. కానీ నిరంతరం చేసిన అనవరత కృషి ఫలితంగా ఆయనకు 'ఇన్‌సోమియా' (నిద్రలేక పోవటం) అనే వ్యాధి పట్టుకొన్నది. అది ఆమరణాంతం ఆయనతో ఉన్నది. కానీ అది ప్రాణాంతకం, ప్రమాదకరమైన వ్యాధి కాదు. అందువలన ఆయన దానితో అంతగా ఇబ్బంది పడలేదు.

రాధాకృష్ణన్ కలకత్తా విశ్వవిద్యాలయంలో చేరేనాటికి గాంధీగారి పిలుపు మేరకు విద్యార్థులు సమ్మె చేస్తున్నారు. కులపతిగా ఉన్న అశుతోష్ ముఖర్జీ కూడా ప్రభుత్వం

నుంచి కొన్ని చిక్కు సమస్యలను ఎదుర్కొంటున్నాడు. రాధాకృష్ణన్ అశుతోష్ ముఖర్జీకి మద్దతుగా నిలిచాడు. ఇంకొకవైపు విద్యార్థుల పక్షం వహించాడు. విద్యార్థులందరికి మహాత్మాగాంధీ ఆదర్శం. అహింసా సిద్ధాంతం వలన ఆయన రాజకీయ మహాయోగిగా భాసిస్తున్నాడు. అలాగే రవీంద్రనాథ్ టాగూర్‌కూడా గాంధీ వలెనే గొప్ప జాతీయవాది. దేశ భక్తుడు. కవి, ఆత్మకు విముక్తి (మోక్షం) స్వేచ్ఛ కావాలని గ్రహించి అదే అంశాన్ని తన రచనల ద్వారా ప్రచారం చేస్తున్న మహామేధావి. విద్యార్థులకు గాంధీగారి మీద కంటే రవీంద్రకవీంద్రుని మీదనే అభిమానం ఎక్కువగా ఉండేది. మహాత్మాగాంధీ, పంజాబులో జరిగిన జలియన్‌వాలాబాగ్ దురంతానికి వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమం నడుపుతున్నాడు. ఆత్మశక్తితో ఉద్యమం ప్రారంభించిన ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం కారాగారబద్ధుని చేసింది.

ఇలాంటి సమయంలో రాధాకృష్ణన్ తన విధ్యుక్త ధర్మాన్ని గుర్తెరిగి ఆంగ్లేయ చర్చి బిషప్పులకు ఈ విషయాలు వివరిస్తూ లేఖలు గుప్పించాడు. "గాంధీగారు నడుపుతున్న శాంతి, అహింస ఉద్యమాలు క్రీస్తు బోధనలకు ప్రతిరూపాలే. కనుక బిషప్‌లు అందరూ "ఉద్యమాన్ని సమర్థించి గాంధీకి మద్దతునివ్వండి. మీ ప్రభుత్వం వాస్తవాన్ని గుర్తించేలా చేయండి" అని ప్రార్థించాడు. "శాంతి అహింసలతో పోరాడేవారి మీద జలియన్‌వాలాబాగ్ దురంతాల వంటివి చేయించటం ఏం న్యాయం? మీ ప్రభుత్వం క్రీస్తుబోధలకు వ్యతిరేకంగా నడుచుకొంటున్నది. ఆ విషయం మత బోధకులుగా మీరు వ్యతిరేకించండి. మీ ప్రభుత్వానికి తెలిసేటట్లు చెప్పండి" అని హెచ్చరించాడు. "స్వేచ్ఛ కోసం గాంధీ తనను తాను హింసించు కొంటున్నాడు. ఎదుటివారిలో మార్పుకోసం ఆత్మత్యాగానికి పాల్పడటం క్రీస్తు విధానం. భారత్ సిద్ధాంతాలను మీరు గ్రహించండి. మీలో మార్పుకోసం భారత్ తనను తాను త్యాగం చేస్తున్నది. అధికారంకోసం బ్రిటన్ భారతీయ నిర్దోషులను హింసిస్తున్నది. ఈ రెండు దేశాల్లో క్రీస్తు జీవితాదర్శాన్ని పాటిస్తున్న దేశం ఏదో జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయించండి" అని వారిని అభ్యర్థించాడు. బ్రిటన్‌లోని మేధావులు ఈ తార్కిక బుద్ధికుశలతకు కదలిపోయారు. క్రీస్తు భారతీయుల అహింసాపోరాటంలో జీవించాడని వారు భావించసాగారు. "బ్రిటన్ వారి హింసాత్మక వలస సామ్రాజ్యవాదంతో క్రీస్తు మరణించాడు. భారతీయుల ఆలోచనలలో మతాలన్నీ అంతర్భాగాలే అవుతాయి. మనం, మనవారు చేస్తున్న దమననీతి ఇది" అని వారిలో కొందరు మేధావులు భావించటం జరిగింది. ఇది మనదేశ రాజకీయాల్లో చాలా కీలకమైన మార్పు. ఇలాంటి మార్పును తన బోధనలు, వ్రాతలు, లేఖల ద్వారా ఆయన సాధించగలిగాడు.

పంచమ జార్జి చక్రవర్తి పండిత పీఠ అధినేతగా రాధాకృష్ణన్ కలకత్తాలో భారతీయ, బ్రిటన్ పండితులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేశాడు. ఆయనే ఆ సంఘానికి అధ్యక్షుడు. 1925వ సంవత్సరంలో కలకత్తాలో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశం జరిగింది. దానికి కూడా ఆహ్వాన సంఘ అధ్యక్షుడుగా ఆయనే పనిచేశాడు. అలాగే భారతతత్త్వశాస్త్ర కాంగ్రెస్‌కూ మొదటి అధ్యక్షుడు రవీంద్రనాథ టాగూరు కాగా రెండవ అధ్యక్షుడు రాధాకృష్ణనే. అటుతరువాత ఈ భారతతత్త్వశాస్త్ర కూటమి ప్రతి సంవత్సరం సమావేశాలు జరుపుతూ ప్రముఖమైన అంశాలను చర్చిస్తూ సుప్రసిద్ధమైంది. 1926లో, రాధాకృష్ణన్ ఆంగ్లేయ విశ్వవిద్యాలయాలు ప్రతినిధిగా ఎన్నికైనాడు. ఆ సమావేశం లండన్‌లో జరుగనున్నది. అప్పటిలో ఆయన స్థితి విదేశీయానం ఊహించగల పరిస్థితికాదు. అలాంటి సమయంలో ఆయనకు ఈ అవకాశం వచ్చింది. ఆక్స్‌ఫర్డ్‌లోని మాంచెస్టర్ కళాశాల ప్రధాన ఆచార్యుడు ఎల్.పి.జాక్సు ఆహ్వానంపై ఆయన ఆక్సుఫర్డ్‌లో ఉపన్యాసాలు కూడా ఇవ్వవలసి వచ్చింది. ఆక్సుఫర్డ్‌లో రాధాకృష్ణన్ అనేకానేక ఉపన్యాసాలిచ్చాడు. ఇలా ఉపన్యాసాలు యిస్తున్న సమయంలో ఆయనకు ఇతర ప్రాంతాల నుంచి కూడా ఉపన్యాసాలివ్వవలసినదిగా ఆహ్వానాలు, అవి చాలవన్నట్లుగా ఒత్తిడులు వస్తున్నాయి. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఆయన శంకరులను గురించి ఉపన్యాసం ఇవ్వవలసి వచ్చింది. లండన్‌లో ఉండగానే ఆయన సర్ అశుతోష్ ముఖర్జీ కుమారుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని చాలాసార్లు కలుసుకొన్నాడు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అప్పుడు లండన్‌లో చదువుకొంటున్నాడు. ఆయన రాధాకృష్ణ కంటే వయస్సులో చిన్నవాడైనా వారిద్దరి మధ్య చక్కని స్నేహం ఏర్పడింది. కాలక్రమేణా ఆ స్నేహం బలపడింది.

“ఒకరినొకరు దోచుకోవటం, అధికారం చెలాయించడం, పాలించడం వంటివి ఇక ఏ మాత్రం చెల్లవు. ఎంతో కాలం సాగవు. ప్రపంచదేశాల వారందరూ ఒకరికొకరు స్నేహంగా ఉండటం చాలా అవసర”మని బ్రిటన్‌ను హెచ్చరించాడు రాధాకృష్ణన్.

అక్కడి నుంచి ఆయన అమెరికా ఖండానికి ప్రయాణమైనాడు. న్యూయార్క్‌లో ఎందరో పత్రికా విలేకరులు రాధాకృష్ణన్ కోసం ఎదురుచూస్తున్నారు. అప్పటి వరకూ అమెరికా వాసులకు తెలిసిన భారతీయ నైతిక గురువు జిడ్డు కృష్ణమూర్తి, ఇంకొక ఆంధ్రుడు. కృష్ణమూర్తి “ప్రపంచ దేశాలన్నింటికీ నైతిక జీవితం ద్వారా స్వేచ్ఛ లభించాలని రాధాకృష్ణన్ కోరుతున్నారు. మతాలన్నీ మంచికే అంటున్నారు. మతాల మధ్య అవగాహన పెంపొందించి సహజీవనం సాధించటానికి గొప్ప కృషిచేస్తున్నారు. తద్వారా వసుధైక కుటుంబం ఏర్పడుతుందని, ప్రపంచ దేశాలన్నీ సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమానమైన

స్వేచ్ఛ గలిగి నైతికంగా విజయవంతం కావాలని బోధిస్తున్నారు. పీలగా ఉండే ఈ మనిషి ప్రాధాన్యత ప్రపంచానికి ఎంతో ఉందని గుర్తించాలి" అని రాధాకృష్ణన్ గురించి అతి స్వల్పమైన సహజమైన సాధారణమైన ఉదాహరణలతో అందరికీ తేలికగా అర్థమయ్యే టట్లు వివరించాడు. అంతేగాకుండా "రాధాకృష్ణన్ చిన్న త్రాడుముక్క అయితే అది నావలన్నీ దేనిదారిన అది కొట్టుకుపోకుండా కలిపి కట్టి ఉంచగలదు" అని కూడా కృష్ణమూర్తి అన్నాడు.

రాధాకృష్ణన్ న్యూయార్క్ చేరవలసిన సమయం కోసం ఎదురుచూస్తున్నారు అమెరికన్లు. ఆయన రాకను గురించిన వారి ఆసక్తి వర్ణనాతీతం.

రాధాకృష్ణన్ అమెరికా పర్యటనలో అతి ముఖ్యమైన విషయం హార్వర్డ్‌లో అంతర్జాతీయ తత్త్వవేత్తల సమాజంలో పాల్గొనటం. హార్వర్డులో ఆయన చాలా కఠినమైన అంశం మీద ఉపన్యసించాలి. "ప్రపంచదేశాల నాగరికతానిర్మాణంలో తత్త్వశాస్త్రం పాత్ర" అనేది అంశం. చాలా క్లిష్టమైన అంశం అది. అందులో పాల్గొన్నవారు, తన ప్రక్కన కూర్చొన్నవారు దిగ్దంతులే పాండిత్యంలో. గిల్సన్, దిలే, క్రోక్‌లాంటి అఖండ మేధాసంపన్నులు, తత్త్వపండిత ప్రకాండులు, ఆయన ప్రక్కనే ఉన్నారు. అంత కఠినమైన అంశమైనా రాధాకృష్ణన్ విజృంభించాడు. భారతీయ ఋషులు ఆయనలో ప్రవేశించి, నోరువిప్పి ప్రపంచాన్ని దిగ్భ్రాంతి పడేటట్లుగా చేశారు. ఆ రోజున "మతాలు వాస్తవాలను విస్మరించకుండా ఆలోచించడం ప్రారంభించాలి" అంటూ ఆయన ఇంకా "తత్త్వవిచారణ అనేది మానసిక చింతన. దానికి బాహిరమైన రూపమే ఒక జాతి నాగరికత అని అతి క్లిష్టమైన అంశాన్ని ఒక్క వాక్యంలోనే అతి సులభంగా విశదీకరించడంతో సమావేశమందిరం చప్పట్లతో దద్దరిల్లిపోయింది. హార్వర్డు విశ్వవిద్యాలయమే కాదు మొత్తం ప్రపంచమే ఆ యువమేధావిని ఉలిక్కిపడి చూచింది. ఎన్నో గ్రంథాలు, ఎందరో మేధావులు వివరించలేని కఠినాంశాన్ని ఒకే ఒక్క వాక్యంలో సులభ గ్రాహ్యంగా వివరణ చేసిన ఆయన వాక్పటిమను, మేధా సంపదను మేధావులు వేనోళ్ళ కొనియాడారు. అది ఆధునిక భారతీయ ఋషిగర్జనలా ఉన్నది. సర్వకాలాల తత్త్వ విచారకులను విభ్రాంతి పరచిన అద్భుతఘట్టం అది.

విశ్వవిద్యాలయాలు ప్రభుత్వాలకు రాజకీయ వాదులకు అతీతంగా ఉండాలని అన్ని సభలలోనూ ఆయన ప్రకటించాడు. 1926 నవంబర్ నెలలో ఆయన భారతదేశం చేరుకొన్నాడు. అప్పటికి ఆయన అందరి దృష్టిలో హిమాలయ శిఖరంలా ఎదిగిపోయాడు.

ఆ సమయంలో వంగ ప్రభుత్వం జదునాథ సర్కార్ అనే ఆయనను బీహారు నుంచి తీసుకొని వచ్చి, కులపతిగా నియమించాలని నిర్ణయించింది. ఆ పదవిలో జదునాద

సర్కారు రెండు సంవత్సరాలున్నాడు. అంతకాలమూ ఆ పదవిలోకి రాధాకృష్ణను తీసుకొని రాలేకపోయినందుకు శ్యాంప్రసాద్ ముఖర్జీలాంటి వారు ఎంతో సంతాపం చెందారు.

కళాశాలల, విశ్వవిద్యాలయ అధ్యాపకుల వార్షిక సమావేశంలో రాధాకృష్ణన్ చేసిన ఉపన్యాసాన్ని జాతీయ పత్రికలన్నీ తమ సంపాదకీయాలలో గుర్తించాయి. అమృత్‌బజార్ పత్రిక ప్రత్యేకంగా సంపాదకీయం వ్రాసింది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఎంతో అభిమానంగా వర్ణించింది. ఆ సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అంతా రాధాకృష్ణనే కులపతి కావాలంటున్నారు.

1928లోనే ఎల్.పి.జాక్సుగారు రాధాకృష్ణన్‌ని మాంఛెస్టర్ కళాశాలలో ఆచార్య పదవిని అందుకోవలసిందిగా కోరారు. శాశ్వతంగాకానీ, అయిదు సంవత్సరాల పాటు ఒప్పందంగా కానీ రావలసిందిగా ఆయనను కోరాడు. అయితే తనకు కలకత్తాలో ఉండడమే అన్ని విధాల శ్రేయస్కరమని భావించి ఆ అవకాశాన్ని ఆయన నిరాకరించాడు. అయితే ఒక్క సంవత్సరం యూరోప్‌కు వచ్చేందుకు ఉత్సాహం చూపించాడు. ఆ ఉద్యోగ విధి 1929 జనవరి నెల నుంచి ప్రారంభం. ఆయనను కలకత్తా విశ్వవిద్యాలయ పాలకవర్గంలో నియమించారు.

కానీ 1929 – 30 విద్యా సంవత్సరం ఆయన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోనే ఉన్నాడు. అధ్యాపకత్వం కాకుండా, మాంఛెస్టర్, ఆక్స్‌ఫర్డ్‌లలో అనేక ఉపన్యాసాలిచ్చాడు. ఈ సమయంలో మతం గురించి ఆయన ఎక్కువగా మిత్రులతో చర్చించటం జరిగింది. వారి భావాలను గ్రహించే అవకాశం ఆయనకు కలిగింది.

బ్రిటన్‌లో శ్రోతలు ఆయన ఉపన్యాసాలు విని అసాధారణమైన క్రొత్త ఉపన్యాసకుడిని చూడగలుగుతున్నామనే తృప్తి, సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆక్సుఫర్డులో ఆ సంవత్సరం సెయింట్ హగ్స్ కళాశాలలో ఉపన్యాసమిచ్చాడు. అక్కడ ఆయనకు లభించిన జ్ఞాపకాలు చాలా మధురమైనవి. మెకంజి, బెర్ట్రాండ్ రస్సెల్ లాంటి మహా మేధావులు ఆయనను తమతో సమానంగా గౌరవించి తమలో ఒకడిగా గౌరవించి ఆదరించారు. ఆయన అంతర్దర్శనం ప్రొఫెసర్ వైట్‌హెడ్, జోద్‌లాంటి మహామహులను ఆకర్షించింది. అందరూ ఆయన నిరాడంబరతను గురించి ప్రశంసించారు. హగ్‌ఫాస్పెట్ అనే ఆయన ఒక మేధావి, తత్త్వపండితుడు. అలాంటి మహాపురుషుడైన వ్యక్తి కూడా రాధాకృష్ణన్‌ను చూచి, అంత అంతర్దర్శి ఒక సాధారణవ్యక్తిగా నిరాడంబరంగా కనిపించటాన్నిఎంతగానో ప్రశంసించాడు. పశ్చిమ దేశాల మేధావులందరూ ఆయనలాగానే రాధాకృష్ణన్‌కు అఖండ నీరాజనం పట్టారు. ఈ విధంగా 1930 ఎండాకాలం వరకు ఇంగ్లాండులోనే కాలం గడిచిపోయింది ఆయనకు.

ఆ కాలంలో భారతీయ విద్యార్థులు అనేకులు ఇంగ్లాండులో చదువుకొంటుండేవారు. బ్రిటన్‌లో చదువుకొంటున్న భారతీయ విద్యార్థులు రెండుగా చీలిపోయారు. రాధాకృష్ణ ఈ రెండువర్గాల విద్యార్థులను ఐకమత్యంతో మెలగాలని ఉద్బోధించాడు. రెండు వర్గాల విద్యార్థులు ఆయనను కలుసుకొన్నప్పుడు ఈ విజ్ఞప్తి చేశాడాయన. తరువాత భారతదేశంలో 1960 ప్రాంతాలలో రక్షణశాఖమంత్రిగా పనిచేసిన వి.కె.కృష్ణమీనన్,ఆయనను కలుసుకొన్న వారిలో ఒకడు. ఆయన సలహా మీద వారు నడుచుకొని, అప్పటివరకు ఉన్న రెండు విద్యార్థి సంఘాలను రద్దుచేసి ఒకే సంఘంగా ఏర్పడ్డారు. దానికి 'భారతీయ విద్యార్థి సంఘం' అని పేరు పెట్టారు. అయినా, వారికి మార్గదర్శిగా కొంతకాలం రాధాకృష్ణనే ఉండవలసి వచ్చింది. 1930 ఫిబ్రవరిలో జరిగిన భారతీయ వసతి గృహ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా లండన్‌కు వెళ్లాడు.

అప్పటికి భారతదేశంలో పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉన్నది. గాంధీమహాత్ముడు శాసనోల్లంఘన ప్రకటిస్తామంటున్నాడు. దేశంలో అల్లర్లు ఆకాశాన్నంటుతున్నాయి. బ్రిటీష్ పాలకులలో అంతకంతకూ అసహనం పెచ్చు పెరుగుతున్నది.

అప్పటికి సమయం మించిపోయింది. గాంధీ భారతదేశంలో శాసనోల్లంఘన ఉద్యమాన్ని మొదలు పెట్టాడు. ఆ ఉద్యమం ఊపు అందుకుంది. గాంధీ అరెస్టు అయినాడు. ఆయన కారాగారంలో బంధింపబడ్డాడు. వందలు వేలమంది ముక్కుపచ్చలారని యువకులు ఆత్మత్యాగాలకు పాల్పడుతున్నారు. బ్రిటన్‌లో ఉన్న భారతీయ కుటుంబాలు కూడా ఇంటికి ఒక్కొక్కరికి చొప్పున, బిడ్డనో, భర్తనో, కుటుంబపెద్దనో గాంధీకి మద్దతుగా భారత ఉద్యమంలో పనిచేయటానికి పంపించాయి. ఈ ఉద్యమవేడి సహజంగానే ఇంగ్లండులోని మాంచెస్టరుకు కూడా పాకింది.

ఇలాంటి సమయంలో రాధాకృష్ణన్ భారతదేశం తిరిగి వెళ్లి పోవాలనుకొన్నాడు. తన మాతృభూమి ప్రదర్శిస్తున్న త్యాగభారాన్ని, కష్టసహిష్ణత గురించి పత్రికలలో చదివి ఆయన చలించిపోయాడు.

ఈ సమయంలో అంటే 1930లలో భారతదేశం తిరిగి వచ్చిన తరువాత, ఆయనకు కలకత్తా మీద ఆసక్తి తగ్గింది. ఎలాగైనా స్థలమార్పిడి జరగాలనుకొంటున్నాడు. ఇది దక్షిణాదివైపైతే బాగుంటుందని ఆయన మనస్సు ఘోషిస్తున్నది. సరిగా ఇలాంటి సమయంలో కొంత ముందు వెనుకలుగా తెలుగుదేశంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రారంభించడానికి, దానికి స్థాపక కులపతిగా కట్టమంచి రామలింగారెడ్డిగారు పదవీ నిర్వహణ చేస్తుండటం జరిగింది. అటు తరువాత...

★ ★ ★

# ఆంధ్రవిశ్వవిద్యాలయంలో

చాలామంది రాధాకృష్ణన్ గురించి పూర్తిగా తెలియనివారు ఆయన తమిళుడనీ, ఒకవేళ ఆంధ్రుడైనా ఆయనకు ఆంధ్రాభిమానంలేదని యీలా రకరకాలుగా భావిస్తుంటారు. నిజానికి ఆయన ఆంధ్రులకు ఎలాంటి సేవ చేశాడో తెలుసుకోవాలంటే ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయానికి కులపతిగా చేసిన సేవలను పరిశీలిస్తేగానీ అర్థం కాదు.

1925లో విశాఖపట్టణంలో ఆంధ్రులకు ఆంధ్రప్రాంతంలో ఒక విశ్వవిద్యాలయం స్థాపించాలనే ఆలోచనలు జరుగుతుండగా రాధాకృష్ణన్ కలకత్తా విశ్వవిద్యాలయంలో పంచమ జార్జి చక్రవర్తి పండిత పీఠం అధ్యాపకుడుగా పనిచేస్తున్నాడు. ఆంధ్ర ప్రాంతంలో విశ్వవిద్యాలయ స్థాపన జరుగుతున్నందువలన కలకత్తా విడిచి పెట్టిరావాలనే ఆలోచన ఆయన మనోఫలకంలో మెదిలింది. కానీ 1927లో ఆయనను తీసుకోవాలనే ప్రతిపాదన ఏదీ రాలేదు.

ఆంధ్రవిశ్వవిద్యాలయ స్థాపన జరిగిన తరువాత అప్పటి కులపతి కట్టమంచి రామలింగారెడ్డి రాధాకృష్ణన్‌ను మొదటి స్నాతకోత్సవానికి పిలిచినప్పుడు రాధాకృష్ణన్ వాల్తేరు వచ్చి ఉపన్యసించాడు. ఈ స్నాతకోత్సవం 1924లో జరిగింది. ఆ సందర్భంలో ఆయన ఉపన్యాసం యువకులను ఉత్తేజితులను చేసింది. ఈ దేశ భవిష్యత్తు యువకుల భుజస్కంధాల మీద ఆధారపడి ఉన్నదని ఆయన ఉద్బోధించాడు. ఈ యువకులకు తమ కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నెరవేర్చాలని చెప్పాడు. ఈ తరహా ప్రసంగానికి ఇదే మొదలైనందువలన, ఆయన యువకులలో ఒకరకమైన ఉత్సాహాన్ని ఊపును తీసుకుని రాగలిగాడు.

ఆయన విద్యార్థులకే గాక, యునివర్శిటీ అధికారులకు కూడా హితబోధ చేశాడు. "కాలం మారుతున్నది". మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల అభిరుచులు

కూడా మారాయి. వాటిని గుర్తించి విశ్వవిద్యాలయ యాజమాన్యం తాము కూడా మారి, వారికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలి". అని ఆయన చెప్పాడు. తెలుగు మాధ్యమం పూర్తిగా తొలగించి, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయాలనే ప్రతిపాదన ప్రస్తావించి ఆయన వద్దని హెచ్చరించాడు.

ఉపన్యాసం శ్రోతలలో చాలా ఆసక్తిని రేపింది. వెంటనే కొన్ని పుకార్లు పుట్టాయి. రాధాకృష్ణన్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధి గురించి చాలా పథకాలు మనసులో ఉన్నాయనీ, వాటిని యదార్థం చేసేందుకు ఆయన వైస్‌ఛాన్సలర్ పదవిని తీసుకొంటారనేవే ఆ పుకార్లు. అయితే రాధాకృష్ణన్ ఈ విషయాన్ని ముందే పసిగట్టి అపోహలకు తావులేని విధంగా సి.ఆర్.రెడ్డిగారితో ముఖాముఖీ చర్చించాడు. మైసూరు విశ్వవిద్యాలయంలో రాధాకృష్ణన్ నియామకానికి రామలింగారెడ్డి విస్తారంగా కృషిచేశాడు. అందుకే వారి స్నేహం కలకాలం నిలిచి ఉన్నది కాబట్టి ఇలా చొరవ తీసుకొని మాట్లాడి రామలింగారెడ్డి పదవీకాలం పూర్తి అయ్యేంత వరకు ఎటువంటి నియామకాన్ని అంగీకరించనని ఆ తరువాత ఆలోచించుకోవచ్చని ఆయనతో ఖరాఖండిగా చెప్పివేశాడు. మైసూరు విశ్వవిద్యాలయంలో నియామకం అయ్యేనాటికి ఆయన కేవలం జీవికను అన్వేషించుకొంటున్న సాధారణ ఉపాధ్యాయుడు. ఇప్పుడు ప్రపంచంలోని విశ్వవిద్యాలయాలన్నీ ఆయనను ఆశిస్తున్న ఉన్నత స్థితిలో ఉన్న మహామహోపాధ్యాయుడు గురుబ్రహ్మ.

ఆంధ్రవిశ్వవిద్యాలయ స్నాతకోత్సవం తరువాత ఆంధ్రప్రాంతంలో విద్యావికాస కార్యక్రమాలలో ఆయన కొంత భాగం తీసుకొన్నాడు. తెలుగు విద్యార్థులు ఏర్పాటు చేసిన మహాసభలలో పాల్గొనటానికి ఆయన గుంటూరు, నంద్యాల వెళ్లి విద్యార్థుల అభిమానం చూరగొన్నాడు. తరచుగా ఆయన ఆంధ్ర ప్రాంతానికి విద్యాలయాలు ఎక్కువకావాలనే బోధతో ప్రజలలో ఒక చైతన్యం తీసుకొని రాగలిగాడు. అంతేకాదు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆయన చేసిన స్నాతకోత్సవ ప్రసంగమే అటుతరువాత ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలనే ఆలోచనకు బీజప్రాయంగా అంకురార్పణం చేసిందని అనంతర విశ్లేషకుల విశ్లేషణ. ఆంధ్రులు ఒకరిని యాచించి విశ్వవిద్యాలయాలు, విద్యాలయాల నెందుకు స్థాపించాలి? మనమే ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి స్థాపించుకో గలముగదా! ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం సిద్ధిస్తే వీటి అన్నింటినీ మనమే సమకూర్చుకోగలము గదా! అనే ఆలోచనలు ఆనాడే అందరి మనసులలో అంకురించాయి.

1930 డిసెంబర్‌లో, రామలింగా రెడ్డి రాజీనామా సమర్పించాడు. మార్చి 1931లో కులపతి (వైస్ ఛాన్సలర్) ఎన్నిక సంరంభం ప్రారంభమైంది. రాధాకృష్ణన్ కన్నా వయసులో పెద్దవాడైన సర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు ఆయనకు ప్రత్యర్థి. వెంకటరత్నం నాయుడు బ్రహ్మసమాజాన్ని ఆంధ్రప్రాంతంలో స్థాపించి ప్రచారం చేసిన వారిలో ప్రముఖుడు. అప్పటికే ఆయనకు మద్రాసు విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా చేసిన అనుభవం ఉన్నది.

పోటీ తీవ్రంగా ఉన్నది. రాధాకృష్ణన్‌కు ముప్పయి మూడు ఓట్లు వెంకటరత్నం నాయుడుకు ఇరవై ఎనిమిది ఓట్లు లభించాయి. రాధాకృష్ణన్ గెలిచినట్లు ప్రకటించారు. ఆయన 1931 మేలో, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. ఈ పోటీలో ఆయన గెలుపొందటంపట్ల ప్రజలు, పత్రికలు హర్షం వెలిబుచ్చాయి. విద్యార్థిలోకపు ఆనందానికి అవధులులేవు. అధ్యాపకులు అందరూఆనందాన్ని ప్రకటించారు. ప్రపంచ విద్యావేత్తలు అనేకులు అభినందించారు. "ఇప్పుడే ప్రాణం పోసుకొని నిలిచిన ఈ విశాఖపట్టణం ఆంధ్రవిశ్వవిద్యాలయం ఈ మేధావిపాలనలో రాజకీయాలకు అతీతంగా, విద్యాసంస్థగా సంపూర్తి అర్థంలో అభివృద్ధి చెందుతుందని ఆశించవచ్చు" అని వారు హర్షం వెలిబుచ్చారు. "రాధాకృష్ణ వైస్‌ఛాన్సలర్ కావటం వల్ల ఆంధ్ర విశ్వకళా పరిషత్తుకు ప్రపంచవ్యాప్తమైన గుర్తింపు వచ్చింది. కష్ట సాధ్యమైన లక్ష్యాలు ముందున్నాయి. వాటిని ఆయన సాధించగలడు. ఆంధ్రవిశ్వ విద్యాలయాన్ని కాపాడటంలో ఆయన సర్వశక్తులు ధారపోసి యితరులకన్నా ఎక్కువగా అభివృద్ధి చేయగలరనటంలో సందేహంలేదు" అని మద్రాస్ మెయిల్ అనే పత్రిక వ్రాసింది.

విశాఖలో పదవీబాధ్యతలు స్వీకరించగానే, తన కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేయటానికి ఆయన నడుంబిగించాడు. ముందుగా అప్పటివరకు విశ్వవిద్యాలయ కార్యస్థానం విజయవాడలో ఉన్నది. దానిని వాల్తేరుకు తరలించే ఏర్పాట్లు చేశాడు పాలక వర్గంలో కొందరు. దీనిని వ్యతిరేకించినా ఆయన ఖాతరు చేయలేదు. ఇక్కడి నుంచే విశ్వవిద్యాలయ పురోగమనం ప్రారంభమైంది. వాల్తేరులో పాలనా కార్యాలయ వసతికి, విద్యార్థుల వసతి, సౌకర్యాలకు ఎన్నోభవనాలు కావలసి ఉన్నది. వాటిని అన్నింటినీ కొద్దికాలంలోనే సమకూర్చటం చాలా కష్టసాధ్యమైన పని అయినా రాధాకృష్ణన్ దేనితోనూ రాజీపడకుండా అన్నీ సమకూర్చడం ప్రారంభించాడు.

ప్రొఫెసర్ హుమాయూన్ కబీర్ ఆయనచేసిన మొదటి నియామకం, ఆ తరువాత ఆయన భారతమంత్రివర్గంలో సభ్యుడు. ప్రొఫెసర్ హేరేన్ ముఖర్జీ. ప్రముఖ కమ్యూనిస్టు

నాయకుడు అత్యంత ప్రతిభ కలిగిన పార్లమెంటేరియన్‌గా భాసించాడు. వీరిద్దరూ విద్యార్థులుగా ఉన్నప్పుడు కలకత్తాలో రాధాకృష్ణన్ వారికి గురువు. ఈ యిరువురిని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి రప్పించాడాయన. వారు విద్యార్థులుగా ఉన్నప్పుడు వారికి ఉపకారవేతనం వచ్చేటట్లు చేసిన వాడాయన. రాజకీయ శాస్త్రంలో ఉపన్యాసకుడిగా వి.కె.కృష్ణమీనన్‌ను నియమించాడు. ఆయనను తీసుకొని రావటానికి హెరాల్డ్‌లస్కీ ద్వారా కృష్ణమీనన్‌కు చెప్పించవలసివచ్చింది. అటు పిమ్మట నెహ్రూ మంత్రివర్గంలో రక్షణశాఖ మంత్రి అయిన కృష్ణమీనన్ ఐక్యరాజ్యసమితిలో ఎంతటి వాదనా పటిమను ప్రదర్శించిందీ జగత్ప్రసిద్ధమయిన విషయమే. అంచనాల సంఘంలో పనిచేస్తున్న ముత్తయ్యను రప్పించి ఆర్థిక శాస్త్ర విభాగంలో నియమించారు. ఈ వరుసలో చివరివాడు ప్రొఫెసర్ వి.కె.ఆర్.వి. రావు. ఈయనను కేంబ్రిడ్జి నుంచి రప్పించారు. అటుతరువాత ఈ వి.కె.ఆర్.వి.రావే ఆర్థిక శాస్త్రంలో జాతీయ ఆచార్యుడుగా ప్రపంచ ప్రసిద్ధి పొందాడు.

ఈ నియామకాలకోసం ఆయన పెద్దవారిని చాలామందిని ఎదిరించాడు. ఎంతో స్వార్థాన్ని స్వచ్ఛందంగా వదులుకొన్నాడు. ఇందుకు కారణం ఇలాంటి మహామహులు ఉద్దండుల నియామకం వలన తన విద్యార్థులకు చక్కని విద్య లభిస్తుందనే సదాశయమే. వారు మంచి భవిష్యత్తుకలవారు కాగలరనే.

1932 నుంచి భౌతిక రసాయన శాస్త్రాలలో 'ఆనర్స్‌కోర్సు' ప్రారంభించాలని నిర్ణయించారు. ఒక సంవత్సరం తరువాత వృత్తి, విద్యాబోధన కూడా మొదలు పెట్టించాడు. ఆనాటికే సి.వి.రామన్ ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత వైజ్ఞానిక పరిశోధనలలో అందరికన్నా ముందున్నవాడు. ఆయనను పాలకవర్గసభ్యుడుగా ప్రతి పాదించాడాయన. అంతేకాదు. భౌతికశాస్త్రంలో ఆచార్యుడుగా కూడా ఆయన బాధ్యతలు తీసుకొన్నాడు. వృత్తి విద్యల విభాగం, సాంకేతిక విభాగాలకు, అంతర్జాతీయ ప్రముఖుడై, ఆ రంగంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నియమించాడు. ఇందరు మహానుభావులతోను, పండితప్రకాండులతోనూ ఉన్న అధ్యాపక వర్గం భారత దేశంలో మరే విశ్వవిద్యాలయంలోనూ లేదు. గణితశాస్త్రంలో యువమేధావి ఎస్.సి.చావ్లాను లాహోర్‌నుంచి రప్పించాడు రాధాకృష్ణన్. ఆ యువశాస్త్రవేత్తను రసాయనశాస్త్ర అధ్యాప కుడుగా నియామకం చేశాడు. ఇంతేగాక నీల్స్ భోర్, ఇడ్విన్ ఉత్స్, బెర్లిన్ యూనివర్శిటీలో పనిచేస్తున్నాయనను రప్పించారు. తరువాత కాలంలో రాయల్ సొసైటీ సభ్యులైన టి.ఆర్.శేషాద్రిగారిని ఉపన్యాసక ఉద్యోగానికి పిలిపించాడు. వాల్తేరులోని ఆంధ్రవిశ్వ విద్యాలయం, ఉద్దండ పండితులవేదిక అయింది. ఉత్తమ బోధనకు, ప్రతిభకు, వాల్తేరు వాగ్దానం చేయగల బలీయమైన సంస్థగా రూపుదాల్చగలిగింది.

మిగిలిన విషయాలన్నింటినీ, ప్రక్కన బెట్టి అన్నింటి కన్నాముందు భవనాలను నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టి రెండు సంవత్సరాలు కొనసాగించాడు. భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం భారతదేశ విద్యాభిమానులను ఆకర్షించింది. ఎత్తైన ప్రదేశంలో యాభై నాలుగు ఎకరాల స్థలం సేకరించాడాయన. భవన నిర్మాణ నిపుణులను రప్పించి కళలు, విజ్ఞానశాస్త్రం, బోధించేందుకు భవనాలు నిర్మింపచేశాడు. వసతి గృహాలు కట్టించాడు. టెండర్లు పిలిపించి, నిర్మాణ సంస్థను నిర్ణయించటానికి కలకత్తాలోని ప్రముఖ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులతో చర్చించి ఎంతో బాధ్యతాయుతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాడాయన. 1934వ సంవత్సరంనాటికి కొన్ని భవనాలు తయారైనాయి. 1936లో ఆయన వెళ్లిపోయేనాటికి చాలావరకు భవనాలు పూర్తి అయినాయి. రాధాకృష్ణన్ ఆంధ్రవిశ్వవిద్యాలయానికి సాధించిపెట్టిన ఘనత గురించి “రాధాకృష్ణన్‌గారు ఈ విశ్వ విద్యాలయాన్ని అభివృద్ధి చేసినవిధం అరేబియన్ నైట్సు కథని జ్ఞాపకం తెస్తున్నది. ఆయన ఏదో అదృశ్యమంత్రదండాన్ని విసిరారు. వెంటనే మంచిభవనాలతో అత్యుత్తమ అధ్యాప కులతో ఒక గొప్ప విశ్వవిద్యాలయం ప్రత్యక్షమైంది” అని సి.వి.రామన్ వంటి మహావైజ్ఞానిక వేత్త ప్రశంసించాడు.

మిగిలినవారు అందరూ అదే విధంగా భావించారు. ఇది సాధించటానికి ఆయన ప్రపంచ వ్యాప్తంగా తనకున్న పలుకుబడిని ధారపోశాడు. అంతేగాక తన ఆసక్తిని, మేధాసంపత్తిని, సమయాన్ని, శరీరశ్రమను, విశ్వవిద్యాలయ అభివృద్ధికి సర్వార్పణం చేసి దానికొక రూపురేఖలను, ఆకార నిర్మాణాన్ని కల్పించాడు. ఆ కాలంలో ఆయన అందించిన సేవలు, తీసుకున్న నిర్ణయాలు, చేసిన పనులు, విశ్వవిద్యాలయానికి జీవ ధాతువులై శాశ్వతకాలం నిలబెట్టాయి.

అసలు ఉంటుందా? ఊడుతుందా? అని అనుమానం కలిగించిన విశ్వ విద్యాలయం మూడు సంవత్సరాల్లో విశ్వవిఖ్యాత విద్యాలయం అయింది. ఈ ఘనత ఆయన అవిశ్రాంత కృషివల్లనే సాధ్యం అయింది. విద్యారంగంలో ఆయన సాధించిన చరిత్ర ఆంధ్రప్రాంతాల వారి విజయమై శాశ్వతంగా నిలిచిపోయింది. చక్కగా పనిచేయగల యంత్రాంగం నిర్మించాడు. మేధావులకు ప్రసన్నత కలిగించే వాతావరణం సృష్టించాడు.

విద్యార్థులకు అధ్యయనం చేయగల స్వేచ్ఛ, అధ్యాపకులకు స్వేచ్ఛగా బోధించగల అవకాశాన్ని కల్పించటం రాధాకృష్ణన్ స్వప్న సాఫల్యమే అనవచ్చు. “స్వేచ్ఛ కలిగిన హృదయాలలోకి విజ్ఞానం వెల్లువలా ప్రవహిస్తుంది” అని ఆయన సిద్ధాంతం. అలాంటి స్వేచ్ఛ, స్వచ్ఛతలతో ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నింపివేశాడు.

విద్యావేత్తలు తత్కాలీన ఒప్పందాలమీద విశ్వవిద్యాలయాల్లో పనిచేయగల విధానం ప్రవేశపెట్టింది, భారతదేశంలో మొట్టమొదటిగా రాధాకృష్ణనే. నెలకు వేయిరూపాయల వేతనం ఆచార్యులకు ఆ రోజులలో ఆకర్షణ కలిగించగలిన మొత్తమే. అంతేగాక ఆయన అధ్యాపకులకు ఇంకొక సహాయం చేశాడు. "అధ్యాపకులు దినవారీ కార్యక్రమంగా విద్యార్థులకు బోధన నిర్వహిస్తారు. అంతకన్నా ఎక్కువ పనిచేయాలనే ఆసక్తివారికి ఉండవచ్చు. అలాంటి వారికి వారివారి పాఠ్యవిభాగంలో పరిశోధన చేసే అవకాశం కల్పించాలి. పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించే అధ్యాపకులకు ఆకర్షణీయమైన వేతనాలు ఉండాలి. వారిని ప్రోత్సహించటం అత్యంతావశ్యకం" అని పాలకవర్గానికి తెలియజేస్తూ వ్రాశాడాయన. ఈ ప్రతిపాదనను వెంటనే యాజమాన్యం అంగీకరించింది. ఆ సంవత్సరమే అలాంటి పరిశోధనా పత్రానికి నగదు బహూకరించటం కూడా జరిగి పోయింది. అలా ఆయనవలన పరిశోధనకు, అధ్యాపకులకు ప్రోత్సాహం లభించింది.

విదేశీ విశ్వవిద్యాలయాల్లో ముఖ్యంగా ఆక్సుఫర్డ్ విశ్వవిద్యాలయంవంటి చోట విద్యార్థులకు ఒక మంచి సౌకర్యం ఉండేది. విద్యార్థులు తమ సందేహాలు తీర్చుకోటానికి, ఎల్లవేళలా అందుబాటులో ఉండేందుకు వీలుగా, ఒక అధ్యాపకునికి అప్పగిస్తారు. విద్యాబోధన తరగతి గదిలోనే గాక నిరంతరం జరుగుతుండే విధానం యిది. ఒక అధ్యాపకునికి కొందరు చొప్పున అప్పగిస్తారు. వారి సాన్నిహిత్యం విద్యార్థుల విజ్ఞాన పిపాస తీర్చే అవకాశం కలిగిస్తుంది. ఇది చాలా చిత్తశుద్ధి కల విధానం. విద్యార్థుల విజ్ఞాన పిపాస తీర్చే అవకాశం కలిగిస్తుంది. విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకులు చేయగలిగిన పూర్తి సహాయం ఇది. తొట్టతొలిగా రాధాకృష్ణే ఆక్సుఫర్డ్ విశ్వవిద్యాలయ విధానాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోకి తీసుకొని వచ్చాడు. విద్యార్థులకు ఈ విశ్వ విద్యాలయంపై ఆకర్షణ బాగా పెరిగింది. ఇంతేగాదు ఆయన మొత్తం విద్యాప్రపంచానికే సర్వకాలాలకు ఆదర్శప్రాయమైన మరో నిర్ణయంకూడా చేశాడు. వసతి గృహంలో ఉండే విద్యార్థులు అధ్యాపకులు కలిసి భోజనం చేసే పద్ధతి అది. దీని వలన అధ్యాపక విద్యార్థుల మధ్య స్నేహం పెరిగింది. అంతరాలు తగ్గి అవగాహన పెరిగింది. ఒకరికొకరు ఎల్లవేళలా అందుబాటులో ఉండగల అవకాశం కలిగింది. దీనివలన లాభపడిన విద్యార్థులు తమ జీవిత కాలమంతా ఈ విషయాన్ని స్మృతిలో ఉంచుకొన్నారు అభివృద్ధి పథంలో పయనించారు.

యూనివర్శిటీకి క్రీడాంగణం ఏర్పాటు చేసి ఆయన టెన్నిస్‌కోర్టు, ఫుట్‌బాల్ గ్రౌండు, క్రికెట్ మైదానం వంటివి ఏర్పాటు చేయించాడు. ఇంతేకాక 1932లో అప్పటి భారత

క్రికెట్ జట్టు కెప్టెన్ సి.కె.నాయుడును సంప్రదించి విశ్వవిద్యాలయ క్రికెట్ అభిలాషులకు శిక్షణ ఇప్పించే ఏర్పాటు చేయించాడు. అయితే ఈ పద్ధతి ఆయన యునివర్శిటీని వదలి వెళ్లిన తరువాతగానీ ఫలోన్ముఖంకాలేదు. దీనినిబట్టి ఆయనకు క్రీడలంటే ఎంత ఆసక్తి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

తరగతి గదుల్లో కాక, విశ్వవిద్యాలయం పరిధులలోనేగాక బయటి ప్రపంచంలో కూడా విద్యార్థులు ఉపాధ్యాయులు కలుపుగోలుతనంతో మెసలటానికి వీలుగా తత్వశాస్త్ర సభలు వాల్తేరులో ఏర్పాటు చేయించారు. దీనివలన విద్యార్థి అధ్యాపక బృందాలమధ్య సాన్నిహిత్యం ఇతోధికం అయింది. తన మిత్రుడయిన అల్లాడి కుప్పుస్వామయ్యగారికి మేధావుల ప్రవచనాలు విశ్వవిద్యాలయ విద్యార్థులు వినేందుకు వీలుగా వారి ఉపన్యాసాలు ఏర్పాటు చేయించే బాధ్యత తీసుకోమని వ్రాశాడు. ఇది వెంటనే అమలు జరిగింది. ఆయన చూపు ఇంకా ఉన్నత మార్గంలోకి వెళ్ళింది. మహాత్మాగాంధీని వాల్తేరు రావలసిందిగా ఆయన ఆహ్వానించాడు. రవీంద్రనాథటాగూర్‌ను ఆహ్వానించాడు. గాంధీ కార్యవ్యగ్రతవలన, ఉద్యమాల ఒత్తిళ్ళవలన రాలేకపోయారుగానీ, రవీంద్రనాథటాగూర్ వచ్చి విద్యార్థులకు ఉపన్యాసం ఇవ్వటమే గాకుండా ఒక నృత్య రూపకానికి దర్శకత్వం వహించి ఆంధ్రవిశ్వ విద్యాలయ విద్యార్థులకు ప్రదర్శించి వెళ్లారు.

తేజ్ బహదూర్ సప్రూ, రైట్ ఆనరబుల్ వి.యస్, శ్రీనివాసశాస్త్రిలను కూడా వాల్తేరుకు తీసుకొని వచ్చేందుకు ఆయన ప్రయత్నించాడు. బోదనాస్థాయి పెరిగేందుకు చేయవలసిన కృషినంతా చేశాడు.

ఆంధ్రులు అంతా కోస్తా, తెలంగాణా, రాయలసీమ (దత్తమండలాలు) అని విడిపోయి ఉన్నారు. వారికి మనసులు కలవవుకాని తమ ఆత్మరూపాలు ఒక్కటే అని గుర్తించాలి అని బోధించారు.

పదవీకాలం అయిదు సంవత్సరాలలో ఆయన విశ్వవిద్యాలయంలో చాలా శంఖుస్థాపనలు చేశారు. మనిషి తన పాత్రని నిర్ణయించుకోవటంలో తనను తీర్చిదిద్దు కోవటంలో విద్యకు చాలా ప్రధానపాత్ర ఉన్నది. దానిని వీలైనంత ఎక్కువ మందికి అందించే కృషిని ఆయన మహోన్నతంగా చేశారు. “ప్రజాస్వామ్యం, దాని ఉనికిని నిర్వాహకుల ద్వారా నిలుపుకోగలుగుతుంది. నాయకులు ధర్మబద్ధంగా ఉన్నప్పుడే అది సాధ్యం అని ఆయన ఉద్దేశ్యం. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఉన్నంత కాలం ఆయన సర్వేపల్లి రాధాకృష్ణయ్య అని సంతకం చేసేవాడు.

1933లో ఆయన పాతమిత్రుడు కాండెత్ వాల్తేరు వచ్చి కలిశాడు. పదవిలో ఎదిగినా కాండెత్ సమస్యలలో చిక్కుకొన్నాడు. వి.సి.గా రాధాకృష్ణన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాలక వర్గంలో సంపాదించిన ప్రేమాభిమానాలు చూచిన తరువాత కాండెత్ దిగ్భ్రాంతి చెందాడు. సర్.సి.వి. రామన్ కూడా ఈ విషయం చాలా గొప్పదని వర్ణిస్తూ “ఆయన ధనికుడు కాదు. కనీసం దృఢమైన శరీరం కలవాడు కూడా కాదు. ఆ బలహీనమైన శరీరంలో ఉన్న ఆత్మను మహోన్నతమైనదని మేమంతా అర్థంచేసుకొన్నాం. అందుకే ఆయనను మేము ప్రేమించాం. అభిమానించాం. పూజించాం” అన్నారు.

1931లో కేవలం మూడు సంవత్సరాలు వి.సి.గా ఎన్నికై తిరిగి 1934లో ఇంకొకసారి ఎంపిక అయ్యారు. 1937 ఫిబ్రవరి పదివరకు పనిచేయవచ్చు. కానీ ఆయన 1936 మే వరకే పనిచేశారు. 1935 ప్రాంతాలనుంచే ఏదో ఒకరోజు తాను వీ.సి. పదవినుంచి వైదొలగవలసి వస్తుందన్న స్పృహతో ఉండేవాడు. అందుకు తాను సర్వదా సిద్ధపడి ఉండేవాడు. విధి ఎవరినీ ఎక్కడా శాశ్వతంగా నిలపదు. అది జీవిత వాస్తవం. ఆ విషయం తెలిసినవాడు రాధాకృష్ణన్. 1934లో రాధాకృష్ణన్ మద్రాసులో పెద్ద ఇల్లు కట్టుకొన్నాడు. దానికి ‘గిరిజ’ అని పేరు పెట్టుకొన్నాడు. ఆంధ్రుల ప్రప్రథమ విశ్వకళా పరిషత్తైన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆయన దృఢమైన పునాదులు వేశాడు. ప్రపంచంలోనే గొప్ప విశ్వవిద్యాలయం ఎలా ఉండాలో చూపించాడు. ఆయన అప్పుడే ఆక్సుఫర్డ్ విద్యా పీఠానికి సందర్శక ఉపన్యాసకుడుగా (విజిటింగ్ ప్రొఫెసర్) అంగీకారం తెలిపాడు. కాబట్టి మద్రాసు ప్రభుత్వంలో ఉన్న స్థానాలు అన్నింటి నుంచి ఆయనను విముక్తిపరచారు.

కొద్ది రోజులలోనే ఇంగ్లండులో ఆయన ఆక్స్‌ఫర్డు ప్రస్థానం మొదలైంది.

★ ★ ★

# ఆక్సుఫర్డులో...

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా అన్ని రకాలైన పునాదులను గట్టిపరచి, అయిదు సంవత్సరాలపాటు నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో, దీక్షతో నిర్వహించి దానిని భవిష్యత్తులోనికి స్థిరంగా పురోగమించేటట్లు చేసిన రాధాకృష్ణన్ 1936 వరకు ఆ పదవిలో ఉన్నాడు. తరువాత ఆక్సుఫర్డ్ విశ్వవిద్యాలయంలో కొంతకాలం తన సేవలను వినియోగించే పని చేయాలనుకొన్నాడాయన. మద్రాసు ప్రభుత్వం నుంచి కావలసిన అనుమతులు తీసుకొన్నాడు. 1936లో ఆయన బ్రిటన్‌కు ప్రయాణం అయినాడు. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలయ్యేంత వరకు ఆయన అక్కడే గడిపాడు.

ఆక్సుఫర్డ్‌లో ఆయన తాత్కాలిక ఒప్పందం మీద చేయవలసిన ఉద్యోగం. ఆరునెలలు ఆక్స్‌ఫర్డ్, ఆరు నెలలు కలకత్తా విశ్వవిద్యాలయాల అధ్యాపకత్వం చేయాలి ఆక్సుఫర్డులో ఆ విద్యాపీఠం ఆయనకు అప్పగించటమంటే “ఆరుగురు భారతీయులను గవర్నరులుగా నియమించినంత ఘనత” అని ఒక సుప్రసిద్ధ పత్రిక వర్ణించింది. అయితే రాధాకృష్ణన్ దీనితో గర్వపడలేదు. ఈ నియామకం తత్త్వపండితుడుగా కేవలం తనకు మాత్రమే దక్కిన గౌరవం కాదని భారతీయుల ఆత్మవికాస ఘట్టంలో ఇదొక అధ్యాయమని అభివర్ణించాడాయన. హెరాల్డ్ నికోల్సన్ అనే పండితుడు ఇదొకఅధ్యాయమని అభివర్ణించాడు. హెరాల్డ్ నికోల్సన్ ఆక్సుఫర్డులో ఆయన ఉండగా ఒక సందర్భంలో కలిశాడు. రాధాకృష్ణన్ గురించి “ఆయన నెమ్మదస్తుడు. పెద్ద మనిషి. ఆయన వ్యక్తిత్వంలో ఔన్నత్యం, నమ్మశక్యంకానంతగా గొప్పది. ఇక్కడ ఆక్స్‌ఫర్డ్‌లో ఆయన నియామకం, ఆయన పొందుతున్న గౌరవం భారతదేశానికే ఘన విజయం” అని తెలిపాడు.

ఇంగ్లాండ్‌లో ఆయన తన కార్యక్రమాలను నిరాఘాటంగా కొనసాగించాడు. ‘ప్రపంచంలో ప్రభవించిన ఆత్మ’ అనే అంశంమీద ఆయన చేసిన ప్రసంగం మరోమారు ప్రపంచాన్ని దిగ్భ్రాంతి పరచింది. ఈసారి పండితులు, తత్త్వవేత్తలేగాక వివిధ దేశాలకు చెందిన నాయకులు కూడా ఈ ప్రసంగాన్ని అభినందించారు. ట్రినిడాడ్ మాజీ ప్రధాని

ఎరిక్ విలియమ్స్, హిర్‌బర్ట్ శామ్యూల్, ఆల్‌డస్ హెక్సిలీ, గెరాల్డు హార్ట్‌లాంటి వారి అభినందన పరంపరలు ఆయనకు లభించాయి.

మొదటి సంవత్సరం ఆక్స్‌ఫర్డ్‌లో భార్యా పిల్లలతో ఆయన ఉన్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలతో ఉడ్‌స్టాక్ వీధిలోని ఒక ఇంటిలో నివాసం ఏర్పాటు చేసుకొన్నాడు. ఎటెన్‌బెరోలో కొడుకును విద్యాభ్యాసం కోసం చేర్పించటానికి ప్రయత్నిస్తే కుదరలేదు. మిల్‌హిల్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ఉన్న, పాతకాలపు మిత్రుని కుమారుని సహాయంతో అక్కడ ఒక ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. భార్యాబిడ్డలతో చాలా ఆనందంగా గడచిన కాలం అది.

ఆయనకు అప్పటికి దాదాపు యాభై సంవత్సరాల వయస్సు వచ్చింది. కానీ యిప్పటికీ స్థిరమైన ఉద్యోగం ఏదీ లేనట్లే. మద్రాసులో ఇల్లు కట్టించుకొన్నందువలన ఇంకా కొని అప్పులు మిగిలి ఉన్నాయి. గ్రీసు, రోము, పాలస్తీనా దేశాలవారు కూడా ఆయన వెలి బుచ్చుతున్న ప్రసంగాలపట్ల దిగ్భ్రాంతులౌతున్నారు. “ఆయన తెలివి, మేధ, విజ్ఞానం, ఆత్మ, మనసు, స్ఫూర్తి అన్నీ ఎల్లవేళలా జాగృతమై ఉంటాయి” అని ఒక పండితుడు రాధాకృష్ణన్ గురించి చెప్పాడు.

కాలింగ్ ఉడ్ అనే ఆచార్యుడు ఆక్సుఫర్డులో రాధాకృష్ణన్‌ను అయిదు సంవత్సరాల కంటే ఎక్కువకాలం ఉంచాలని భావించాడు. దానికి అవసరమైన ప్రయత్నాలలో ఆయన మునిగి ఉన్నాడు. 1937లో, బ్రిటిష్ అకాడమి వారు ఒక అసాధారణమైన సందర్భాన్ని పురస్కరించుకొని బుద్ధభగవానుడిపై, ఆయనను ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారు. 1937 జూన్ నాటికి సిద్ధంగా ఉండమన్నారు. ఆ సభకు అంతర్జాతీయ ప్రాముఖ్యత ఉన్నది. సర్ డేవిడ్ రాస్ మహాశయుడు సభాధ్యక్షుడు. సభలో అప్పటికే లబ్ధ ప్రతిష్ఠుడైన టి.ఎస్.ఇలియట్ మహాకవి ఉన్నాడు. బుద్ధుని గురించి వినాలనే ఆసక్తితో ఇంకా అనేకులు మహామేధావులు అసంఖ్యాకంగా ఆ సభకు వచ్చారు. జ్ఞానమూర్తులతో సభ కిటకిటలాడు తున్నది. అధ్యక్షుడైన రాస్ మహాశయుడు ఒక గంటలో ఉపన్యాసం ముగించాలన్నాడు. లేకపోతే చాలామంది వారి రైళ్ళు అందుకోలేరని హెచ్చరించారు. రాధాకృష్ణన్ తన మేధకు పూర్తి పదును పెట్టి మెరుపులు మెరిపించాల్సినంత గొప్పసభ అది. ఆయన కాగితం మీదవ్రాసుకొని చదవడు. ఆశువుగా అనర్గళంగా ఉపన్యసిస్తాడు. గంట సమయంలోనూ, చిన్న తడబాటుకూడా లేకుండా ధారావృష్టిగా ఉపన్యసించాడాయన. పదాలు పగడాలై, మాటలు ముత్యాలై, వాక్యాలు వేద ప్రవచనాలై ఆ ఆధునిక ఋషిసత్తముని వాగ్ఝరి ప్రవహించింది. సభలోని పండిత ప్రకాండులంతా అవాక్కైవిన్నారు.

బుద్ధుడు ఒక సంఘ సంస్కర్త. ఆయనది ప్రత్యేకమతం ఏ మాత్రం కాదు. ఆయన సంస్కరించింది హిందూ మతాన్నే. హిందువులు తమ పూర్వుల బోధనలను మరచి పెడదారి పడితే ఆయన సవరించాడు. హిందూధర్మం బుద్ధుని వలన సుస్నాతమై, సంస్కృతమై దివ్య దీధితులు వెదజల్లిందని ఆయన చెప్పిన ఉపన్యాస సారాంశం. ఈ ప్రసంగంపై సభ్యుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. సర్ డేవిడ్ రాస్ ముగింపు వాక్యాలు చెపుతూ "రాధాకృష్ణన్ గురించి మీకు పరిచయం చేస్తూ ఆయన ఒక మహా పురుషుని గురించి మాట్లాడుతారని చెప్పాను. అది పొరపాటు. ఆ పొరపాటును, వారి ఉపన్యాసం వినిన తరువాత దిద్దుకొంటున్నాను. ఇప్పుడు ఒక మహా పురుషుని గురించి మీరు ఉపన్యాసం వినలేదు, ఒక మహాపురుషుడు చేసిన ఉపన్యాసం విన్నారు" అన్నాడు. ఆ మాటలు అక్షరాలా యదార్థమని మేధావులందరూ ముక్తకంఠంతో ప్రశంసించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ 'బుద్ధుని' అంతటివాడు అని ఆనాడే బ్రిటిష్ అకాడమీ ప్రకటించింది. అదే బ్రిటిష్ అకాడమీ కొద్ది కాలంలోనే ఆయనను తమ గౌరవ సభ్యుడుగా చేసి, సత్కరించింది. అందుకు కారణం ఈ ఉపన్యాసమే. అలా ఆయనకు గౌరవాన్ని అందించటం తమని తాము గౌరవించటం అనుకొన్నారు ఆ అకాడమీ నిర్వాహకులు. అలాంటి గౌరవాన్ని అందుకొన్న ప్రథమ భారతీయుడు రాధాకృష్ణనే. "రాధాకృష్ణన్ భారతీయుడే కాదు. ఆయనకు దేశాల హద్దులు లేవు. ఆయన ప్రపంచ పౌరుడు. ప్రపంచ గురువు. గురువులకు గురువు. మహామహోపాధ్యాయుడు" అని అందరూ కొనియాడారు.

1939లో భారతదేశంలో ఎక్కువకాలం గడపాలనుకొన్నాడాయన. ఆక్స్‌ఫర్డ్‌లో ఈస్టర్ పండుగ సెలవులు యిచ్చినపుడు ఆఫ్రికా పోవాలని సంకల్పించాడు. కారణాలు తెలియవు. కానీ ఆయన ఆఫ్రికా పర్యటన అంత సంచలనాత్మకంగా వెలుగు చూడలేదు. మహాత్మా గాంధీ చేత ప్రారంభించబడి ఆయన కుమారునిచేత నడుపబడుతున్న పత్రిక "ఇండియన్ ఒపీనియన్" అనేది మాత్రం ఆయన పర్యటన గురించి, 'స్వర్గలోకపు' మెరుపులు, అని వర్ణించింది. దక్షిణాఫ్రికాలో ఆయన ఒక గంట మాత్రమే ఉన్నారంటారు కొందరు. 1939లోనే ఆయన అమెరికాలోని దక్షిణకాలిఫోర్నియాలో గడపాలనుకొన్నాడు. ఇంతలో, అదే సంవత్సరంలో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. దానితో ఆయన యుద్ధం వలన కాలిఫోర్నియా ప్రయాణాన్ని విరమించుకొన్నాడు.

యుద్ధ ప్రకటనతో సమస్తం అల్లకల్లోలం అయింది రాధాకృష్ణన్ అమెరికా యాత్రతో సహా. ఆ పరిస్థితులలో ఆయన మాతృభూమికి మరలి రావాలని నిర్ణయించుకున్నాడు. త్వరలోనే తిరిగి స్వదేశంలో అడుగుపెట్టాడు.

★ ★ ★

# వారణాసి హిందూ విశ్వవిద్యాలయంలో

1939 సెప్టెంబర్‌లో రెండవ ప్రపంచయుద్ధ జ్వాలలలో అనేకదేశాలు చిక్కుకొన్నాయి. ఆంగ్లేయుల పరిపాలన క్రింద ఉన్నది కాబట్టి మన దేశంకూడా అందులో భాగస్వామ్యం వహించినట్లే. అప్పటికే దేశంలో స్వాతంత్ర్యోద్యమం తీవ్రమైన ఊపు అందుకొని ఉన్నది. యుద్ధ ప్రకటనతో భారతరాజకీయ ప్రపంచం పిడుగు పడినట్లు అల్లకల్లోలం అయింది. ఆ సమయంలో రాధాకృష్ణన్ ఆక్సుఫర్డులో ఉన్నాడు. అప్పటికే ఆయన అమెరికా పర్యటించాలనే ఆలోచనలో ఉన్నాడు. కానీ యుద్ధజ్వాలల వ్యాప్తి కారణంగా, ఆ ఆలోచనను ఆయన విరమించుకొన్నాడు. ప్రపంచ శాంతికోసం మేధావిగా ఆయన చేయవలసినదేమిటో ఆలోచించాలని పశ్చిమదేశాల మేధావి మిత్రులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన ఇంగ్లండ్‌లో ఉండటం క్షేమమే కాదు, సమంజసం కూడా కాదని భావించాడు. ఇలాంటి పరిస్థితులలో ఆయన మాతృభూమికి తిరిగి రావాలని నిర్ణయించుకొన్నాడు.

వారణాసిలో ప్రసిద్ధ హిందూ విశ్వవిద్యాలయం ఉన్నది. 1917వ సంవత్సరంలో అది ప్రారంభించబడింది. ప్రముఖ భారతీయ విద్వాంసుడు హిందూ సంప్రదాయాభిమాని మదనమోహన మాలవ్యా ఆ విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్. ఆయనే ఆ విశ్వ విద్యాలయాన్ని స్థాపించినవాడు కూడా. హిందూ రాజపుత్రులనుంచి మదనమోహన మాలవ్యా ఆ విశ్వవిద్యాలయం కోసం విస్తారంగా ధనం సమకూర్చి పెట్టాడు. ఆ విశ్వ విద్యాలయం సంప్రదాయ విద్యార్థులకు, దేశభక్తి ఉన్నవారికి స్వప్నాలను సాకారం చేయించగలదిగా భావించబడేది. క్రొత్తగా ప్రారంభించిన విశ్వవిద్యాలయం కాబట్టి భవనాలు, ఇతర సామాగ్రి వగైరాలకు ఆదాయాన్ని మించి ఖర్చుపెట్టాల్సి వచ్చింది. అందువలన విస్తారమైన భవనాలు, అన్ని రకాలైన విద్యార్థి విభాగాలు పనిచేస్తున్నాయి.

కానీ మౌలిక వసతుల కల్పనకు ధనం అంతా ఖర్చైనందున విశ్వవిద్యాలయ నిర్వహణ కష్టసాధ్యంగా ఉన్నది. అప్పటికే ప్రభుత్వాలు కొంత ధన సహాయం చేస్తున్నాయి. కానీ ఆ సహాయం సరిపోవడంలేదు. ఫలితంగా విశ్వవిద్యాలయం రెండు లక్షల అప్పుల్లో కూరుకుపోయింది. దీనిని అవకాశంగా తీసుకొని కొందరు పరిపాలనా సంఘంవారి నిర్వహణలోపాలే కారణమని, అనుమతులు నిధులు రాకుండా భవనాలు నిర్మించడం, పనులు చేయించడం తొందరపాటని రకరకాలుగా విమర్శిస్తున్నారు. ఇలాంటి స్థితిలో మదనమోహన మాలవీయ వైస్‌ఛాన్సలర్‌గా తాను పదవీత్యాగం చేయాలని, ఒక సమర్థుడైన వ్యక్తిని తీసుకొనివచ్చి ఆ పదవిలో నియమించాలని భావించాడు. సమర్థుడైన వ్యక్తికోసం ఆయన అన్వేషణ మొదలైంది. త్వరలోనే ఆయన దృష్టిలో యువకుడైన సమర్థుడుగా, రాధాకృష్ణనే నిలిచాడు.

ఇలాంటి పరిస్థితులలో హిందూ విశ్వవిద్యాలయాన్ని ఉద్ధరించవలసిందని మహాత్మా గాంధీ ఆయనకు సందేశం ఇచ్చారు. మదనమోహన మాలవీయ రాధాకృష్ణకు నియామక ఉత్తర్వులు పంపాడు. కానీ కలకత్తాలో నిర్వహిస్తున్న పండితపీఠం పదవి విడిచిపెట్టటం రాధాకృష్ణన్‌కు అంతగా సమ్మతంగాని విషయం. అందుకే మధ్యేమార్గం ఏర్పాటుగా ఆయన వారాంతాలు వారణాసిలో ఉండి విశ్వవిద్యాలయ కార్యక్రమాలను చూచుకొంటానని ఒప్పుకున్నాడు. విశ్వవిద్యాలయ పాలకవర్గం ఇందుకు అంగీకరించింది. దానితో శుక్రవారం సాయంత్రాలు వారణాసి రావటం, సోమవారం ఉదయం కలకత్తాకు తిరిగి వెళ్ళడం ఇలా సాగింది కొంతకాలం ఆయన ఉద్యోగ బాధ్యతల నిర్వహణ. చాలామంది ఆయన భారతదేశమంతా పర్యటించి, విరాళాలు తెచ్చి అప్పులు తీర్చాలని భావించారు. ఆ విధమైన విధానాలు పూర్తిగా సఫలం కాగలవని ఆయన భావించలేదు. గాంధీ మహాత్ముడు కూడా “అసాధారణమైన లోతైన విద్యలు మీరు చదివారు. కానీ అదంతా విరాళాల మూలంగానే చేయగలిగారా?” అని ఆయనకు పరోక్షంగా హెచ్చరిక చేశాడు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన రెండు సంవత్సరాల కాలంలో విశ్వవిద్యాలయం తీర్చవలసిన అప్పులో నాలుగోవంతు అంటే యాభైవేల రూపాయలు తీరింది. దీనిని ఒక శుభవార్తగానూ, ఆయన సాధించిన విజయంగానూ అందరూ భావించటం మొదలు పెట్టారు.

ఈ సమయంలో రాధాకృష్ణన్ విశ్వవిద్యాలయ వ్యవహారాలను చక్కపెట్టటానికి దాని నిర్వహణలో చాలా సంస్కరణలు తీసుకొని వచ్చాడు. ముందుగా నిధులుఏయే కార్యక్రమాల కోసం ఖర్చుచేయాలో వాటికి వేరువేరుకేటాయింపులు చేయించాడు. కేటాయించిన నిధులను ఆ విషయాలకోసమే ఖర్చు జరిగేటట్లు చేశాడు. ఖర్చులో అన్ని విధాల నియంత్రణ

పాటించి వృధావ్యయం కాకుండా చూచాడు. అంతేగాక తన వ్యక్తిగత పర్యవేక్షణ ఎక్కువగా ఉండవలసిన విషయాల మీద దృష్టిని కేంద్రీకరించటం కోసం, అభివృద్ధి సాధన ప్రారంభం అయిన తరువాత, రాధాకృష్ణన్ మరింత పట్టుదలతో ఎక్కువ సమయాన్ని కేటాయించటం మొదలుపెట్టాడు. అందువలన ఆయన వారానికి రెండు రోజుల కన్నా ఎక్కువ కాలమే వారణాసిలో ఉండవలసి వచ్చింది.

పూర్తికాలం విశ్వవిద్యాలయ కులపతిగా వారణాసికి రాధాకృష్ణన్ రాగానే, చాలా త్వరగా మంచి మార్పులు వచ్చాయి. తరచుగా ఆయన విద్యార్థులకు ఉపన్యాసాలను ఇచ్చేవాడు. విద్యార్థులకు యిచ్చే ఉపన్యాసాలలో హిందూమతం హిందూ నాగరికత, సంస్కృతుల వైవిధ్యాన్ని ఆయన వారికి వివరించేవాడు. ఇంకా విద్యార్థులకు అవసరమైన అనేక సంస్కరణలను ఆయన ప్రవేశపెట్టాడు. ఒకానొక సమయంలో చాలామంది మహమ్మదీయులు ఆయన దగ్గరకు వచ్చి ఇస్లాం అధ్యయన కేంద్రం ఒకదానిని స్థాపించమని కోరారు. అందుకోసం ఆయన హైదరాబాద్‌కు వచ్చి నిజాం ప్రభుత్వం నుంచి చెప్పుకో దగినంత మొత్తం ధనాన్ని కూడా సేకరించాడు. ఈ పనిచేయగానే ఇస్లామీయులైన మహ్మదీయులు, ఆ వర్గానికి చెందిన విద్యార్థుల సంతోషానికి అవధులు లేవు. అన్ని మతాల ఆత్మల్ని దర్శించిన మహాయోగి ఆయన. ఆయనకు అన్నిమతాలూ సమానమే గదా. అంతేకాదు వేదాధ్యయనం జరిపే ఒక పాఠశాలలో ఒక విద్యార్థినికి ప్రవేశం కల్పించాడాయన.

ప్రతి ఆదివారం భగవద్గీత మీద ఆయన వారణాసిలో ప్రసంగించేవాడు. ఇలాంటి అనేక సాంఘిక కార్యక్రమాల వల్ల హిందూ విశ్వవిద్యాలయం మతపరంగా ఇరుకు ఆలోచనలకు అతీతమైన విద్యాసంస్థ అని ఆయన నిరూపించాడు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తుండగానే 1942లో కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మధ్య ఏర్పడిన అనేక అగాధాలు పూడ్చటానికి రాధాకృష్ణన్ చాలా కృషిచేశాడు.

ప్రభుత్వానికి అనుకూలమైన విశ్వవిద్యాలయ కులపతిగా పనిచేస్తున్న రాధాకృష్ణన్ తేజ్‌బహదూర్ సప్రూ, జయకర్‌లలాగే రాజకీయ విషయాలలో కూడా చాలా గొప్ప గుర్తింపును పొందాడు.

విశ్వవిద్యాలయ సభలలో బహిరంగ సభల్లో ఆయన వైస్రాయిని విమర్శించాడు. త్వరగా భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించే చర్యలు తీసుకోవాలని బహిరంగ ప్రకటనలు చేశాడు. అప్పటికి ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. జపాన్‌వారు మనదేశంలోని నగరాల మీద బాంబులు వేస్తారేమోనని దేశమంతా భయంతో గజగజలాడిపోతున్నది.

ప్రభుత్వం వారు విశ్వవిద్యాలయాలను మూసివేయండని ఉత్తర్వులనిచ్చారు. కానీ ఆ సమయంలో విశ్వవిద్యాలయాన్ని మూసివేయటానికి రాధాకృష్ణన్ నిరాకరించాడు. అందుకు ప్రతిగా ఆగస్టు పధ్నాలుగవ తేదీనాడు జిల్లా న్యాయమూర్తి కొందరు పోలీసులను వెంటబెట్టుకొని విశ్వఇద్యాలయం దగ్గరకు, దానిని మూసివేయించాలని వచ్చాడు. కానీ రాధాకృష్ణన్ విశ్వవిద్యాలయం మెయిన్‌గేట్ దగ్గరే వారిని నిరోధించాడు. కొద్దిసేపు వారితో రాధాకృష్ణన్ సంభాషించిన తరువాత న్యాయమూర్తి తన ప్రతిపాదన విరమించుకొని తిరిగి వెళ్లిపోయాడు.

దేశంలో చాలా తీవ్రమైన ఉద్యమం జరుగుతున్నది. హింసాపూర్వకమైన సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయ విద్యార్థులలోనూ ఈ భావాలు ద్యోతకం అవుతున్నాయి. అయినా ఆయన విశ్వవిద్యాలయాన్ని మూయనీయలేదు. విద్యార్థుల నడవడికపై ఆయనకున్న నమ్మకం అంతబలీయమైనది. గాంధీగారిని ఆంగ్ల ప్రభుత్వం జైలులో నిర్బంధించింది. దానితో విద్యార్థులు రెచ్చిపోయారు.

హింసాపూర్వకమైన యెన్నో సంఘటనలు దేశంలో జరుగుతున్నదరిమిలా పరిస్థితిని పరిశీలించిన రాధాకృష్ణన్ తనదైన శైలిలో ప్రతిస్పందించాడు. ఈ పరిస్థితిని మార్చేందుకు వైస్రాయికి "మీరు మహాత్మాగాంధీ గారిని విడుదల చేయండి. తీవ్రత తగ్గించటానికి ఇదొక్కటే మిగిలి ఉన్న మార్గ"మని సలహాయిచ్చాడు. అంతటితో ఊరుకోకుండా అప్పుడే ఆయన జైలులో ఉన్న గాంధీగారికి కూడా ఒక ఉత్తరం వ్రాశాడు. "ఈ మహాభారత దేశ ప్రజల వాణిని నేను బ్రిటీష్ వారికి అర్థమయ్యేలా చెప్పటానికి ప్రయత్నిస్తున్నాను. మనకు స్వాతంత్ర్యం కావాలనేది నిస్సందేహంగా ప్రకటిస్తున్నాము. ప్రజలు స్వాతంత్ర్యాన్ని యెంత గాఢంగా కోరుకొంటున్నారో కూడా వారికి అర్థమయ్యేటట్లు తెలియచెబుతున్నాం. అయితే మీరు వెంటనే నిరాహార దీక్షమానుకోటం కూడా అవసరమే. మీ నాయకత్వం ప్రజలకు అత్యవసరం" అని ఆ లేఖలోని విషయం. అప్పటికీ కొందరు విద్యార్థులు, ఉపాధ్యాయులు విశ్వవిద్యాలయాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయి, స్వాతంత్ర్య రణరంగంలో ప్రత్యక్ష పాత్ర స్వీకరించారు.

భారత వైస్రాయి లింగ్‌లిత్‌గో రాధాకృష్ణన్‌ను గొప్పమేధావిగా, విద్యామూర్తిగా, సచ్చరిత్రునిగా మన్ననచేస్తుండేవాడు. రాధాకృష్ణన్ తొందరపడి ఎవరినీ మాట్లాడరనీ, శక్తివంతమైన మాటలతో ఆయన ఎంతో సాధించాడనీ లింగ్‌లిత్‌గోకు ఆయనమీద గాఢవిశ్వాసం. పరిస్థితిపై చర్చించటానికి తన ప్రతినిధిగా వైస్రాయ్, హాలెట్ అనే పెద్దమనిషిని పంపాడు. ఈ హాలేట్ ఆ సమయంలో ఒక రాష్ట్రానికి గవర్నరుగా కూడా

పనిచేస్తున్నాడు. అంతకు ముందే రాధాకృష్ణన్ పరిపాలకసలహామండలి వారి సమావేశం ఏర్పాటుచేసి ఏం చేయాలో తీర్మానించవలసినదని వైస్రాయిని కోరి ఉన్నాడు. రాధాకృష్ణన్ పరిపాలకసలహా మండలి పాలకసభ్యుడుగా కూడా ఉన్నాడు. విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్, పరిపాలకసలహా మండలి సభ్యుడు అయిన రాధాకృష్ణన్ చర్చలు జరిపించాలని కోరటాన్ని గౌరవప్రదమైన ప్రతిపాదనగానే లింగ్‌లిత్‌గో స్వీకరించాడు.

విలియంఫిన్స్ అనే ఆయన ఆ సమయంలో స్థానిక న్యాయమూర్తి. ఆయనకు కూడా రాధాకృష్ణన్ మేధాసంపద మీద అపార గౌరవం. లక్నోనుంచి యింకొక అధికారి వచ్చాడు. ఆయన పేరు మిఖాయిల్. ఆయనకు రాధాకృష్ణనంటే ఆరాధన.

ఇలా ఉండగా మహాత్ముని నిరసన వ్రతదీక్షను చూసీ చూడనట్లు ఉదాసీనంగా ఆంగ్ల ప్రభుత్వం వదలి వేసింది. రాధాకృష్ణన్ విషమిస్తున్న పరిస్థితిని చూచి ఆంగ్లేయులను హెచ్చరిస్తూ "ఆయన (గాంధీగారి) బక్క పలచని శరీరం మీకు బందీగా ఉండవచ్చు. దానిని విధ్వంసం చేయాలని మీరు చూడవచ్చు. కానీ ఆ బక్కపలచని శరీరంలో ఒక ఆత్మ అనేది ఉన్నది. అది మహోజ్జ్వల అగ్నిశిఖగా మారి ధార్మిక జ్వాలగా ప్రజ్వలించి, ప్రేమదీపంగా కలకాలం నిలిచిఉంటుంది" అని బహిరంగంగా ప్రకటించాడు. ఈ మాటలు ఆంగ్లేయులను హడలెత్తించాయి.

తరువాత కొద్ది రోజులలో గాంధీగారు నిరాహారదీక్ష విరమించకముందే రాధాకృష్ణన్ శరీరారోగ్యం చెడింది. తీవ్రమైన జ్వరం వచ్చింది. ఒక సమయంలో ఆయన మృత్యు ముఖంలో ఉన్నట్లు అనిపించింది. కానీ కలకత్తాలోని వైద్యుల సేవలు ఆయనకు మళ్ళీ ప్రాణదానం చేశాయి. అందువలన వారణాసిని వదలిపెట్టి వెళ్ళవలసి వచ్చింది. ఆరోగ్యం కొంత కుదుటపడిన తరువాత అనివార్యమైన విశ్రాంతికోసం ఆయన మద్రాసు వెళ్లవలసి వచ్చింది. రాధాకృష్ణన్ మైత్రిని ప్రాణప్రదంగా పరిగణించే మిఖాయిల్ ఆయన వారణాసిని వదలి వెళ్లిపోవటం వలన కలిగిన యెడబాటును భరించలేకపోయాడు. తన మనోగతాన్ని వివరిస్తూ "మీరు లేకుండా బెనారస్‌లో మేము ఎలా ఉండగలం? అంతా శూన్యంగా ఉన్నది". అని వ్రాశాడు.

అటు పిమ్మట కొద్ది కాలంలోనే మహాత్మాగాంధీని బ్రిటీష్ ప్రభుత్వంవారు చెరనుంచి విడుదల చేశారు. ఆ సమయంలో అంటే 1944లో రాధాకృష్ణన్ చైనాపర్యటన జరిపాడు. దేశంలో అన్ని వర్గాలకు ఆయన చైనా వార్త ప్రముఖమైన వార్తాంశమే అయింది.

యుద్ధ విరమణ జరిగిన తరువాత కూడా పరిస్థితులకు అనుగుణంగా విశ్వ విద్యాలయాన్ని తీర్చిదిద్దాలని ఆయన నడుంకట్టి అహరహం శ్రమించాడు. దాని

అభివృద్ధికోసం వ్యాపారులనుంచి డెబ్భైతొమ్మిది లక్షల రూపాయల ధనాన్ని సమీకరించాడు. మహాత్మాగాంధీ ఆయన చేసిన కృషిని అభినందిస్తూ ఉత్తరాలు వ్రాస్తుండేవాడు. నెహ్రూ విశ్వవిద్యాలయ అంతర్గత విషయాలలో యే కొద్దిపాటి మాత్రం కూడా జోక్యం కల్పించుకొనేవాడుకాదు.

ఆంగ్లాన్ని ద్వితీయ బోధనాభాషగా నియమించటానికి కారణం ప్రపంచ విజ్ఞానం విద్యార్థుల మనోఫలకంలో వాకిళ్ళు తెరిచేందుకే. అందుకే ఆయన ద్వితీయ బోధనా భాషగా ఆంగ్లం ఉండాలని కోరుకొనేవాడు. కులప్రాతిపదికమీద విద్యార్థులను పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో చేర్చుకొనే విధానాన్ని తృణీకరించాడాయన. అందుకు కారణం అది దీర్ఘకాలంలో చూపించే దుష్ఫలితాలను క్రాంతదర్శిగా ముందుగా ఉహించగలగడమే. కులమత విచక్షణలు విషతుల్యమని, అవి విలువైన అన్నింటినీ పరిగణనలోకి రాకుండా చేస్తాయని ఆయన ప్రగాఢంగా విశ్వసించాడు.

రాధాకృష్ణన్ వారణాశి హిందూ విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా ఉండటం ఆ తరువాత కొద్దికాలానికే పూర్తి అయింది.

★ ★ ★

# రచనలు - పుస్తకాలు

అది 1909వ సంవత్సరం. ఒక విధంగా క్రొత్త శతాబ్దంలో ప్రథమ దశకానికి చివరి సంవత్సరం.

అవసరాల తీవ్రమైన ఒత్తిడి వలన ఆయన ధనసంపాదనకు తనకు చేతనైన మార్గాలను అన్వేషించటం మొదలుపెట్టాడు. రోజంతా ప్రయివేట్లు చెప్పటం, అటు తరువాత విశ్వవిద్యాలయంలో న్యాయశాఖకు చెందిన పరీక్షా పత్రాలు దిద్ది, అర్ధరాత్రి దాటిన తరువాతే ప్రతిరోజూ నిద్రపోవటం. ధనం సంపాదించటానికి ఒక నిముషం కూడా వ్యర్థం కాకుండా యంత్రంలాగా పనిచేయవలసి వచ్చింది. ఇందులో భాగంగానే ఆయన 'ఎస్సన్షియల్స్ ఆఫ్ సైకాలజీ' (మనస్తత్వశాస్త్ర ముఖ్య విషయాలు) అనే రచనను చేశాడు. తన అవసరాల ఒత్తిడిని తట్టుకొనేందుకు చేసిన రచన యిది. మనస్తత్వశాస్త్రం అధ్యయనం చేసే విద్యార్థులకు, ఆ శాస్త్రాన్ని అధ్యయనం చేయదలచుకొన్న జిజ్ఞాసువులకు ఈ గ్రంథం చాలా ముఖ్యమైనది. ఈ గ్రంథం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రచురణాలయం 1912లో ప్రచురించింది. ప్రచురించిన కొద్దికాలానికే ఈ పుస్తకం అంతర్జాతీయ ప్రాముఖ్యతని సంపాదించుకొన్నది. తాను రచించిన పుస్తకం ఎంత విలువైనదో, ప్రచురణ అయిన తరువాత దానికి వచ్చే ప్రాముఖ్యత రాధాకృష్ణకు తెలియనిది కాదు. కానీ గత్యంతరం లేని పరిస్థితులలో ఆయన దానిని కేవలం అయిదు వందల రూపాలయకే సర్వహక్కులతో, శాశ్వత ప్రాతిపదికన ఇచ్చివేశాడు. ఈ గ్రంథ రచనతో రచయితగా రాధాకృష్ణకు కీర్తివచ్చినా, వ్యాపారపరమైన దృష్టితోచూస్తే యిది ఆయన చేసిన ఘోర తప్పిదమే.

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి పనికివచ్చే మనస్తత్వశాస్త్ర ప్రథమ పాఠాలు ఇందులో ఉన్నాయి. పండితులు యీ గ్రంథాన్ని పరిశీలించిన తరువాత భారతీయ

అధ్యాపకులు యూరోపీయ ఉపాధ్యాయులకు పాఠాలు నేర్పటానికి సర్వ విధాలాతగినవారు అనే గుర్తింపును తెచ్చిన గ్రంథం యిది.

ఈ పుస్తకంలో రాధాకృష్ణ అతి సంకీర్ణము, సంక్లిష్టము అయిన విషయాలను, తన భాషాపాటవంతో, రచనా విన్యాసంతో, పదప్రయోగ నైపుణ్యంతో ఎంత సులభంగా వివరించటానికి వీలుఅవుతుందో అంత సులభంగా వివరించాడు. ఈ పుస్తకంలో విషయ వివరణ ప్రతిభ హద్దులు దాటింది. ఇది మనస్తత్వశాస్త్ర ప్రాథమిక విషయ వివరణలో సాటిలేని గ్రంథంగా త్వరలోనే పేరు పొందింది. ఈ పుస్తక రచనచేసిన తరువాత త్వరలోనే రాధాకృష్ణ గ్రంథ రచనాసామర్థ్యాన్ని ప్రపంచంలో పలుదేశాలకు చెందిన పండితులు గుర్తించారు. ఆయన ఉత్తమ అధ్యాపకుడనే అంశాన్ని ప్రముఖ దేశాలన్నీ గుర్తించేటట్లు చేసిన గ్రంథం యిది. ఉన్నతమైన పథకంతో ఉత్తమ గ్రంథ రచన చేసి తన భవిష్యత్తును అన్వేషించుకొనటంలో చక్కని మార్గాలను వేసిన రచన యిది.

1915లో 'ఏషియాటిక్ రివ్యూ' (ఆసియా ఖండ సమీక్ష) అనే పత్రికలో ఆయనది ఒక వ్యాసం ప్రచురణ అయింది.

అటుతరువాత కొద్దిరోజులలోనే రాధాకృష్ణ భగవద్గీతమీద కొన్ని వ్యాసాలు రచించాడు. 'రాధాకృష్ణన్ భగవద్గీత మీద వ్రాసిన వ్యాసాలు, నా వ్యాసాలకు భావాలకు చాలా సన్నిహితంగా ఉన్నాయి' అని బాలగంగాధర తిలక్ వ్రాశారు. ఆ వ్రాతను చూచి రాధాకృష్ణన్ పులకించిపోయాడు. అయితే తిలక్ భగవద్గీతా వ్యాఖ్యానం మరాఠీలో ఉన్నది. రాధాకృష్ణన్‌కు అక్షరం మరాఠీరాదు. ఈ రచనల సాజాత్యం కేవలం కాకతాళీయం. ఇద్దరు మహావిద్వాంసుల భావనలు ఎలా కలవగలవో చెప్పడానికి ఒక ఉదాహరణ మాత్రమే. ఈ భగవద్గీత వ్యాసాలపై గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగోర్ ఎంతో గాఢంగా ప్రతిస్పందించారు. రాధాకృష్ణ 1909వ సంవత్సరంలో, గాంధీచేత నడపబడిన పత్రిక 'హిందుస్వరాజ్' లో వ్యాసాలు వ్రాశారు. అందులో పడమటి దేశాల వారిని తూర్పార బట్టారు. పడమటి దేశాల వారి జీవనవిధానాన్నే కాదు వారి సంస్కృతిని ఆయన ఏకి కాకులకేశాడు. భారతీయులకు ఏ విధమైన స్వాతంత్ర్యము లేకుండా అన్నింటాతామే అధికారం చెలాయించటం ప్రజాస్వామ్యానికి జన్మస్థలంగా చెప్పబడే బ్రిటన్‌కు తగిన పద్ధతికాదని ఆయన తీవ్రంగా విమర్శించాడు.

1928లో ఆయన 'కల్కి' అని ఒక వ్యాసాన్ని రచించారు. భారతీయుల విష్ణుమూర్తి యొక్క పదవ అవతారంగా చెప్పబడే కల్క్యావతారం అనే పేరునుంచి ఈ శీర్షిక తీసుకొన బడింది. నిజానికి ఇందులో విష్ణువు లేక మతానికి సంబంధించిన విశేషాలేమీ లేవు.

కల్కి ఉద్భవించి ప్రపంచంలోని చెడును నిర్మూలించి ధర్మసంస్థాపన చేయగలడని భారతీయుల విశ్వాసం. ఏదో ఒకనాడు భగవంతుడు పాపులందరిని నిర్మూలించి లేకపోతే శిక్షించి శిష్టరక్షణ చేస్తాడని పుణ్యాత్ములకు తన సామ్రాజ్యం ప్రసాదిస్తాడని అన్ని మతాలవారు నమ్ముతారు. ఆ విషయాలను మతపరమైన వాటిని కాక ఆయన సంస్కృతీ పరిరక్షణ, సన్మార్గంవైపు ప్రజలను నడిపించగలిగిన మహత్తర శక్తిని గురించి, ఆ విధంగా చేయవలసిన ఆవశ్యకతను గురించి ఈ గ్రంథంలో వివరించారు. ఇది ప్రచురించబడిన తరువాత ఎందరినో ఆకర్షించింది. అనేక భారతీయ భాషలలోనికి కూడా అనువాదాన్ని పొంది విశేష ఆదరణ పొందింది.

కల్కి రచన తరువాత ఆయన 'భారతీయ ఆత్మ' (Soul of India) అనే గ్రంథాన్ని తన సంపాదక పర్యవేక్షణలో వెలువరించారు. అనేకమంది ఉద్దండులు భారతీయ సంస్కృతి, జీవనవిధానం మొదలైన విషయాలను గురించి వ్రాసిన వివిధ వ్యాసాల సమాహారమే యీ గ్రంథం. దీనిలో ప్రస్తుత కాలపు భారతీయ రాజకీయ పరిణామాలు కూడా వివరించబడ్డాయి.

ఆయన తన వివిధ పర్యటనలలో దేశ విదేశాలకు చెందిన మిత్రులు అనేకులతో మతం గురించి మత విధానాలు, మానవుని జీవితం మీద మత ప్రభావాన్ని గురించి విస్తృతంగా చర్చించారు. వారి వారి భావాలను ఆయన ఆకళింపుకు తెచ్చుకొనటమే కాక, వాటిని క్షుణ్ణంగా అధ్యయనం కూడా చేశాడు. ఈ ప్రపంచంలో ఇప్పుడున్న మతాలన్నింటిని తొలగించగలిగితే అది అన్నింటికన్నా మంచి మతం అవుతుందని, తద్వారా ప్రపంచానికి మహోపకారం అవుతుందనే భావన ఆయనలో మెదిలింది. ఈ భావాలే, 1932లో ప్రచురించబడిన 'ఆదర్శవాది జీవన దృక్పథం' (An Idealist View of Life) అనే గ్రంథంలో ప్రతిఫలించాయి.

జీవితంలో అప్పటికే చాలా ముందుకు చొచ్చుకొని వచ్చిన రాధాకృష్ణ తన ఇరవైయవ సంవత్సరంలోనే మొట్టమొదటి గ్రంథాన్ని వ్రాశాడు. తత్త్వశాస్త్రాన్ని అధ్యయన విషయంగా తాను పఠించటమే గాక మానవ జీవితాలన్నింటికి ఆదర్శంగాతత్త్వశాస్త్రం వెలుగుదీపిక కావాలని ఆయన ఆశించాడు. నూనూగు మీసాల లేత్రాయంలోనే ఆయన The ethics of the Vedanta and its Metaphysical perceptions 'వేదాంత నియమాలు దాని అధి భౌతిక భావనలు' అనే గ్రంథాన్ని రచించాడు. తత్త్వశాస్త్ర విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపకరించే గ్రంథం. ప్రాథమికమైన తత్త్వశాస్త్ర అవగాహనను విపులీకరించే భావాలనేగాక తత్వశాస్త్ర గమ్యం దాని అంతిమ లక్ష్యాలను కూడా యీ గ్రంథం విపులీకరించింది.

ఆయనకు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రచురణ శాఖ తత్వశాస్త్ర ప్రాథమిక విషయాలను గురించి విపులీకరించే గ్రంథం వ్రాయాలని ఆయనను ప్రార్థించారు. అచిరకాలంలోనే ఆయన (Essentials of Philosophy) 'తత్త్వశాస్త్ర ముఖ్య విషయాలు' అనే గ్రంథం వ్రాసియిచ్చాడు. అది 1912వ సంవత్సరంలో ప్రకటించబడింది.

తత్త్వశాస్త్ర ముఖ్య విషయాలు రచన జరుగుతున్న సమయంలోనే రవీంద్రనాథ్ టాగోర్ రచనలను ఆయన చదవటం తటస్థించింది. రవీంద్రనాథ టాగూర్ గాంధీ వలెనే గొప్ప జాతీయవాది. దేశభక్తుడు. ఆత్మకు విముక్తి (మోక్షం), స్వేచ్ఛ కావాలని గ్రహించి అదే అంశాన్ని తన గొప్పరచనల ద్వారా ప్రచారం చేస్తున్న మహామేధావి.

ఆ సమయంలోనే ఠాగూర్‌కు రాధాకృష్ణన్‌కు విశేషమైన అవగాహన పెరిగింది. ఠాగూర్ రచనలకు వ్యాఖ్యానాల వంటి వ్యాసాలు ఆంగ్లపత్రికలలో విరివిగా వ్రాశాడు. అటుతరువాతనే టాగూర్ తన రచనలను ఆంగ్లంలోకి అనువదించి ప్రచురించటం ప్రారంభించాడు. రాధాకృష్ణన్ రవీంద్రనాథ్ టాగోర్ రచనల మీద వ్రాసిన విషయాలన్నీ సంకలితమై 1918వ సంవత్సరంలో (A Philosophy of Ravindranath Tagore) 'రవీంద్రనాథ టాగూర్ రచనా తత్త్వం' అనే పేరుతో ప్రచురింపబడింది. ఈ గ్రంథానికి త్వరలోనేగొప్ప పేరు లభించింది. 'స్వాతంత్ర్య భారతాన్ని అభిలషించే వారందరి దృష్టిలో ఆయన గొప్ప అవగాహన కలిగిన పండితునిగా నిలబడ గలిగాడు.

ఈ గ్రంథం ప్రచురించబడిన ఒక సంవత్సరంలో 1920వ సంవత్సరంలో " The region of Religion in Contemporary Philosophy " 'సమకాలీన తత్వశాస్త్రంలో మత ప్రమేయపు హద్దులు'నే గ్రంథాన్ని ప్రచురించాడు. ఇందుకు ఒక కారణం ఉన్నది. అంతకుముందు 1918 నుంచి ఆయన మైసూరు విశ్వవిద్యాలయ అదనపు కులపతిగా ఉద్యోగ నిర్వహణలో ఉన్నాడు. ఏ మాత్రం విశ్రాంతి లభ్యం అయినా, ఆయన ఈ సమయంలోనే, ఇంటిగదిలో కిరోసిన్ లాంతరు వెలుగులో అర్ధరాత్రి దాటేంత వరకూ తానూ విద్యార్థిగా మారి, అంతర్జాతీయంగా మహానుభావులు కీర్తిప్రతిష్టలను పొందిన తత్త్వశాస్త్రవేత్తలు రచించిన గ్రంథాలను చదవటం మొదలుపెట్టాడు. వాటిని ఎంతో గాఢంగా అధ్యయనం చేశాడు. అంతేగాక ఉద్దండ విద్వాంసులైన స్థానిక సంస్కృత పండితులను చుట్టూ కూర్చొనబెట్టుకొని ఆర్షవిద్యను పూర్తిగా అవుపోశన పట్టివేశాడాయన. సంస్కృత పండితులు తనలో కలిగించిన స్ఫూర్తి తత్త్వశాస్త్రంలో తనకున్న లోతైన అవగాహనను ప్రపంచం ముందు ప్రదర్శించటానికి ఆయనకు ఒక వాహిక అవసరమైంది. అందుకే ఆయన "ది రీజియన్ ఆఫ్ రెలిజియన్ ఇన్ కాంటెంపరరీ ఫిలాసఫీ" అనే గ్రంథాన్ని

రచించాడు. సమకాలీన తత్త్వశాస్త్రంలో మతానికి ఉన్న స్థానం గురించి పూర్తిగా చర్చించిన గ్రంథం అది. అది ఎంతో అగాధమైన తాత్త్విక విషయాలను చర్చించింది. వాటిని నిర్ధారించి విపులీకరించే ప్రయత్నం చేసింది. ఇలాంటి గ్రంథం ప్రాక్పశ్చిమదేశాలకు ఆదర్శప్రాయమైన యెన్నో విషయాలను బోధించింది.

విలియం జేమ్సు, బెర్గ్‌సన్, బెర్ట్రాండ్ రస్సెల్ లాంటి ప్రముఖ తత్త్వశాస్త్ర పండితుల దృష్టికి ఈ గ్రంథం వెళ్ళింది. అనతికాలంలోనే ఈ గ్రంథంవారిని చాలా హెచ్చుగా ఆకర్షించింది. అంతేగాదు చాలా తీవ్రంగా వారిదృష్టిని ఆహ్వానించేటట్లు చేసింది కూడా. సమకాలీన తత్త్వశాస్త్రాన్ని వివరించే ఈ ప్రామాణిక గ్రంథాన్ని ప్రపంచ పత్రికలు ఎన్నో ఆకాశానికి ఎత్తివేశాయి. కొన్నిపత్రికలు కొన్ని అంశాలతో విభేదించినా అది మహాగ్రంథమనే విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమే అయింది. ఆ పత్రికలు రాధాకృష్ణ పక్షపాతం లేకుండా రచిస్తాడని, తూర్పుదేశాల గురించి చెప్పేటప్పుడు కూడా వారి ఆలోచనల్లోని మంచీ చెడూల రెండు పార్శ్వాలని సమగ్రంగా దర్శించినవాడని వ్రాశాయి. అలాగే పశ్చిమదేశాల ధోరణులను కూడా విమర్శించి వ్రాశాడు ఆయన కొందరు దీనిని బైబిల్ మీద ఖండనరచన అనుకొన్నారు. కొందరు హిందూఛాందసులు కూడా కొన్ని విమర్శలు చేశారు. ఈ పుస్తకంలో మూఢనమ్మకాలు చీల్చి చెండాడబడ్డాయి. రాధాకృష్ణన్ తత్త్వశాస్త్ర పరిమితులను గురించి రాస్తూ 'ఈ గ్రంథం దైవాన్నే కాదు, దయ్యాన్ని కూడా నిర్వచిస్తుంద'ని వ్రాశాడు.

ఇంతకు అప్పటికి ఆయనకు ముప్ఫైరెండు సంవత్సరాలు గూడా పూర్తిగా నిండలేదు. ఈ యువకుడు మహామేధావి అయినా కనీసం తలపండినవాడు కాదు. చదువులకోసం సముద్రాలు దాటిన వాడుకాదు. ఎందరో విదేశీయ పండితులచే 'ఔరా' అనిపించు కొన్నవాడు, కనీసం ఒకసారైనా విదేశీయానం చేయలేదు. అందువలననే ఆయనది పూర్తిగా భారతీయమైన మేధోసంపదగా గుర్తింపబడింది. తత్త్వంలో మహా మేధావులైన బెర్ట్రాండ్ రస్సెల్, జేమ్సురార్డ్, స్కిల్లర్, హేస్టింగ్, పష్డల్, విల్టన్, కర్ బెర్క్యుసన్ లాంటి మహామహులు ఆయనపై ప్రశంసల జల్లు కురిపిస్తూ లేఖలు గుప్పించారు. మొత్తంమీద ఈ గ్రంథరచనతో రాధాకృష్ణకు గ్రంథరచనలో ప్రపంచ మేధావుల కోవలో సముచితమైన స్థానం లభించింది.

ఆ సమయంలో ఆయన 'ది క్రైం ఆఫ్ లీలా' (లీల చేసిన నేరం) అనే నవలను ఒకదాన్ని వ్రాశారు. ఆయన నవలా రచనలో అదే మొదటిది, చివరిదికూడా.

ఆనాటి బెంగాలీ సాహిత్యపు ఛాయలు ("The Crime of Leela") 'లీలచేసిన నేరం' అనే ఈ రచనమీద ప్రబలంగా ఉన్నాయి. విద్యాధికుల మనోభావాలను వర్ణించే

నవల ఇది. సమాజంలో మనిషికి గలస్థానం ఏట్టిది? అతడిమీద బయటి వత్తిడులు, అంతశ్చేతన తాలూకు ప్రభావాలు ఎలా ప్రతిఫలిస్తాయి అనే అంశాలకు ఈ నవలలో విపులీకరణ ఉన్నది. ఈ నవలలో ఏడు పాత్రలు ఉండగా వాటిల్లో ఆరుపాత్రలు పూర్తిగా ఉన్నత విద్యామూర్తులైనవే.

ఆర్.ఎస్. అనే సంక్షిప్తనామంతో రాధాకృష్ణ ఈ నవలను ప్రచురించాడు. ఈ నవలలో ఆయన భారతీయ స్త్రీలను గురించి వివరిస్తూ, 'ఎంతో నైతిక చరిత్ర కలిగిన భారతజాతి జీవితాల వెనుక ఆడువారి కష్టసహిష్ణుత, విశ్వాసపాత్రత, త్యాగభావం, సమర్పణ అనేవి, ఈ జాతి నిత్యనైతిక జీవితానికి ఆలంబనగా నిలిచి ఉంటాయి కానీ అన్ని ఉత్తమ గుణాలను కలిగి ఉన్న ఆడువారు నాలుగు గోడల మధ్య నిశ్శబ్దంగా జీవించి మరణిస్తారు" అని చాలా బాధాపూర్వకంగా అంటాడు. ఏది ఎలా ఉన్నా, ఈ నవల అంత ఉత్తమశ్రేణికి చెందినది కాదు. కానీ బెంగాలీలందరికీ ఈ నవలలోని పాత్రలు చాలా అభిమానపాత్రం అయ్యాయి.

ఆయన పుస్తకాలు ప్రచురించిన ప్రచురణకర్తలు ఆయనకు వ్రాస్తున్న ఉత్తరాలు ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా వాటికి బహుజనాదరణ లభ్యం అవుతున్నదనే విషయం ఆయనకు అర్థం అయింది. సాటి అధ్యాపకుల నుంచి అభినందనలు లభిస్తుంటే, ఆయన విద్యార్థులు తమ దేశికోత్తముని గ్రంథాలను గురించి చదివి, విని ఉద్వేగంగా నీరాజనా లర్పిస్తున్నారు. అలాంటి గురువుకు శిష్యులమైన తాము అదృష్టవంతులమని భావించు కొంటున్నారు. ఇక ప్రజలనుంచి ఆయనకు అనేక పొగడ్తలు లభ్యం అవుతున్నాయి.

ఈ సమయంలో ఆయన 'మైండ్' అనే అంతర్జాతీయ పత్రికలో వ్రాసిన వ్యాసాలు ప్రపంచ పాఠకులందరిని సంభ్రమంలో ముంచెత్తాయి. ప్రపంచమంతటా అవి ప్రాచుర్యం పొందాయి.

ఇలా ఉండగా 1923లో ఆయన వ్రాసిన 'భారతీయ తత్త్వశాస్త్రం' (The Indian Philosophy) మొదటి సంపుటం వెలువడింది. తరువాత రెండవ సంపుటం 1927లో వెలువడింది. ఈ రెండు సంపుటాల గ్రంథం, మొత్తం 1480 పుటల పరిమాణంగల ఉద్గ్రంథం. జార్జి అలెన్, ఆన్‌లిన్ అనేవారు ఈ గ్రంథాన్ని ప్రచురణ చేశారు. చాలామంది ఈ గ్రంథం ప్రచురించటం వలన చేతిచమురు వదలడం తప్ప వేరేమీ ఉపయోగం ఉండదని ఆన్‌లిన్‌ను నిరుత్సాహపరిచారు, కానీ ఆన్‌లిన్ మంచి విద్యావేత్త కూడా అయినందువలన ఈ గ్రంథాన్ని ప్రచురణకు ముందే చదివి అర్థం చేసుకోగలిగాడు. దానిసత్తా ఏపాటిదో అతనికి అర్థం అయింది. ప్రచురించిన కొద్దిరోజుల నుంచే ప్రపంచ

వ్యాప్తంగా రోజురోజుకూ ఈ గ్రంథం మీద ఆదరణ పెరిగింది. అమ్మకాలు కూడా విపరీతంగా పెరిగాయి.

హిందూతత్త్వశాస్త్ర చరిత్ర అని గాకుండా భారతీయ తత్త్వశాస్త్రచరిత్ర అని పేరు పెట్టడంలో ఆయన సమయజ్ఞత, ఔచిత్యమైన ఆలోచన శిఖరప్రాయంగా నిలిచాయి. ఇందులో ప్రదర్శించిన పాండిత్యం, రచనా విధానం, తార్కిక దృక్పథంతో సృజనాత్మక సృష్టిగా పరిణతి చెందిందని పండితులు అభిప్రాయ పడ్డారు. ఈ గ్రంథం వ్రాయటంలోని పరమార్థం భారతీయులు తమ ప్రాచీన తాత్త్వికవైభవాన్ని తిరిగి పొందాలంటే వారికి స్వాతంత్ర్యం సిద్ధించాలి అనే విషయాన్ని నొక్కి చెప్పటమే.

ఈ మహాగ్రంథాన్ని అధ్యయనం చేసిన తరువాత, భారతీయ తత్త్వశాస్త్రవేత్తల ముందు పాశ్చాత్యపండితులు బడిపిల్లలలాగా కనిపిస్తున్నారని టి.ఎస్.ఇలియట్ వంటి సుప్రసిద్ధ ఆంగ్లకవి, మహామేధావి అభిప్రాయపడ్డాడు. "భారతీయుల విజ్ఞానం పనికిమాలినదని భావించేవారు, దానిని గురించి యేమీ తెలియని వారే. భారతీయులకు విజ్ఞానం లేదని భావించేవారు ప్రపంచాన్ని చదువని వారే. తెలుసుకొనగలిగిన వారికి విజ్ఞానం ఎల్లెడలా పరివ్యాప్తమై ఉంటుంది. ఆ విజ్ఞానమంతటిని సమకూర్చుకొని తమలో యిముడ్చుకొని ముందుకు పురోగమనించేదే భారతీయ విజ్ఞానం" అని ఆయన ఈ గ్రంథంలో వివరించాడు. ఇతరుల జ్ఞానాన్నేకాదు యితర సంస్కృతులను కూడా తనలో యిముడ్చుకోగలిగినంత విశాలమయినది భారతీయత అని ప్రపంచ పండితుల దృష్టికి ఈ గ్రంథరచన ద్వారా తీసుకొనిరాగలిగాడాయన.

గాంధీగారు మరో క్రీస్తు అవతారం భారతీయ క్రైస్తవం అనే సిద్ధాంతం గురించి ఆయన గ్రంథరచన చేయాలని భావించాడు. కానీ ఆ ప్రయత్నం కొనసాగలేదు. అందువలన ఆయన నిరుత్సాహానికి లోనవటం జరిగింది.

1926లో, రాధాకృష్ణన్ ఆక్స్‌ఫర్డ్‌లో అనేకానేక ఉపన్యాసాలు యిచ్చాడు. తరువాత అవి గ్రంథరూపంలో ప్రచురితం అయినాయి. ఇవే (The Hindu View of Life) 'హైందవుని దృష్టిలో జీవితం' అనే గ్రంథంగా 1927లోనూ, (The Religion we need) 'మనకు అవసరమైన మతం' అనే గ్రంథంగా 1928లోనూ ప్రకటించబడ్డాయి. హిందూ ధర్మాన్ని, హిందువుల వికాసాన్ని వివరిస్తూ అన్నింటినీ తనలో ఇముడ్చుకోగల హిందూమత వైశాల్యతత్త్వాన్ని అద్భుతంగా ఈ గ్రంథాలలో రాధాకృష్ణన్ వివరించాడు. ఈ గ్రంథం పఠించే వారికి నైతికత అనేది అందని ఆదర్శం కాదని అర్థం అవుతుంది. దాని పఠనం వల్ల, మనస్సుకు క్రొత్త కిటికీలు తెరిచి, క్రొత్త గాలి పీల్చుతున్న అనుభూతి చెందగలం.

అనేకులు ఈ గ్రంథాలను పఠించి స్వేచ్ఛ అనే విధానం ద్వారా మనిషి ఆనందం పొంద గలగడం సాధ్యమేనని, హిందువుల జీవిత విధానం, ఆలోచనారీతులు పరిపూర్ణమైనవని అర్థం చేసుకోగలిగారు. ఈ 'హైందవుల దృష్టిలో జీవితం' గ్రంథం జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహామేధావి చాలా శ్రద్ధగా చదివి ముగ్ధుడైనాడు. అంతే కాకుండా తాను ప్రధాన మంత్రి అయిన తరువాత కూడా ఆ గ్రంథాన్ని చదువమని మిత్రులందరికి సలహా ఇస్తుండేవాడు. హిందువులకు స్వాతంత్ర్యమే కాదు స్వేచ్ఛ అనగా మోక్షం కూడా సాధించ గల శక్తి ఉన్నదని రాధాకృష్ణన్ ఈ పుస్తకంలో చెప్పగలిగాడు. ఆయనకుగల దేశభక్తి, ఆయన వివరించిన దేశభక్తి, స్వాతంత్ర్య సముపార్జన అనే అంశం దగ్గర ఆగిపోయేదికాదు. ఇంకా ఉన్నతమైనది.

తరువాత 1932లో నెహ్రూగారి అభ్యర్థన మీద (The Heart of Hinduism) 'భారతీయ ఆత్మ' అనే గ్రంథానికి ఆయన పర్యవేక్షణ, సంపాదకత్వం వహించి కూర్పు చేశారు. దానిలో ఆ కాలంనాటి రాజకీయ పరిణామాలు మాత్రమే వివరించబడ్డాయి. 1928లో లివర్‌పూల్ బిషప్ అయిన డేవిడ్ అభ్యర్థనమీద రాధాకృష్ణన్ ఆ సంవత్సరమే (The Religion We Need) 'మనకు అవసరమైన మతం' అనే వ్యాసాలు రచించాడు. ఇందులో ఆయన ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైజ్ఞానిక అంశాలను మతపరంగా సమన్వ యించే ప్రయత్నం చేస్తూ, అలాంటి అవసరం ప్రస్తుతం చాలా ఉన్నదని తెలియజేశాడు. బెర్గ్‌సన్, బెర్నార్డ్‌షాలు చెప్పే పరిణామవాద సిద్ధాంతాలను విపులీకరించి మతపరంగా దానిని సమన్వయించాడు.

1938లో రాధాకృష్ణన్ గాంధీగారిని కలిశాడు. గాంధీమహాత్ముడు తన జీవిత కథను వ్రాసేందుకు రాధాకృష్ణన్‌కు అనుమతి యిచ్చారు. గాంధీగారి గురించి తయారుచేసే జీవిత వివరాల సంచికకు వ్యాసాలు పంపవలసిందిగా కోరగా ఆయన మిత్రులైన బెర్‌నార్డ్ షా, బెర్‌ట్రాండ్ రస్సెల్, ఆర్చిబిషప్ లాంటి మహనీయులందరూ వ్యాసాలను పంపారు. లారెన్స్, చిక్‌సన్, రోమారోలా, సి.ఎఫ్.ఆండ్రూస్,ఎడ్వర్డ్ థాంసన్, గాంధీగారి విశిష్ట వ్యక్తిత్వాన్ని, ఉద్యమ పాత్రను శ్లాఘిస్తూ వ్యాసాలు వ్రాశారు. రాధాకృష్ణన్ ప్రపంచ ప్రజల మనసులో హత్తుకొనేటట్లుగా గాంధీమహాత్ముని ఉద్యమ ప్రాధాన్యత వివరిస్తూ, ఆ సంచికకు ప్రవేశిక వ్రాశాడు. ఈ పుస్తకాన్ని గురించి ఎడ్వర్డ్ హాలేటన్ అనే విమర్శకుడు రాధాకృష్ణన్ కృషిని ఈ గ్రంథాన్ని తీసుకొని రావటంలో ప్రశంసిస్తూ "మనం దాచుకున్న గ్రంథాలన్నీ అమ్మి, దీన్ని సంపాదించుకోవచ్చు. ఎందుకంటే సత్యంకోసం మనిషిపడే ఆరాటానికి ఈ గ్రంథమే పూర్తి సాక్ష్యం' అని తెలిపాడు.

1941లో ఆయన వారణాసి హిందూ విశ్వవిద్యాలయం కులపతిగా పనిచేస్తున్నారు. అప్పుడు ప్రతి ఆదివారం ఆయన కాశీనగరంలో భగవద్గీతమీద ప్రసంగించేవాడు. తరువాత ఈ ఉపన్యాసాల సారమే 1948లో (The Bhagavadgita) భగవద్గీత అనే గ్రంథంగా రూపుదాల్చింది. నిజానికి ఈ గ్రంథం 1947లోనే పూర్తి అయింది. దానిని గాంధీగారికి అంకితం ఇవ్వాలని రాధాకృష్ణన్ భావించాడు. అయితే అంకిత సభ జరుగకముందే మహాత్మాగాంధీ దుర్మరణం చెందటం వలన ఆ కార్యక్రమం ఆగిపోయింది.

ఇంకా ఆయన 1932లో (An Idealist View of Life) 'ఆదర్శవాది దృష్టిలో జీవితం' అనే పేరుతో వ్రాసిన గ్రంథంలో మతంయొక్క లక్ష్యం, దాని గమ్యం, విశ్వమానవుడు కావటానికి మానవుడు అవలంబించవలసిన విధానం మొదలైన విషయాలను గురించి వివరించాడు. అలాగే ప్రాచ్యపాశ్చాత్య మతాలు (East and West in Religion) అనే గ్రంథంలో ప్రాచ్యపాశ్చాత్య మతభావనలలోని సారూప్యవైరూప్యాలను పూర్తిగా చర్చించారు. ఆ రెండింటిలో ఉన్న ప్రధాన భావనల మౌలిక సూత్రం ఒకటేనని వివరించారు. ఇది 1933లో ప్రచురణ అయింది. అలాగే ఆయన (Freedom Culture) 'సంస్కృతి – స్వాతంత్ర్యం' అనే గ్రంథాన్ని 1936లోను (Eastern Religion and Western Thought) 'ప్రాచ్యమతములు – పాశ్చాత్య భావనలు' అనే గ్రంథాన్ని 1939లోనూ ప్రచురించాడు. ఇంకా (Education - Politics and war) విద్య – రాజకీయాలు – సమరం అనే గ్రంథాన్ని 1944లో వ్రాశాడు. 1944లోనే (India and Chaina) 'భారతదేశం – చైనా' అనే గ్రంథం ప్రచురించాడు. ఇందులో భారత చైనాల స్నేహం కేవలం ఒక భౌగోళిక ప్రాంతంలో ఉన్నందువలననే కాదని, ఆ రెండుదేశాల మధ్య సహస్రాబ్దుల కాలం నుంచి కొనసాగుతున్న స్నేహం, సాంస్కృతిక దౌత్యం మొదలైన ఎన్నో విషయాలు సమగ్రంగా వివరించబడ్డాయి. రాధాకృష్ణన్ బౌద్ధధర్మాన్ని గురించి చాలా కాలంక్రిందట ఆక్సుఫర్డ్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నప్పుడు ఇచ్చిన ఉపన్యాసాలను (The Dhamma Pada) 'దమ్మ పదము' అనే గ్రంథంగా ప్రచురించాడు. ఇది 1950లో ప్రచురించబడింది. భారతీయ వేదాంతానికంతా సారం ఉపనిషత్తులు. ఇవి వందల సంఖ్యలో ఉన్నప్పటికీ, కేవలం పది ఉపనిషత్తులకే పఠన, పాఠన ప్రచారాలు ఉన్నాయి. ఆ దశోపనిషత్తులలోపలి సారం అత్యద్భుతంగా ఉపనిషత్తులు గ్రంథంలో వివరించబడింది. ఇది కూడా ఆయన చేసిన అనేక ఉపన్యాసాల సారమే. ఇది 1953లో ప్రచురించబడింది. 'ఇండియన్ ఫిలాసఫీ' తరువాత ఆయన రచించిన ఉత్తమోత్తమ గ్రంథాలలో ఇది ఒకటి. ఇంకా ఆయన (Recovery of faith) 'విశ్వాస పునరుద్ధరణ'

అనే గ్రంథాన్ని 1955లోనూ, (East and West) 'ప్రాచ్య పాశ్చాత్యములు' అనే గ్రంథాన్ని 1955లోనూ, (The Fellowship of the Spirit) 'ఫెలోషిప్ ఆఫ్ ది స్పిరిట్' అనే గ్రంథాన్ని 1961లోను, 'ది బ్రహ్మసూత్ర' అనే గ్రంథాన్ని 1961లోనూ రచించాడు. భారతీయ తత్త్వశాస్త్ర అధ్యయనంలో బ్రహ్మసూత్రాలు పరాకాష్ఠగా చెప్పబడతాయి. ఎంతో సులభశైలిలో బ్రహ్మసూత్రాలను వివరించిన ఈ గ్రంథం అత్యద్భుతమైనది. రాధాకృష్ణన్ తన జీవిత కాలంలో చేసిన తత్త్వశాస్త్ర అధ్యయనసారమే బ్రహ్మసూత్రాలకు ఆయన చేసిన వివరణ అని చెప్పవచ్చు. ఆయన రచించిన చిట్టచివరి గ్రంథం (Religion in a Changing World) 'మారుతున్న ప్రపంచంలో మతం'. అనే గ్రంథం. సమకాలీన జీవన పరిస్థితులకు తత్త్వశాస్త్రాన్ని, దాని ఉపయోగాలను అన్వయింప చేస్తూ చేసిన రచన.

రాధాకృష్ణన్ వ్రాసిన గ్రంథాలు దేనికదే ఒక ఆణిముత్యం. విషయం తత్త్వశాస్త్రం. అతిగహనం, కుతూహలం రేకెత్తించేదికాదు. విసుగు పుట్టించేది. అయినా ఆయన చేతిలోపడి బంగారం అయింది. ఎందరో జిజ్ఞాసువులకు అవి ఉపాధేయాలు. అందుకే ఆ గ్రంథాలు చిరంజీవులు. తత్త్వశాస్త్ర వివరణలో వేటికవే సాటిలేని మైలురాళ్ళు.

★ ★ ★

# విద్యావేత్త

దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చింది. వాడవాడలా సంతోషం వెల్లివిరుస్తున్నది. ఎందరో దేశభక్తులు, స్వార్థత్యాగుల బలిదానం ఫలితం, లభించిన స్వాతంత్ర్యం. అయితే ఇందులో ఒక విషాదమూ ఉన్నది. భారతదేశం గుండె రెండు ముక్కలైంది. కాదు మూడు ముక్కలైంది. భారత్, తూర్పు పాకిస్తాన్, పశ్చిమపాకిస్తాన్ అనేవి ఆ ముక్కలు. తరువాత 1971లో తూర్పు పాకిస్తాన్ పాకిస్తాన్‌నుంచి విడిపోయి బంగ్లాదేశ్‌గా అవతరించింది. ప్రతి పౌరునికి ఎన్నో ఆశలు, కోరికలు. వాటిల్లో ఒకటి విద్యలలో భారతదేశం విశ్వవిఖ్యాతి పొంది విలసిల్లాలని. మనకు పనికిరాని విద్యా విధానాన్ని, గుమాస్తాలను తయారుచేసే బానిస, వలస రాజ్యాల విద్యావిధానాన్ని మనం వదిలించుకోవాలని ఎందరికో ఆసక్తి.

కానీ, దేశ ప్రధాన మంత్రి, పండిత నెహ్రూ ఈ విషయంలో ఇంకొక విధంగా ఆలోచించాడు. రాధాకృష్ణ ప్రతిభకు చాలినన్ని బాధ్యతలు లేవని భావించాడు. ఆయనను దేశాభివృద్ధికి వినియోగించుకొనటం ఎంతో అవసరమైన దానిగా భావించాడు. ఇకముందైనా ఆయనకు తగినన్ని బాధ్యతలను అప్పజెప్పి దేశ ప్రజలకు యితోధికంగా ఆయన సేవలు పొందే అవకాశం కల్పించాలనుకొన్నాడు.

దేశానికి తిరిగిరాగానే ఆయనకు భారతీయ సంపాదక మండలి అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఈ పదవిలో ఇంకా కుదురుకొని స్థిరపడకముందే ప్రణాళికా మండలికి ఉపసంఘమైన విద్యామండలికి అధ్యక్షునిగా ఆయన నియామకం జరిగింది. ఇప్పటివరకు ఆయన ప్రతిభ కేవలం ఒకటో రెండో విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఉపయోగించగల అవకాశం కలిగింది. దీనివలన పూర్తి విద్యా వ్యవస్థను మెరుగు పరచటానికి, అభివృద్ధి చేయటానికి ఆయనను వినియోగించుకోగల అవకాశం కలిగింది.

రాధాకృష్ణన్ లాంటి మహామహుణ్ణి విద్యావ్యవస్థ పర్యవేక్షణకు వినియోగించుకొంటున్నందు వలన భారతదేశ విద్యారంగం దినదినాభివృద్ధి చెందుతుందని నెహ్రూకూడా ఎన్నో ఆశలు పెట్టుకొన్నాడు.

తరువాత భారతీయ విద్యావిధానం ఇలా ఉండాలనే ముసాయిదా తయారైంది. స్వాతంత్ర్యసిద్ధి పొందిన తరువాత మన విద్యావిధానంపై జరిగిన సమీక్షలలో ఇదే మొదటిది. మహామహులంతా 1948 డిసెంబర్‌లో, ప్రథమ సమావేశం జరిపారు. అధ్యక్షుడైన రాధాకృష్ణన్ బాధ్యతాయుతమైన ఈ కార్యక్రమాన్ని ఎంతో పవిత్రంగా, విజ్ఞతతో నిర్వహించాడు. తాను విద్యారంగంలో విశ్వవిఖ్యాతుడైనా, అంతానాదే అన్నట్లుగా సర్వం సహాధికారాలు చలాయించకుండా యెంతో సంయమనంతో వ్యవహరించాడు. ఎక్కడా ఆయన స్వయం నిర్ణయాలు చేయలేదు. తమ పథకాలు, ఆలోచనలను వివరిస్తూ కొన్ని ప్రశ్నలు జోడించి, వానికి సమాధానాలు, సలహాలు అందించవలసినదిగా దేశంలోని వివిధ ప్రాంతాలలో విద్యారంగానికి సేవ చేస్తున్న రెండువేల తొమ్మిది మంది మేధావులకు ఉత్తరాలు వ్రాయించాడు.

ఈ సూచనలను సలహాలను స్వీకరించి ఒక చక్కని విద్యా కార్యక్రమ నివేదికను తయారుచేయించాడు. ఆయన పేరు మీదనే ఈ నివేదిక "రాధాకృష్ణన్ విద్యానివేదిక" అని ఈ నాటికి పిలువబడుతూ, ఎందరికో స్ఫూర్తిని నిర్దేశత్వాన్ని కలిగిస్తున్నది.

ఆ నివేదిక ప్రకారం ఆంగ్లభాష ద్వితీయ భాషగా నియమించబడింది. సంవత్సరాల తరబడి జీతభత్యాలు లేక దీనావస్థకు చేరుకొంటున్న ఉపాధ్యాయుల కడగండ్లు తప్పించటానికి విశ్వవిద్యాలయ నిధులను ఏర్పాటు చేయించి చెల్లింపులను క్రమబద్ధీకరించటానికి ఒక సంఘం (యూనివర్సిటీ గ్రాంట్సు సంఘం) ఏర్పాటు చేశాడు. చిత్తశుద్ధితో చేసిన రాధాకృష్ణన్ విద్యానివేదిక ఎందరికో మార్గదర్శిగా నిలుస్తున్నది.

★ ★ ★

# రాయబారి - స్నేహవారిధి

స్వాతంత్ర్యం లభించిన తరువాత 1949 నుంచి భారతదేశ విదేశాంగ విధానంలో భారీ మార్పులు ప్రారంభించబడ్డాయి.

భారత ప్రభుత్వం నెహ్రూ సహోదరి విజయలక్ష్మీ పండిట్‌ను సోవియట్ రష్యాకు రాయబారిగా పంపించింది. కారణాలేవో ఎవరికీ అంతుపట్టలేదు. విజయలక్ష్మీ పండిట్ ఆ పదవిని సరిగా నిర్వహించలేకపోయింది. పైగా ఆరునెలలు కూడా తిరగకుండానే ఆపదవిని వదలివేసింది. నేర్పు, చతురతలేకాక తన మహోన్నత వ్యక్తిత్వంతో గౌరవప్రదుడైన వ్యక్తిని రష్యా రాయబారిగా పంపించాలని నెహ్రూ సంకల్పించాడు. తగిన వ్యక్తికోసం అన్వేషణ ప్రారంభించాడు. అందుకు సరియైన వ్యక్తిగా రాధాకృష్ణన్‌ను గుర్తించి అర్థించాడు. ఆక్స్‌ఫర్డ్‌లో తాను అధివసించి ఉన్న విద్యాపీఠాన్ని శాశ్వతంగా విడిచిపెట్టటానికి ఆయనకు సమ్మతంగాలేదు.

ఆరునెలలు ఆక్స్‌ఫర్డ్‌లోనూ, ఆరునెలలు మాస్కోలోనూ బాధ్యతలు నిర్వహించే విధంగా వారి ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ప్రతిపాదన త్వరలోనే సఫలమైంది. 1949 జులై నెలలో ఆయన నియామకం ప్రకటితమైంది. "భారత దేశ చిహ్నంగా ఆయన మాస్కో వెళ్తారు" అన్నాడు నెహ్రూ. ఆర్థర్ కోస్లర్ స్టీఫెన్ స్పెండర్ వంటి మేధావులు రచించిన "దేవుని పరాజయం" అనే గ్రంథాన్ని విమానంలో చదువుకొంటూ ఆయన మాస్కోచేరుకొన్నాడు. ఆయన అప్పటికే ప్రపంచ తత్త్వశాస్త్రాలన్నింటితో పాటు మార్క్సు తత్త్వశాస్త్రాన్ని కూడా అధ్యయనం చేసి ఉన్నాడు.

అప్పటికి రష్యాలో స్టాలిన్ నియంతృత్వ పాలన నడుస్తున్నది. సోవియట్ యూనియన్‌లోని ప్రముఖులకు రాధాకృష్ణన్ పేరు ప్రముఖ దార్శనికుడుగా పరిచయమే.

కొందరు ఆయన రచనలను పఠించినవారు రాయబారి అనే వాడికి చాలా చతురత అవసరం. దానిని ఆదేశంలో పుష్కలంగా ప్రదర్శించాడు రాధాకృష్ణన్. సోవియట్ యూనియన్ రాజ్యాంగ సమాచారాన్నంతటినీ త్వరలోనే ఆయన చదివి అర్థం చేసుకొన్నాడు. ఆ కాలంలో సోవియట్ రష్యాలో అడుగడుగుకు గూఢచారులే. పోలీసులే. రాయబార కార్యాలయ ఉద్యోగులను వారు చాలా నిశితంగాను, జాగ్రత్తగాను పరిశీలించి వారిపై నిఘా ఏర్పాటు చేసి ఉంచేవారు. రాధాకృష్ణన్ రాయబార కార్యకలాపాలు తప్ప వేరు విషయాల జోలికి వెళ్ళేవారు కాదని వారు త్వరలోనే గ్రహించారు. మౌనమే భూషణం అనే సిద్ధాంతాన్ని ఆయన పాటించాడు. ఒకవేళ అవసరమైతే, అంతవరకు వాడిగాను, సూటిగాను తీక్షణంగాను, స్ఫూర్తిదాయకం గాను మాట్లాడేవారు.

ప్రపంచవ్యాప్తంగా అమెరికా రష్యాలమధ్య ప్రచ్ఛన్నపోటీ, కీచులాటలు ఆ సంవత్సరం లోనే బయటకు వచ్చాయి. రష్యన్ల వద్ద 'న్యూక్లియర్ మారణాయుధం' ఉన్నదని అమెరికా ధ్యక్షుడు ట్రూమన్ బహిర్గతం చేసి ప్రకటించిన సంవత్సరం అదే. భారతదేశానికి ఆనాడు అగ్రదేశాల సరసన నిలబడగలిగిన స్థాయిలేదని ఆ రెండు దేశాలు భావిస్తుండేవి. అందుకే రాధాకృష్ణన్ రాయబార కార్యకలాపాలు తప్ప వేరు విషయాల జోలికి వెళ్ళేవారు కాదని వారు త్వరలోనే గ్రహించారు. మౌనమే భూషణం అనే సిద్ధాంతాన్ని ఆయన పాటించాడు. ఒకవేళ అవసరమైతే, అంతవరకు వాడిగాను, సూటిగాను తీక్షణంగాను, స్ఫూర్తిదాయకం గాను మాట్లాడేవారు.

ప్రపంచవ్యాప్తంగా అమెరికా రష్యాలమధ్య ప్రచ్ఛన్నపోటీ, కీచులాటలు ఆ సంవత్సరంలోనే బయటకు వచ్చాయి. రష్యన్ల వద్ద 'న్యూక్లియర్ మారణాయుధం' ఉన్నదని అమెరికాధ్యక్షుడు ట్రూమన్ బహిర్గతం చేసి ప్రకటించిన సంవత్సరం అదే. భారతదేశానికి ఆనాడు అగ్రదేశాల సరసన నిలబడగలిగిన స్థాయిలేదని ఆ రెండు దేశాలు భావిస్తుండేవి. అందుకే రాధాకృష్ణన్ భారత సోవియట్ యూనియన్ ప్రభుత్వాలమధ్య చాలా దృఢమైన వారధిని నిర్మించటానికి తన చాకచక్యమంతా వినియోగించాడు.

ఎప్పుడూ పడకమీద చదువులు, వ్రాతలతో మునిగిఉండే ఆ భారతరాయబారిని చూడాలనుకొంటున్నానని సోవియట్ అధినేత జోసెఫ్ రుడాల్ఫ్ స్టాలిన్ అన్నాడు. అది సెప్టెంబరు నెల రష్యాలో గడ్డకట్టుకొనిపోయే చలికాలం. ఉదయం తొమ్మిది గంటలకు వారి సమావేశం ఏర్పాటు జరిగింది. అర్థగంట కాలపరిమితి ఇవ్వబడింది ఆ సమావేశానికి.

"రాయబారిగారూ! ఇతర రాయబారులు శాంతిని గురించి మాట్లాడుతున్నారంటే యుద్ధాన్ని గురించి ఆలోచిస్తున్నారని అర్థం. కాని మీరు శాంతిని గురించి మాట్లాడు

తున్నారంటే శాంతిని గురించే ఆలోచిస్తూ ఉంటారని అర్థమయింది నాకు" అన్నాడు స్టాలిన్. ఉక్కుమనిషి స్టాలిన్ నుంచి అంత గణనీయమైన పొగడ్తను పొందగలిగిన రాయబారి రాధాకృష్ణన్ ఒక్కడేనని రాజకీయకోవిదులైనవారు చెప్పుకొంటారు.

ఇలాగే యుగోస్లావ్ నేత మార్షల్ టిటోదా, ఇండోనేషియానేత సుకర్ణో, ఇంగ్లాండు ప్రధానమంత్రి చర్చిల్, అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ లాంటి వారికి సందేశాల ద్వారా శాంతి సహజీవనానికి తీసుకోవలసిన చర్యలగురించి ఉత్తరాల ద్వారా, మధ్యవర్తుల ద్వారా, వార్తలను రాధాకృష్ణన్ పంపేవాడు. ఈ చొరవ కారణంగానే యునెస్కోలో (అంతర్జాతీయ విద్యా సాంఘిక సాంస్కృతిక సంస్థ) ఆయన ఉపన్యాసం చెప్పే అవకాశం కలిగింది. ఆయన అక్కడ చేసిన ప్రసంగాన్ని నెహ్రూ, వాజ్‌పేయ్ మొదలైన భారతనేత లందరూ పొగిడారు. మధ్యలో రాయబారి పనినుంచి విశ్రాంతి తీసుకొని ఆయన మొదటి ఒప్పందం ప్రకారం అయిదు నెలలపాటు ఆక్సుఫర్డ్‌లో ఉన్నాడు. "మీరు ఆక్సుఫర్డ్‌లో ఉన్న అయిదు నెలలు సోవియట్ రష్యా భారతదేశాల స్నేహ చరిత్రలో శూన్యం సృష్టించింది. మీరు మరో సంవత్సరం రాయబారిగా ఉండాలి" అని జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఆయనపై ఒత్తిడి తెచ్చాడు. దేశశ్రేయస్సు కోసం ఆ ప్రతిపాదనను అంగీకరించి విద్యా విషయాలను కొద్దికాలంపాటు ప్రక్కన పెట్టవలసి వచ్చింది.

రాయబారిగా ఆయన భారతసోవియట్ దేశాలమధ్య సత్సంబంధాలు నెలకొల్పేందుకు ఆస్ట్రియా శాంతి ఒప్పందంలాంటి అసంబంధిత విషయాలను కూడా చాలా గొప్పగా వినియోగించుకొన్నాడు. అంతేగాక వ్యక్తిగత హోదాలో పశ్చిమ దేశాలవారికి సోవియట్ యూనియన్ మీద ఉన్న అపోహలు తొలగిపోయేందుకు శక్తివంచనలేకుండా కృషిచేశాడు. ఇన్ని రకాలుగా సోవియట్ భారతమైత్రికి పునాదులు వేసినందువలన యాభై సంవత్సరాల తరువాత కూడా ఈ రెండు దేశాలమైత్రి చెక్కుచెదరకుండా ఉన్నది.

★ ★ ★

# ఉపరాష్ట్రపతి - భారతరత్న

దేశం స్వాతంత్ర్యం సముపార్జించుకొన్న తరువాత 1950 జనవరి 26న గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది. 1952లో సాధారణ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు పార్టీ అనుకొన్నట్లుగానే ఎన్నికలలో ఘనవిజయం సాధించింది. 1950లోనే దేశాధ్యక్షునిగా బాబురాజేంద్రప్రసాద్ ఎన్నికైనాడు. ఆయనే 1952లో కూడా రాష్ట్రపతిగా కొనసాగాలని అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు పార్టీ నిర్ణయించింది. ఆయన కూడా అందుకు అంగీకరించాడు. ఇక ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగవలసి ఉన్నది. సరియైన అభ్యర్థికోసం నెహ్రూ చాలా పట్టుదలతో ఉన్నాడు. ఆయన మనసులో అప్పటికే ఒక వ్యక్తి సమర్థుడుగా, తగినవాడుగా మెదులుతున్నాడు. ప్రముఖ విద్యావేత్త, అప్పటి కేంద్ర విద్యాశాఖామంత్రి మవులానా అబుల్ కలాం ఆజాద్ ప్రమేయంతో కాంగ్రెస్ క్రియాశీల సంఘం సమావేశంలో పార్టీ తన అభ్యర్థిగా రాధాకృష్ణన్ పేరును ఖరారు చేశారు. వెంటనే ఆజాదే రాధాకృష్ణన్‌కు ఆ విషయం తెలియజేశాడు. అప్పటికి రాధాకృష్ణన్ రష్యాలో భారత రాయబారిగా ఉన్నాడు.

ప్రతిరోజూ ఆయన కనీసం మూడు గంటల పాటు దేశం నలుమూలలనుంచి వచ్చిన వివిధరంగాలలో నిష్ణాతులైన వారిని, ప్రముఖులను కలుసుకొని మాట్లాడేవాడు. వారితో అనేక విషయాల గురించి చర్చించేవాడు. అందుకే ఆయనను పాశ్చాత్యులు తూర్పు ప్రాంతపు బెర్ట్రాండు రసెల్‌గా చెప్పు కొంటుండేవారు. అన్ని పనులు నిర్వర్తిస్తూనే ఆయన 1953లో ఉపనిషత్తుల మీద తన వ్యాఖ్యానాలను ప్రకటించాడు. దీనిపేరు "ముఖ్యోపనిషత్తులు" (The Principal Upanishads) ప్రచురించిన కొద్దికాలానికే గ్రంథానికి విశేష ప్రచారం, కీర్తి వచ్చింది. ఈ సమయంలో ఆయన కొన్ని దేశాలు పర్యటించాడు. ఆ సందర్భంలో న్యాయపతి డగ్లస్ "సర్వకాలాల మహాత్ములకోవలోని

వాడు" అని ఆయనను అభివర్ణించాడు. ఆయనకు సర్వాత్మసభలో గౌరవ సభ్యత్వం ఇచ్చి, న్యాయంలో విశ్వవిద్యాలయ గౌరవపట్టా ప్రధానం చేయబడింది. గిల్బర్టు ముర్రే అనే ప్రఖ్యాత విద్వాంసుడు 'ఆయన భారత ఉపరాష్ట్రపతి అయినందువలన ఆ పదవికి అంతర్జాతీయ ఖ్యాతివచ్చింది' అని చెప్పాడు.

ఉపరాష్ట్రపతిగా ఆయన అనేక దేశాలు పర్యటించవలసి వచ్చింది. ఈజిప్టును సందర్శించి, ఆ దేశంతో మన దేశానికి ఎనరాని మైత్రిని సమకూర్చాడాయన. ప్రపంచంలో అతి ప్రాచీన నాగరికతలను కలిగిన ఈ రెండుదేశాలు ఒకరి నొకరు గౌరవించుకొనటం మాత్రమే కాక, అభిప్రాయాలు కలబోసుకోవటం కూడా ఆధునిక సమాజానికి అత్యంతావశ్యకం అని ఆయన ఈజిప్టు పర్యటనలో తెలిపాడు. ఆయన కెయిరో, రోమ్‌లలో ఉపన్యాసాలిచ్చారు. తూర్పు జర్మనీవారు ఆయనను "అద్భుతమైన దూత" గా వర్ణించారు. ఆయన ఈ ప్రయాణంలోనే పారిస్‌లో కూడా ఆగాడు. అక్కడ ప్రసంగించాడు.

1955 ఫిబ్రవరిలో, ఆర్థికంగా అభివృద్ధిచెందిన దేశాల సమావేశం జరిగింది. మన దేశ అణుశక్తి విజ్ఞానంలో ప్రముఖ శాస్త్రజ్ఞుడు హోమీజహంగీర్ బాబా, బ్లాకెట్ అనే విదేశీ శాస్త్రజ్ఞునితోనూ ఆయన సంప్రదించి, అణు మారణాయుధాల విజ్ఞానం ప్రబల మవుతున్న విషయాన్ని ఖండిస్తూ, దానిపై అభివృద్ధి చెందిన దేశాల వైఖరి దుయ్యబట్టాడు. ఆ సమయంలో ఆయన సుదూర ప్రయాణంచేసి హంగేరియాను సందర్శించి వచ్చారు. ముందుగా సోవియట్ యూనియన్ తరువాత తూర్పు యూరప్ ఆ తరువాత హంగేరియా వరకు ఆయన ప్రయాణం సాగింది.

రష్యాలో స్టాలిన్ తరువాత వచ్చిన పరిపాలకుల వలన యిరుదేశాల సంబంధాలలో స్తబ్దత ఏర్పడింది. తన రష్యా పర్యటనలో 'మన రెండు దేశాల సంబంధాలలో స్తబ్దత ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోగల అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అని విశదంచేశాడు. 1955లో అప్పటి రష్యా ప్రధాని బుల్గానిన్, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కృశ్చేవ్ భారత పర్యటన జరిపారు. ఆ సందర్భంలో కాక అంతకుముందే కృశ్చేవ్‌కు కమ్యూనిజం గురించి తన భావాలను వివరించాడు. "కమ్యూనిజంలో సత్యాన్వేషణ ఉన్నది. కానీ వ్యక్తిగతమైన ఆంతరంగిక జీవితానికి గుర్తింపులేని సమాజంలో వ్యక్తిజీవితం సంపూర్ణత్వాన్ని సంతరించుకోదు" అని చెప్పాడాయన. రష్యా నాయకులు భారతదేశంలో పర్యటన జరిపినప్పుడు, కృశ్చేవ్‌తో "కేవలం జీవించి ఉండటానికే జీవితంకాదు. జీవితపు ఆంతరంగిక విలువలను ప్రతిభలను అది సమకూర్చగలగాలి". అని చెప్పాడు. ఈ భావాలు కమ్యూనిస్టు దేశాలు తమ ప్రసారసాధనాల ద్వారా ప్రసారం చేశాయి. రష్యాలోని క్రెమ్లిన్

విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తూ "కృశ్చేవ్, బుల్గానిన్‌లు ఆకలి చూపులతో ఉన్నారు. మొలటోవ్ చిరునవ్వుతో చూస్తున్నారు" అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించాడు. ఒక దేశ ప్రముఖ నాయకులను ఆ విధంగా వ్యాఖ్యానించగలగటానికి ఎంత చొరవ, వ్యక్తిగత అధికృత ఉన్నప్పుడే గదా సాధ్యమయ్యేది! అలాంటి గౌరవం ప్రపంచ నాయకులందరిలో ఆయన యెడ ఉన్నది కాబట్టే హేగ్‌లోని ఛార్లెస్ విశ్వవిద్యాలయంలో మాట్లాడినప్పుడు బ్రిటీష్ రాయబారి "ఆయన ప్రపంచానికి గురువు" అని అభివర్ణించాడు. రాధాకృష్ణన్ పండితుడు కేవలం ఉపరాష్ట్రపతే కాదు మహనీయుడు. "ఆయనను ఆరాధించనివారు భారతదేశంలో లేరు" అని నెహ్రూ ఒకానొక సందర్భంలో ఆయన గురించి వివరించాడు.

స్వతంత్ర భారతదేశంలో అత్యుత్తమ దేశసేవ చేసినవారికి 'భారతరత్న' అనే పురస్కారం సమకూర్చాలని భారత ప్రభుత్వం అనుకొన్నది. పౌర విభాగంలోని అత్యుత్తమ పురస్కారంగా ఇది రూపొందించబడింది. 1954లో మొదటిసారిగా ఈ పురస్కార ప్రధానం చేయాలని తలపెట్టింది నెహ్రూ నేతృత్వంలోని భారతప్రభుత్వం. అందుకు మొదటి వారిగా సర్వేపల్లి రాధాకృష్ణన్, సర్.సి.వి.రామన్, చక్రవర్తుల రాజగోపాలాచార్యులను ఎన్నికచేశారు. ఆ విధంగా ఆయనకు 1955 ప్రథమార్ధంలోనే 'భారతరత్న' పురస్కారం ఇవ్వబడింది. ఈ విధంగా ఆయన భారతదేశ ప్రజలకు చేసిన సుదీర్ఘ నిస్వార్థసేవకు ప్రజలనుంచి తగిన పురస్కారం లభించింది.

1954లో, బుద్ధుని రెండువేల అయిదువందల సంవత్సరాల జయంతి ఉత్సవాలు ప్రపంచమంతటా ఘనంగా జరుపబడ్డాయి. ఆ జయంతి ఉత్సవ నిర్వహణ సంఘానికి రాధాకృష్ణన్ అధ్యక్షులు. ఆ సమయంలో చాలా స్పష్టంగా నెహ్రూ "గౌతమ బుద్ధుడి గురించి మనం చాలా విషయాలు మాట్లాడుకొంటున్నాం. రాధాకృష్ణన్‌గారే ఆ గొప్ప అంశాలను తన వ్యక్తిత్వంలో ప్రదర్శించగల ప్రజ్ఞాశాలి" అని ఆయనను గురించి తన భావాలను స్పష్టంగా వెల్లడించాడు.

రెండవసారి 1957లో, ఆయన ఉపరాష్ట్రపతిగా ఎన్నుకొనబడ్డాడు. అప్పటికే ఆయన భార్య మరణించటంవలన విధురుడుగా జీవితం గడుపుతున్నాడు. కొంతకాలం చాలా నిర్లిప్తునిగా కాలం గడిపినా, నెహ్రూ విజ్ఞప్తి మేరకు భార్యమృతి వలన గతంలో ఆగిపోయిన దగ్గరి నుంచి పని ప్రారంభించటం మొదలు పెట్టాడు.

పాశ్చాత్యదేశాల ప్రజలు, నాయకుల మద్దతును, భారతదేశానికి అప్పటివరకు తన అఖండమేధా సంపత్తితో సాధించిన ఆయన కూడా ప్రాచ్యదేశాలను భారతదేశానికి అనుకూల వైఖరి ప్రదర్శించేందుకు సర్వసన్నద్ధం చేయటానికి కృషిచేయటమే ప్రస్తుత

కర్తవ్యంగా భావించాడు. ఇండోచైనా, చైనా, మంగోలియాలను సందర్శించేందుకు ఆయన బయలుదేరాడు. అందులో భాగంగా కంబోడియాను సందర్శించాడు. ఆయనకు అసంఖ్యాకంగా కంబోడియా ప్రజలు స్వాగతం చెప్పారు. ఆయన మేధాసంపత్తి, ప్రపంచ ప్రఖ్యాతి గురించి తెలిసిన కంబోడియా ప్రిన్స్ సిహనౌక్ ఆయన సంభాషణలనుంచి ఎంతో ఉత్తేజాన్ని, స్ఫూర్తిని పొందగలిగాడు. ఈ పర్యటనలోనే దక్షిణ వియత్నాంలో హోచిమిన్ ఆయనకు అసాధారణ రీతిలో యెంతో ఎక్కువ శ్రద్ధా పూర్వకమైన స్వాగతం పలికాడు. "వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్యధోరణిని కలగలపండి" అని ఎంతో శ్రద్ధగా తన ఉపన్యాసం వింటున్న హోచిమిన్‌కు ఆయన సలహా ఇచ్చాడు.

చైనాకు సర్వస్వతంత్ర అధ్యక్షుడైన మావోతో చైనాలో సమావేశం అయినాడు. మదాం సూంగ్ చింగ్‌లింగ్‌ను మనదేశం సందర్శించ వలసినదిగా ఆయన ఆహ్వానించాడు.

ఈ సమయంలో కేరళలో గల తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని భారత ప్రభుత్వం రద్దు చేసింది.

ఈ పర్యటన ముగిసిన వెంటనే ఆయనను నెహ్రూ ఇంకొకసారి అమెరికా పంపించాడు. అమెరికాలో ఒకచోట రాధాకృష్ణన్ "నాకు ఆంగ్లం, ఫ్రెంచి, హిందూస్థాని, బెంగాలీ భాషలు వచ్చు. నా మాతృభాష తెలుగు" అని వ్రాశాడు.

అందుకే ఎవ్వరేమన్నగాక సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలుగువాడు. ఆయన తెలుగు కీర్తి తిలకం.

★ ★ ★

# వివాహం - వైవాహిక జీవితం

వెల్లూరులో పాఠశాల విద్య కొనసాగిస్తుండగానే రాధాకృష్ణకు వివాహమైంది. అప్పటికి ఆయనకు పదహారేళ్లు మాత్రమే.

శివకాము తండ్రి రైల్వేలో ఉద్యోగం చేస్తూ మరణించాడు. బ్రతికి ఉన్నప్పుడు ఆయన స్టేషన్ మాస్టారుగా ఉద్యోగం నిర్వహించేవాడు. ఆ సమయంలో శివకాము చాలా చిన్నమ్మాయి. తల్లి నిస్సహాయురాలు అయింది. అందువలన, తల్లి గొప్పగొప్ప సంబంధాలు తీసుకొనిరాలేనిస్థితి. తండ్రి మరణం, ఆర్థికంగా కుటుంబ పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటం, భర్తపోయిన దిగులు, కుటుంబ భారాలతో తల్లి దీనంగా ఉన్న కారణం యొక్క ప్రభావం ఎదుగుతున్న శివకాము మీద పడింది. అందువలన ఆమె చాలా ఉదాసీనత, ఒద్దిక, నిరాడంబరతలు కలిగిన బాలిక అయింది. గొప్ప గొప్ప కోరికలు, జీవితంలో ఏదో సాధించాలని, ఎన్నింటినో పొందాలనే ఆలోచనే కనీసం ఆమెలో అంకురించలేక పోయాయి.

రాధాకృష్ణ నిరుపేద. నిరాడంబరుడు. ఎప్పుడూ ముభావంగా ఉండే తత్త్వం. మంచి ఆశయాలు, అలవాట్లు ఉండి తనపని తాను చూచుకొంటూ ఉండే శాంత గంభీరమూర్తి. అందువలన మనస్తత్వాలలో ఒకరికొకరు సరిపోతారు. ఒకరు యింకొకరికోసమే పుట్టినట్లుగా సరిపోయారు. అనుకూలమైన స్వభావాలు, ఆలోచనలు ఉన్న వారిద్దరూ యోగ్య దాంపత్య జీవనాన్ని అనుభవించారు. జీవించారు.

రాధాకృష్ణ అయిదు అడుగుల పది అంగుళాలు ఉండి, ఎత్తరిగా ఉండేవాడు. శివకాము పొట్టిగా, పీలగా ఉండేది. ఆమెపేరు శివకాము సంబంధిత బంధువులు

శివకామియమ్మ అనేవారు. అయినా ఆయన ఆమెను 'పద్మ' అని పిలిచేవాడు. పెళ్లై కాపురానికి వచ్చిన తరువాత ఆ దంపతులు ఎంతో ఆత్మీయంగా కలిసిపోయారు. తమది యెన్నో జన్మల సంబంధం అన్నట్లుగా ఉండేవారు. వివాహం అయిన క్రొత్తలో వారి సంసారం ఆనందంగా సాగింది. కాలం గడిచే కొద్ది రాధాకృష్ణ గొప్ప విద్యావంతుడు, మేధావిగా పరిఢ విల్లుతున్నాడు. అనేకులు విద్యాధికులు, మేధావులతో ఆయనకు పరిచయాలు ఏర్పడుతున్నాయి. వారు తరచుగా తమ యింటికి కూడా వచ్చి చర్చలు సాగిస్తున్నారు. భార్య శివకాము ఆయన క్షేమమే తన సర్వస్వంగా భావించగలదు. అనుకూలంగా నడుచుకొనగలదు. కానీ ఆయన విజ్ఞాన జగత్తులో భాగస్వామిగా నడుచుకోగల జ్ఞానం ఆమెకు లేదు. ఆయననుంచి లభించిన పూర్ణమైన గృహస్థ జీవితమే శివకామికి సర్వస్వం అయింది. ఆమె భావన కూడా అదే.

"నా వివాహ జీవితం ఎంతో సార్థకతను పొందింది" అని ఎన్నోసార్లు ఆయన సంతోషంగా చెప్పుకోగలిగినట్లు ప్రవర్తించిన మహాయిల్లాలామె. ఆయన జీవితంలో ఎదిగేకొద్ది ఆయన వ్యాపకాలు పెరగటం, ఆమెకు బాధ్యతలు పెరగటం జరిగింది. ఏనాడైనా ఆ మహాయిల్లాలు భర్తను పల్లెత్తు మాట అనలేదు. వారి జీవితమంతా ఆదర్శ దాంపత్యంగానే గడిచింది.

1956లో, ఆమెకు రక్తపోటు పెరిగింది. అసాధారణంగా పెరిగిన ఆ రక్తపుపోటును సాధారణ స్థితికి తీసుకొని రావటానికి వైద్యులకు అసాధ్యమైంది. క్రమంగా ఆ రక్తపుపోటు గుండెపోటుగా పరిణమించింది. ఆ సంవత్సరం చివరి రోజులలో ఆయన ప్రాగ్దేశాలైన చైనా, ఇండొనేషియా, జపాన్ మొదలైన దేశాల పర్యటనలో ఉన్నాడు. 'దేశ విదేశాలలో ఆయా ప్రజలు, నాయకులు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. ఆయన టోక్యోలో (జపాన్ రాజధాని) ఉన్న సమయంలో, శివకామియమ్మ ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని, పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నదని వర్తమానం వచ్చింది. తక్షణమే ఆయన తన పర్యటనను అర్ధాంతరంగా ముగించుకొని భారతదేశానికి తిరిగి వచ్చాడు. తరువాత కొంతకాలంపాటు ఆయన భార్య ఆరోగ్యం చూసుకొనటానికి మద్రాసు రావటం, వెంటనే అధికారిక బాధ్యతల నిర్వహణకోసం ఢిల్లీ వెళ్ళవలసి వచ్చి, తరుచుగా ఢిల్లీ మద్రాసుల మధ్య ప్రయాణాలు చేయవలసి వచ్చింది.

ఒకసారి ఆమెను చూచి, తిరిగి ఢిల్లీవెళ్లిన వెంటనే, నవంబరు 26వ తేదీ 1956న ఆమె తుదిశ్వాస తీసుకొన్నట్లుగా డాక్టర్ల ద్వారా ఆయనకు వార్త అందింది. ఆమె గుండె శాశ్వతంగా ఆగిపోయినందువలన మరణం సంభవించిందన్నది వైద్యుల నిర్ధారణ. వార్త

తెలిసిన వెంటనే ఆయన ప్రయాణమై ఆ మధ్యాహ్నానికి మద్రాసు చేరుకొన్నాడు. ఆమె అంత్యక్రియలను తన చేతులమీదగానే నిర్వహించాడు. అటుతరువాత పదమూడు రోజుల పాటు ఆచారం ప్రకారం అపరకర్మలన్నింటినీ యథాశాస్త్రోక్తంగా నిర్వహించాడు.

ఆ సమయంలో ఆయన ఎంతో అంతర్ముఖుడైనాడు. అసలు జీవి ప్రయాణం ఎక్కడి నుండి ఎక్కడికి అనే మీమాంస ఆయన మనసులో మొదలైంది. అరవై రెండు సంవత్సరాల పాటు సాగినట్టిది వారిద్దరి దాంపత్యజీవనం. ఇందులో ఒడిదుడుకులెలా ఉన్నా, తీయని జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి. భార్యావియోగం ఆయనలో తెలీని గాయాలను రేపింది. ఆమెతో గడిపిన తీపి జ్ఞాపకాలు శల్యాల్లా వేధించసాగాయి. ధీర గంభీరుడైన ఆ మహానుభావుడు కూడా కొన్ని సమయాలలో ఎక్కిళ్ళుపట్టి రోదించాడు, తనను తాను నియంత్రించుకోలేకపోయాడు.

ఆమె దేహానికి దహన సంస్కారం, అంత్యక్రియలు చేసి తిరిగివస్తూ ఆయన 'నా జీవితంలో ముఖ్యమైన అధ్యాయం ముగిసిపోయింది' అని దిగులుగా తనలో తానే అనుకున్నాడు. తనతో అతిచిన్నతనంలోనే ఆమె జీవితం పెనవేసుకొనిపోవటం, ఆమె యిచ్చిన సహకారం గురించిన ఆలోచనలు, ఆయనను క్షణక్షణం వెంటాడి బాధిస్తున్నాయి. ఆయన అనేక కార్యక్రమాలలో దేశరాజకీయాలలో పూర్తిగా నిమగ్నం అయివున్నప్పుడు పెద్ద కుటుంబానికి రాత్రింబవళ్ళు సేవలు చేస్తూ భర్తచాటు యంత్రంగా తనను తాను మార్చుకొంటూ ఆమె చేసిన చిరస్మరణీయమైన సేవ గుర్తుకు వచ్చి, తీవ్రమైన దుఃఖం ఆయనకు పొంగివచ్చేది. ఏ మానవుడికైనా తన జీవితంలోనే కాదు ప్రాణంలోకూడా భార్య సగం. ఆమెలేని జీవితం తాను సగం కోల్పోయినట్లే.

రాధాకృష్ణ, శివకాములది అనుకూల దాంపత్యం. ఆమెనుంచి ఆయన సంపూర్ణ సహకారాన్ని, స్నేహాన్ని, గౌరవాన్ని, ప్రేమని సంపూర్తిగా అందుకోగలిగాడు. అందుకే ఆయన మహాపురుషుడు కాగలిగాడు. ఆయనలో ఆమె సగం.

★ ★ ★

# భారత రాష్ట్రపతి

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ప్రథమ రాష్ట్రపతిగా బాబూ రాజేంద్రప్రసాద్ ఎన్నికైనాడు. తిరిగి రాష్ట్రపతి ఎన్నిక 1957లో జరగవలసి ఉన్నది.

1962 మే నెలలో, భారత రాష్ట్రపతి ఎన్నిక జరిగింది. ఆయన అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థించింది. ప్రధాన ప్రతిపక్షాలు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించ కూడదని నిర్ణయించాయి. కొన్ని దేశంలోని ముఖ్య రాజకీయ పక్షాలు తమ సభ్యులను రాధాకృష్ణన్‌కే ఓటు చేయవలసిందిగా కోరాయి. అందరూ తమ వలలో ఉన్న కోయిలను ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యేటట్లు చూడాలని ప్రయత్నించారు. పోటీ అనివార్యం అయ్యే పక్షంలో కనీసం ఏకగ్రీవ ఎన్నికకు సమీపంగా ఆయన విజయాన్ని పొందేటట్లు చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. కాంగ్రెస్ ప్రయత్నాలకు అంచనాలకు మించిన మిగులు ఓట్లతో ఆయన గెలిచినట్లుగా ప్రకటించబడింది. జాతి సమర్థించిన అభ్యర్థిగా ఆయన గౌరవ ప్రతిష్టలు ఇనుమడించాయి. భారతజాతి అంతా దేశాధ్యక్షుడు అయిన మహా పండితునికి, అతి పేదరికం నుంచి, చిన్న ప్రభుత్వోద్యోగం నుంచి అంచెలంచెలుగా తన స్వయం కృషితో పైకి ఎదిగిన ఆ మహామహుని విజయాన్ని హర్షించింది. సామాన్యుడు అది తన విజయంగా భావించాడు.

రాధాకృష్ణన్ దేశాధ్యక్షుడు కాగానే దేశంలోని ప్రతి ఉపాధ్యాయుడు తమలో ఒకడు అంత అత్యున్నత పీఠాన్ని అధిష్ఠించినట్లుగా భావించాడు. అందుకే భారత జాతీయ ఉపాధ్యాయ సంఘం ఆయన జన్మ దినం సెప్టెంబర్ 5వ తేదీని ఉపాధ్యాయదినంగా ప్రకటించాలని కోరింది. వారి కోరికను భారత ప్రభుత్వం మన్నించింది. రాష్ట్రపతి భవనంలోకి అతిసాధారణమైన తీరులో కనిపించే అఖండ మేధావి ప్రవేశించారు. ఆయన

విషయంలో ఇలాంటి అద్భుతాలు జరగటం సర్వసాధారణమే అంటూ ప్రభుత్వం సెప్టెంబర్ 5వ తేదీని ఉపాధ్యాయ దినంగా ప్రకటిస్తూ చేసిన ప్రకటనలో పేర్కొంది.

యుద్ధ విషయాలలో వాస్తవాలు వివరించడానికి, ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టడానికి ఆయన ఆ సమయంలో అనేక విదేశీ పర్యటనలు చేశాడు. అందులో భాగంగానే ఆయన అమెరికా పర్యటించాడు. ఆ సమయంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న జాన్ ఎఫ్.కెనడీ ఆయనకు ఎదురువచ్చి స్వయంగా వైట్‌హౌస్‌లోని నివాసాల విభాగంలోనికి తోడ్కొని వెళ్ళాడు. కుటుంబసభ్యులకు ఆయనను పరిచయం చేస్తూ "ఆయన నుంచి నేర్చుకొనవలసినది ఎంతో ఉన్న"దని అన్నాడు. అంతేగాకుండా తాను ఆక్సుఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఆయన ఉపన్యాసాన్ని విని వ్రాసుకొన్న నోట్సును ఆయనకు చూపించి శిష్యునిలాగా ప్రవర్తించాడు. ఈ సందర్భంలో "పరిస్థితులు ఎల్లప్పుడు మనచేతుల్లో ఉండవు. అలాంటి క్లిష్ట సమయాలలో కూడా మన ప్రవర్తన ఎల్లవేళలా మన అధీనంలోనే ఉండాలి" అని గొప్ప జీవిత సత్యాన్ని కెనడీని ఆదర్శంగా చేసుకొని ప్రపంచానికి బోధించాడాయన. కెనెడీ ఆయన నుంచి వీడ్కోలు తీసుకొంటూ "మీరు ఏ మహాఋషులను గురించి ఇప్పటివరకూ చెప్పారో ఆ మహాఋషి మీరే"నని చెప్పి "మీ నుంచి క్రమంతప్పని వరుస పాఠాలను ఇప్పటి వరకు నేర్చుకొన్నా"మని సాదరంగా మాట్లాడాడు. అదే సమయంలో చేసిన బ్రిటన్ పర్యటనలో కొన్ని కీలక గొడవల మధ్య ప్రజాపర్యటన జరిపాడు. ఆయనకు బకింగ్‌హామ్ మహాసౌధంలో బ్రిటన్‌లో జరుబడే ఆర్డర్ ఆఫ్ మెరిట్ అనే అత్యున్నత గౌరవ పురస్కారాన్ని ఆ దేశ మహారాణి ప్రదానం చేస్తూ 'దీనికి మీకన్నా అర్హులైన వారు మరెవరూ లేదు" అని అభివర్ణించింది.

చైనా నమ్మక ద్రోహం చేసి అకస్మాత్తుగా వచ్చిపడి జరిపిన యుద్ధం రేపిన గాయాల వల్ల ప్రధాని నెహ్రూ 1964లో అనారోగ్యం పాలైనాడు. ఈ సమయంలో రాధాకృష్ణన్ తరచుగా ఆయనను కలిసి పరామర్శించి ఆత్మీయంగా మాట్లాడుతూ మానసికమైన గాయాలను మాన్పే ప్రయత్నం చేశాడు. ఎన్నో దశాబ్దాలపాటు వారిద్దరూ చేయీ చేయీ కలిపి ఈ దేశంకోసం పాటుపడిన వారేకదా! ఆ సంఘటనలను తరచూ ఇద్దరూ గుర్తుకు తెచ్చుకొనేవారు.

ఇంతలో 1964 మే 23వ తేదీన నెహ్రూ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. కానీ నెహ్రూ తన నిత్యకార్యక్రమాలను యథావిధిగా నిర్వర్తిస్తున్నాడు. మే 27 ఉదయం శ్రీమతి ఇందిరా గాంధీ టెలిఫోన్‌లో "నాన్నగారి ఆరోగ్య పరిస్థితి ఏ మాత్రం బాగాలేదు. ఆయన మనస్మృతిలో లేరు" అని చెప్పింది. వెంటనే ఆయన తన చిరకాల మిత్రుణ్ణి చూడటానికి

వెళ్లాడు. నెహ్రూ అపస్మారక స్థితిలో ఉన్నాడు. కనీసం ఆయనను వ్యక్తిగతంగా కూడా పరామర్శించలేని స్థితి అది. ఆయన అక్కడి నుంచి తిరిగివచ్చాడు. మధ్యాహ్నం గం.1.50 నిమిషాలకు నెహ్రూ కీర్తిశేషులయ్యారని ఆయనకు మంత్రివర్గ కార్యదర్శి వచ్చి తెలియజేశాడు. వెంటనే ఆయన రాజ్యాంగ విధి నిర్వహణకు చేయవలసిన ఏర్పాట్లు చేయించాడు. సాయంత్రం గం.4.30ని.లకు గుల్జారీలాల్ నందా ఆపద్ధర్మ ప్రధానిగా పదవీ ప్రమాణస్వీకారం చేశాడు.

ఆ తరువాతరోజే ఆయన సైనిక ప్రధానాధికారితో చర్చించి, తాను చెప్పవలసిన ప్రజాస్వామ్య బద్ధతకు అవసరమయ్యే పద్ధతులు వివరించాడు. లాల్‌బహదూర్ శాస్త్రి, మొరార్జీదేశాయ్ వంటి అగ్రనేతలను పిలిచి, అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్ నాడారుతో చర్చించాడు. నందా రాజీనామా జరిగింది. వెంటనే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకునిగా లాల్‌బహదూర్‌శాస్త్రీ ఏకగ్రీవ ఎన్నిక జరిగి ఆయన భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయడం జరిగిపోయింది. తిరిగి కృష్ణమీనన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం వంటి కొన్ని కీలక విషయాలను ఆయన లాల్ బహదూర్‌శాస్త్రితో చర్చించాడు. శాస్త్రి కూడా రాధాకృష్ణన్ సలహాలను యథాప్రకారం పాటించాడు.

ఆయన రాష్ట్రపతిగా ఉండగానే, ఉపరాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ యిచ్చిన సలహాపై ఉర్దూ భాష అభివృద్ధికి తగిన నిధులు ఇవ్వవలసిందని ప్రభుత్వానికి సిఫారసు చేసి సలహా ఇచ్చాడు. ఈ సలహా ఆ తరువాత కొద్ది రోజులకే కార్యరూపంలోకి వచ్చింది. ఈ సమయంలోనే ఆయన రష్యాను సందర్శించాడు. పాత మిత్రులు ఆప్యాయంగా ఆయనకు స్వాగత సత్కారాలు చేశారు. ఆయన కృషివలననే అప్పటి రష్యా ప్రధాని కృశ్చేవ్ భారత పర్యటనకు వచ్చాడు.

ఆయన పదవీ కాలంలోనే దేశంలో హిందీ జాతీయ భాషగా ఏర్పాటు చేయబడింది. 1965 సెప్టెంబర్‌లో పాకిస్తాన్ దుష్కర సైనిక మూకలు అంతర్జాతీయ సరిహద్దు రేఖను అతిక్రమించాయి. అప్పటి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్. త్వరలోనే అది ఘోర యుద్ధంగా పరిణమించింది. ఆ యుద్ధంలో పాకిస్తాన్ సైన్యం భారతదేశం చేతిలో చావుదెబ్బ తిన్నది. మనవారు రావల్పిండివరకు వెళ్లి ఇంకా ముందుకు చొచ్చుకొని వెళ్లటానికి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. అప్పటికి గానీ పాకిస్తాన్‌కు జరుగుతున్నదేమిటో స్మృతిలోకి రాలేదు. కానీ యుద్ధ విరమణ చర్చల కోసం రష్యాలోని తాష్కెంట్ నగరానికి వెళ్లిన ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చర్చలు విజయవంతంగా ముగించి యుద్ధ విరమణ ఒప్పందాలపై సంతకాలు జరిపిన తరువాత అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారనే

వార్త 11.1.1966వ తేదీ తెల్లవారు ఝామున గం.2.15లకు ఆయనకు నిద్రలేపి చెప్పవలసి వచ్చింది. తిరిగి వెంటనే గుల్జారీలాల్ నందా ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు. ఇద్దరు మంత్రివర్గ సభ్యులతో ఇందిరాగాంధీ కూడా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆ తరువాత జరుగవలసిన రాజ్యాంగ విహిత కార్యక్రమాల నిర్వహణను ఆయన యథావిధిగా నిర్వహింపచేశాడు.

జనవరి 15వ తేదీన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇందిరాగాంధీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తూ ప్రకటన విడుదల చేశారు. నాలుగు రోజుల తరువాత కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలిగా ఇందిరాగాంధీ ఎన్నికైనట్లుగా ప్రకటన వచ్చింది.

ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా, రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా చక్కని సహకారం సామరస్యాలతో పనిచేశారు. యుద్ధాల గాయాలతో దేశాభివృద్ధి కుంటినడక నడుస్తున్నది. ఆమెకు కావలసిన నైతిక స్థైర్యం, ప్రోత్సాహాలను ఆయన అన్ని విధాలా కల్పిస్తున్నాడు. ఒక తండ్రీ, కూతురు మధ్య ఉండదగిన ఆప్యాయత వారిద్దరి మధ్య నెలకొన్నది.

ఇందిరాగాంధీని సమర్థురాలైన పాలకురాలిగా తీర్చిదిద్ది, తండ్రికి తగిన తనయగా చేయాలని ఆయన ఆకాంక్ష. ఎందుకంటే 'ఆయన నా ఉపాధ్యాయుడు' అని నెహ్రూ చేత తరచుగా అనిపించుకోగలిగిన దశాబ్దాల సాహచర్యంతో మెలిగిన ఆ యిద్దరూ, కాలగతి వల్ల విడిపోయినా నెహ్రూ స్మృతులు రాధాకృష్ణన్‌కు తరచుగా గుర్తుకు వస్తున్నాయి. నెహ్రూపైగల అభిమానం, స్నేహం గౌరవం ఆయన సుత ఇందిరలో ఆయన చూచుకోగలుగుతున్నాడు. అందుకే తన మిత్రుని కుమార్తెను తన కుమార్తెగా చూచుకోగలిగాడాయన. అనేక మార్లు ఆయన "నీవు స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకో. ఇతరులు చెప్పిన మాటల వలన రెండు రకాల నష్టాలున్నాయి. చెప్పుడు మాటలలో చాలా భాగం అసత్యాలే ఉంటాయి. పైగా వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు మాటలను సృష్టించి నీకు కష్టాలు తెచ్చేవారుంటారు" అని ఆమెను తరచుగా హెచ్చరిస్తుండే వాడు.

ఇందిరాగాంధీ ఆయనకు భారతరత్న బిరుదు ప్రదానం చేస్తున్న సమయంలో "మీరు నిజంగా ప్రపంచ రత్నం. భారతరత్న బిరుదు తీసుకొన్న మిగిలిన వారికి ఆదర్శంగా ఉండేందుకు, భారతదేశం తనను తాను గౌరవించుకోటానికి ఈ బిరుదును మీకు సమర్పిస్తున్నది" అని అన్నది.

క్రమంగా ఆయనకు ఈ అధికార లాంఛన వ్యవహారాలు, ఇహ జీవిత నిత్య కృత్యాలు ఉప్పన, చప్పన అనిపించటం మొదలు పెట్టాయి. 1966 చివరినుంచే 1967లో జరుగబోయే రాష్ట్రపతి ఎన్నికల వేడి పెరగడం ప్రారంభం అయింది. ఆయన నిర్లిప్తునిగా, కర్మయోగిలాగా తన పదవీకాలంలో మిగిలి ఉన్న సమయాన్నంతటినీ గడిపాడు. అవును కర్మయోగులు.

**"ప్రతిలోమానులోమశ్చసామదానాది భేదనైః**

**ఆవర్జయతో శాత్రవాందండ సోద్యమనేనచ'** (సుందరకాండము)

అనుకూల కార్యము చేసిగానీ, అననుకూలములైన కార్యములు చేసిగానీ, సామదానాది చతుర్విధోపాయములు ప్రయోగించిగానీ సమర్థులైనవారు శత్రువులను లొంగ దీయుదురు.

అలాగే ఆయన అన్ని యుక్తులను అనుసరించి విధిని నిర్వర్తించాడు. పదవీకాలం గడిపాడు.

★ ★ ★

# చివరి రోజులు - స్వర్గారోహణం

1966వ సంవత్సరం డిసెంబర్ నాలుగవ తేదీన అకస్మాత్తుగా ఆయనకు కుడి చేతివ్రేళ్లు కొంకర్లు పోయినట్లు అనిపించింది. దేశ ప్రజలంతా ఆయన క్షేమాన్ని గురించి ఆందోళన చెందుతున్నారు.

శరీర ఆరోగ్యం బాగాలేదు. విశ్రాంతి తీసుకోవలసి ఉన్నదనే నెపంతో అప్పుడు ఉపరాష్ట్రపతిగా ఉన్న డాక్టర్ జాకీర్ హుస్సేనును తన బాధ్యతలు నిర్వహించవలసినదిగా ఆయన కోరుకొన్నారు. డాక్టర్ జాకీర్ హుస్సేన్ వివిధ రాజకీయ కార్యకలాపాలలో అనుభవశాలి కాగలిగేందుకే రాధాకృష్ణన్ అలా చేశాడు. ఆయన మనసు విశ్రాంతివైపు మొగ్గుతున్నది. అందుకే విశ్రాంతి తీసుకోవటం కోసం రాధాకృష్ణన్ భారతదేశపు అత్యున్నతమైన దేశాధ్యక్షుని పదవినుంచి వైదొలగాలని నిశ్చయించుకొన్నారు.

ఆయన వయస్సు 79వ సంవత్సరం జరుగుతున్నది. వృద్ధాప్యం మీద పడింది. అన్ని విధాలైన అలసట ఆయనను ఆవరించింది. అప్పటికి ఆరుదశాబ్దాల నిర్విరామ కృషి ఆయనను శారీరకంగా క్రుంగదీసింది. ఇక శరీరం ఏమాత్రమూ శ్రమకు సహకరించటం లేదు. అందుకే ఆయన అటువంటి నిర్ణయం తీసుకొనవలసి వచ్చింది.

ఆయన మద్రాసు (ప్రస్తుతం చెన్నై)లో ఉపాధ్యాయ జీవితం ఆరంభించాడు. విశ్వవిద్యాలయాలకు దేశికునిగా పనిచేసి వాటిని ఉన్నత పథానికి చేర్చాడు. ప్రపంచ మేధావులకు ఉత్తమ ఉపాధ్యాయుడుగా, గురుబ్రహ్మగా ఎదిగి విశ్వవిపంచి మీద యెన్నో మధురశ్రుతులు పలికించాడు. దేశ విదేశాల రాయబారిగా, భారతదేశ సాంస్కృతిక ప్రతినిధిగా, చివరకు రాష్ట్రపతిగా ఎదిగాడు. ఆయన మహోన్నతమైన వ్యక్తిత్వం ఎవరెస్టు శిఖరంతోనే పోల్చవచ్చు.

ఆ సంవత్సరం (1967)మే నెలలో ఆయన మద్రాసు చేరుకొన్నాడు. సంపూర్తిగా రకరకాల వ్యాపకాలలో మునిగి ఉన్నప్పుడు ఆయనకు బాధలు తెలియలేదు. నేడో ఒంటరి. కుటుంబసభ్యుల గౌరవాదరాలు పుష్కలంగా లభిస్తున్నాయి. అయినా ఒంటరితనం

ఆయనను పట్టిపీడిస్తున్నది. భార్యతో గడిపిన సంతోష సమయాలు ఆయనకు తరచుగా గుర్తుకు వచ్చి ఇబ్బంది పెడుతున్నాయి. ఏదో కోల్పోయిన భావం హృదయంలో ద్యోతక మవుతున్నది. అదే భావం కన్నులలో ప్రతిఫలిస్తున్నది. దాని తాలూకు ఏవో గాయాలు కళ్లల్లో కన్పిస్తున్నాయి. జీవితవృక్షంనుంచి యెన్నో మధురఫలాలను రుచిచూచిన ఉజ్జ్వలమైన వ్యక్తిత్వం విశిష్టమైందే అయినా, ఆ వయసులో ఒంటరితనం నుంచి ఆయన మనస్సు విముక్తి పొందలేకపోయింది.

10.9.1968న తన తరువాత దేశాధ్యక్షుడుగా ఎన్నుకొనబడిన డాక్టర్ జాకీర్ హుసేన్ స్వయంగా వచ్చి సాహిత్య అకాడమీ గౌరవ సభ్యత్వ ప్రదానం చేశాడు.

ఆయనకు శూన్యంలో ఉన్నట్లనిపించింది. అసలే పీల శరీరం. అందువలన అప్పటికే ఎముకల మీద చర్మం కప్పినట్లుగా ఉన్న శరీరపు తీరుతో ఆయన సన్నగిలిపోయి ఉన్నాయి.

కాలం దొర్లిపోతున్నది. ఒంటరితనంతో ఆయన ఆరు సంవత్సరాలకు పైగా పోరాడాడు. క్రమంగా తన శరీరారోగ్యాన్ని అవసరాలను కూడా పట్టించుకోకుండా ఉండే స్థితికి చేరాడు. మాట్లాడేటందుకు కూడా ఆయన శక్తి చాలనివాడే అయినాడు. ఒకటి రెండుసార్లు గుండెపోటు వచ్చింది ఆయనకు. ఎదురుగా ఉన్న మనుష్యులను గుర్తించలేక పోతున్నాడు. 1973 సెప్టెంబర్‌లో ఆయన కాలుజారి పడిపోయాడు. కాలి ఎముక విరిగిపోయింది. వారాల తరబడి శయ్యమీద ఒంటరిగా పడి ఉండవలసి వచ్చింది. ఈ దెబ్బ ఆయనను మానసికంగా బాగా క్రుంగదీసింది. ఇప్పుడు ఆయన వయస్సు 85 సంవత్సరాలపైమాటే. క్రమంగా కళ్లల్లో శూన్యత ఏర్పడింది. ఈ జగన్నాటకం నుంచి ఇక నిష్క్రమించవలసినదేనని లోతుకుపోయినా బరువైన కళ్లు సూచిస్తున్నాయి.

ఇలాంటి సమయంలో తత్త్వశాస్త్రంలో ఆయన చేసిన విశేషకృషిని గుర్తిస్తూ టెంపుల్‌టన్ బహుమానం ప్రకటించారు. ఆ విషయం విని ఆయన ఏమీ మాట్లాడలేదు. రెప్పలుపైకి క్రిందకూ అల్లార్చాడు. ఆయనకు ఆ విషయం అర్థం అయిందో కాలేదో ఎవరికీ బోధపడలేదు.

17.4.1975వ తేదీన ప్రభాత సమయంలో ఆయన ఒక దీర్ఘమైన నిశ్వాస వదిలాడు. అంతే అదే చివరి శ్వాస. ఆ సమయంలోనే ఆయన ప్రాణనౌక తీరాన్నిదాటి వెళ్ళిపోయింది. ఒక మహోజ్జ్వల తార రాలిపోయింది. ఆయన గురువులలో బ్రహ్మ. అందుకే మహా మహోపాధ్యాయుడు.

**ఓం పూర్ణమిదః పూర్ణమదం పూర్ణాత్ పూర్ణముదుచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.**

★ ★ ★

# డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

(1888-1975)



విక్టరీ పబ్లిషర్స్
# 30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,
విజయవాడ - 520 002, ఫోన్ : 0866-2444156